www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

జయం మనదే!

- చివరి టెస్టులో భారత్ గెలుపు
- సూపర్ సిరాజ్ మెరుపు బంతులు
- అదరగొట్టిన ప్రసిద్ధ్, ఆకాశ్
- మలుపు తిరిగిన చివరి రోజు
- ఇంగ్లండ్‌తో సిరీస్ 2-2తో సమం

11


విజయోత్సాహంలో టీమిండియా

మంగళవారం | 5-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 128 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి మ.1.12 తదుపరి ద్వాదశి; నక్షత్రం: జ్యేష్ఠ ఉ.11.23 తదుపరి మూల; వర్జ్యం: రా.7.55-9.37; దుర్ముహూర్తం: ఉ.8.32-9.22, రా.10.24-11.07; అమృతఘడియలు: ఉ.6.10-7.52; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 5.59, సూర్యాస్తమయం: 6.42 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సచివాలయంలో క్యాబినెట్ సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు దామోదర, పొంగులేటి, ఉత్తమ్, తుమ్మల, జూపల్లి, శ్రీధర్‌బాబు, సీతక్క, శ్రీహరి, లక్ష్మణ్



ఊరు మార్చి.. పేరు మార్చి..

అవినీతి పునాదులతో కాళేశ్వరం నిర్మాణం.. అందుకే కూలిందని నివేదిక స్పష్టం చేసింది

- ఘోష్ కమిషన్ నివేదికను క్యాబినెట్ ఆమోదించింది
- త్వరలో అసెంబ్లీలో.. ఆ తర్వాత తుది నిర్ణయం
- మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు కారణాలను వివరిస్తూ కేసీఆర్ హయాంలోనే ఎన్డీఎస్‌ఏ నివేదిక ఇచ్చింది
- రాజకీయ కక్ష, వ్యక్తిగత ద్వేషంతో నిర్ణయం తీసుకోం
- క్యాబినెట్ సమావేశం తర్వాత సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- నిర్మాణ సంస్థలకు లబ్ధి చేకూర్చడానికే నామినేషన్ పద్ధతి
- గోదావరిలో జలకళ ప్రచారం కోసమే నీటి నిల్వ: ఉత్తమ్
- అసెంబ్లీని తప్పుదోవ పట్టించిన కేసీఆర్: భట్టి

హైదరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఊరు మార్చి.. పేరు మార్చి.. అంచనాలు మార్చి.. అవినీతి, అక్రమాల పునాదులతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని, ఈ విషయాను జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తన నివేదికలో స్పష్టంగా వివరించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇందులో ప్రజా ప్రతినిధులు, ఐఏఎస్ అధికారులు, ఇంజనీరింగ్ నిపుణులు, నిర్మాణ సంస్థల గురించి చాలా విశ్లేషణాత్మకంగా పేర్కొందని తెలిపారు. ఈ నివేదికను క్యాబినెట్‌లో ఆమోదించామని, రాబోయే రోజుల్లో శాసన సభలో ప్రవేశపెట్టి, అన్ని రాజకీయ పార్టీల నాయకులకు వారి అభిప్రాయాన్ని చెప్పే అవకాశాన్ని కల్పిస్తామని చెప్పారు. ప్రతిపక్ష నేత కేసీఆర్, ఆనాటి సాగునీటి పారుదల శాఖ మంత్రులు, అప్పటి ఇతర మంత్రులంతా వాళ్ల అభిప్రాయాలు చెప్పవచ్చని స్పష్టం చేశారు. శాసన సభలో, మండలిలో ప్రజా ప్రతినిధులు ఒక అవగాహన తెచ్చుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికను త్వరలోనే అసెంబ్లీలో ప్రవేశపెట్టి, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. ఆ తర్వాత.. సిఫారసుల అమలుకు ప్రభుత్వం ఒక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళుతుందన్నారు. ఇందులో ఎలాంటి శషభిషలు, రాజకీయ కక్షలకు తావు లేదని, పూర్తి ఇండిపెండెంట్, జ్యుడీషియల్ కమిషన్ చేసిన సూచనలను

మిగతా 12వ పేజీలో...

కాంగ్రెస్ అమ్ములపొదిలో కాళేశ్వరాస్త్రం!

12

- కేసీఆరే లక్ష్యంగా సంధించేందుకు సిద్ధం
- పంద్రాగస్టు తర్వాత జరిగే అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో దాడికి సన్నద్ధం
- అంతర్గత సమస్యలతో సతమతమవుతున్న బీఆర్‌ఎస్‌కు నివేదికతో కొత్త తలనొప్పి
- వివరణకు అసెంబ్లీకి కేసీఆర్ రావాల్సిందే!
- రాకుంటే కాంగ్రెస్ చేతికి ఆయుధం ఇచ్చినట్లే
- ఇప్పటికే 'కారు' దిగిపోతున్న నేతలు
- అరెస్టులు మొదలైతే మరిన్ని ఫిరాయింపులు
- భవితపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల్లో ఆందోళన!

బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిందే

12

- ఈ విషయంలో అస్సలు వెనక్కి వెళ్లొద్దు
- క్యాబినెట్ భేటీలో మంత్రుల స్పష్టీకరణ

కట్టుడు నుంచి కూలుడు దాకా సర్వం కేసీఆరే!

- సీఎంలా కాకుండా ఇంజనీర్‌లా వ్యవహారం
- తందానా అన్న నాటి మంత్రి హరీశ్, అధికారులు
- నిశ్శబ్ద నేరస్థుడు నాటి ఆర్థిక మంత్రి ఈటల
- నిపుణుల కమిటీ నివేదికను కావాలనే తొక్కిపెట్టారు
- క్యాబినెట్ ఆమోదం లేకుండానే అంచనాల పెంపు
- నామినేషన్‌పై అప్పగించి కాంట్రాక్టు సంస్థలకు లబ్ధి
- జస్టిస్ పీసీ ఘోష్ నివేదిక సారాంశాన్ని క్యాబినెట్‌కు అందజేసిన అధికారుల కమిటీ

6

మెదడు కరిగించి, రక్తాన్ని రంగరించి కాళేశ్వరం ప్రాజెక్టు కట్టానన్న కేసీఆర్ మాటలు మరోవిధంగా నిజమేనని తేలిపోయింది. ప్రాజెక్టు కట్టుడు నుంచి కూలుడు దాకా బాధ్యత అంతా కేసీఆర్‌దేనని.. తన బుర్రలో పుట్టిన ఆలోచనతో ఇష్టానికి నిర్ణయం తీసుకుని, తన ఇష్టం వచ్చినట్టు కాళేశ్వరం బ్యారేజీలు కట్టించారని అధికారికంగా స్పష్టమైంది. ప్రాజెక్టు నిర్మాణంలో ప్రతి చిన్న అంశం కూడా కేసీఆర్ కనుసన్నల్లో, ఆయన ఇష్టానుసారమే జరిగిందని జస్టిస్ ఘోష్ కమిషన్ వెల్లడించింది.


- పూర్తి వివరాలు 13లో



ఇది రాజకీయం కాదు..
బీసీల ఆత్మగౌరవ పోరాటం!

- కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలి
- 42% రిజర్వేషన్లకై ఢిల్లీలో దీక్ష చేస్తాం
- ఇందిరాపార్కు వద్ద నిరాహార దీక్షలో కవిత
- హైకోర్టు అనుమతి లేకపోవడంతో విరమణ

10



మాజీ సీఎం, జేఎంఎం వ్యవస్థాపకుడు
శిబుసోరేన్ కన్నుమూత

- కిడ్నీ వ్యాధికి చికిత్స పొందుతూ.. ఢిల్లీలోని ఒక ఆస్పత్రిలో తుదిశ్వాస
- సుదీర్ఘ పోరాటం జరిపి ఝార్ఖండ్ రాష్ట్రాన్ని సాధించిన నేత
- శూన్యమే మిగిలింది: సీఎం హేమంత్
- ఆస్పత్రికెళ్లి నివాళులర్పించిన మోదీ

2

నిజమైన భారతీయుడు అలా మాట్లాడడు!

- రాహుల్ చైనా వ్యాఖ్యలపై సుప్రీం ఆగ్రహం
- ఆ దేశం 2000 చ.కి.మీ.ల మన భూభాగాన్ని ఆక్రమించిందని మీకెలా తెలుసు?
- మీరు అక్కడ ఉన్నారా? అంటూ నిలదీత

2

ఎప్పుడైనా.. ఎవరినైనా..
అరెస్టు చేయవచ్చు!

- బీఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ కుట్ర.. ఆందోళన చెందవద్దు
- ఫాంహౌస్‌లో పార్టీ నేతలతో కేసీఆర్ సమావేశం
- కాళేశ్వరం నివేదికపై ఆరున్నర గంటలకుపైగా చర్చ
- కేటీఆర్, హరీశ్, జగదీశ్, ప్రశాంత్ హాజరు
- దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపు
- నేడు హరీశ్‌రావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్



హైదరాబాద్, గజ్వేల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ పార్టీ కుట్ర పన్నుతోందని, ఇందులో భాగంగా కొంతమంది బీఆర్‌ఎస్ నేతలను ఎప్పుడైనా అరెస్ట్ చేయవచ్చని, ఎవరూ ఆందోళన చెందవద్దని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పార్టీ శ్రేణులకు సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రిపోర్టును పీసీ ఘోష్ కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన నేపథ్యంలో ఎర్రవల్లిలోని తన ఫాంహౌస్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్వర్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డిలతో కేసీఆర్ సోమవారం

మిగతా 10వ పేజీలో...

బీఆర్‌ఎస్‌కు
గువ్వల గుడ్‌బై



- పార్టీ సభ్యత్వానికి మాజీ ఎమ్మెల్యే బాలరాజు రాజీనామా.. కేసీఆర్‌కు లేఖ
- 9న బీజేపీలో చేరేందుకు ఏర్పాట్లు
- కమలంతో కారు కలువనుందనే ఈ నిర్ణయం
- అదే బాటలో మర్రి, బీరం అంటూ ప్రచారం
- ఖండించిన జనార్దన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి
- కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే కొండబాల
- హస్తంను వీడి బీజేపీలో చేరనున్న అబ్రహాం

హైదరాబాద్/మహబూబ్‌నగర్/నాగర్‌కర్నూలు/ఖమ్మం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నాహాలు జరుగుతున్న వేళ ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌కు ఎదురు దెబ్బ తగిలింది. గులాబీ పార్టీలో కీలకంగా వ్యవహరించిన అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే, నాగర్‌కర్నూల్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు గువ్వల బాలరాజు ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను పార్టీ అధినేత కేసీఆర్‌కు పంపించారు. శనివారమే బాలరాజు తన రాజీనామా లేఖను పంపించినట్లు, అయితే ఆయనను బుజ్జగించేందుకు బీఆర్‌ఎస్ అధిష్ఠానం ప్రయత్నించినట్లు తెలిసింది. కానీ, బాలరాజు మాత్రం తన రాజీనామా విషయంలో పునరాలోచన లేదని చెప్పినట్లు

మిగతా 3వ పేజీలో...




ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి; మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

తగవుల దారిలో తమ్ముడు..
రేవంత్‌కు అండగా అన్న!

- రాజగోపాల్‌రెడ్డిలో మంత్రిపదవి దక్కలేదన్న అసంతృప్తి!
- సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై తరచూ విమర్శలు
- సోషల్ మీడియా జర్నలిస్టులపై రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేయడంపైన రాజగోపాల్‌రెడ్డి తీవ్ర అభ్యంతరం
- వారిని గౌరవించాలని, అవమానించవద్దని సూచన
- గతంలో పదేళ్లు నేనే సీఎం అన్న వ్యాఖ్యపైనా విమర్శలు
- మళ్లీ రేవంతే ముఖ్యమంత్రి కావాలంటున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. గణపతి పూజ కూడా చేశానని వెల్లడి
- పార్టీలో రేవంత్ జూనియర్ అయినా గౌరవిస్తానని వ్యాఖ్య

14



అమీర్‌పేటలో ప్రధాన రహదారిపై పోటెత్తిన వరద

కుండపోత వర్షం..
హైదరాబాద్ ఆగమాగం

- చెరువులను తలపించిన రహదారులు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- కొట్టుకుపోయిన ద్విచక్ర వాహనాలు
- పలు ప్రాంతాల్లో స్తంభించిన ట్రాఫిక్
- రేపూ ఎల్లుండి పలు జిల్లాలకు అలర్ట్
- శ్రీశైలానికి లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆదివారం రాత్రి నుంచి సోమవారం వరకూ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుండటంతో రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ విభాగం తెలిపింది. క్యుములోనింబస్

మిగతా 14వ పేజీలో...

భారత్‌పై మరిన్ని సుంకాలు

- రష్యా చమురు కొనుగోళ్లే కారణం
- భారత్ నుంచి భారీగా రష్యాకు ఆర్థిక వనరులు.. దీంతోనే ఉక్రెయిన్ యుద్ధం
- డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు



ఘాటుగా స్పందించిన భారత్

- ఐరోపా సమాఖ్య, అమెరికా అన్యాయంగా టార్గెట్ చేస్తున్నాయి
- యుద్ధంతో చమురు ఐరోపాకు..
- మార్కెట్లలో స్థిరత్వం కోసమే.. రష్యా నుంచి చమురు కొనుగోలు
- వీటిని ప్రోత్సహించింది అమెరికానే..
- భారత విదేశాంగ శాఖ వ్యాఖ్యలు

2



ప్రత్యేక రైల్లో ఢిల్లీకి వెళ్తున్న మీనాక్షి, మహేశ్‌గౌడ్, మంత్రులు పొన్నం, వాకిటి

బీసీ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే వరకు
పోరాడుతాం

- ఢిల్లీలో బీసీల ధర్నాను విజయవంతం చేయాలి
- కాంగ్రెస్ శ్రేణులకు మీనాక్షి పిలుపు
- ముస్లింల పేరుతో మోకాలడ్డుతున్న బీజేపీ
- మహేశ్ కుమార్ గౌడ్
- ప్రత్యేక రైలులో ఢిల్లీకి తరలివెళ్లిన నేతలు

హైదరాబాద్, కుషాయిగూడ, యాదాద్రి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీసీ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేంత వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పేర్కొన్నారు. సోమవారం చర్లపల్లి రైల్వే స్టేషన్ నుంచి ప్రత్యేక రైలులో మంత్రులు పొన్నం ప్రభాకర్,

మిగతా 10వ పేజీలో...

బీసీ రిజర్వేషన్లపై ఢిల్లీకి ఉద్యమబాట

- నేడు దేశ రాజధానికి సీఎం, కాంగ్రెస్ శ్రేణులు
- రేపు జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా

10

భారత్‌పై మరిన్ని సుంకాలు

» రష్యా చమురు కొనడం వల్లే ఉక్రెయిన్ యుద్ధం: ట్రంప్



వాషింగ్టన్, ఆగస్టు 4: భారత్‌పై మరిన్ని సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఇప్పటికే భారత్‌పై 25% సుంకాలను విధించిన ట్రంప్.. రష్యా నుంచి భారీగా చమురు కొనుగోలు చేస్తున్నందుకు టారిఫ్‌లను పెంచుతానంటూ తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో ప్రకటించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్.. బహిరంగ మార్కెట్లో దాన్ని విక్రయించి.. భారీగా లాభాలను గడిస్తోందని విమర్శించారు. చమురు కొనుగోళ్లతో భారత్ నుంచి రష్యాకు ఆర్థిక వనరులు చేరుతున్నాయని, దాంతో ఉక్రెయిన్ యుద్ధం ఆగడం లేదని ఆక్షేపించారు. రష్యాతో యుద్ధం వల్ల ఎంత మంది ఉక్రెయిన్ పౌరులు చనిపోతున్నారో భారత్‌కు అవసరం లేదని, అందుకే.. ఆ దేశంపై సుంకాలను మరింతగా పెంచబోతున్నామని స్పష్టంచేశారు. ట్రంప్ హెచ్చరికలపై భారత ప్రభుత్వ వర్గాలు స్పందించాయి. అమెరికా సుంకాలతో భారత్‌పై స్వల్ప ప్రభావం ఉంటుందని, జీడీపీ తగ్గుదల 0.2శాతాన్ని మించదని వివరించాయి. రష్యా చమురు కొనుగోలును ఆపే ప్రసక్తే లేదని తేల్చిచెప్పాయి. భారత విదేశాంగ శాఖ కూడా అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యలపై సీరియస్ అయ్యింది. భారత్‌ను అమెరికా, ఐరోపా సమాఖ్య అన్యాయంగా లక్ష్యంగా చేసుకుంటున్నాయని విమర్శించింది. "ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత.. రష్యా నుంచి భారత్ చమురు దిగుమతిని ప్రారంభించింది. యుద్ధం కారణంగా సంప్రదాయంగా వస్తున్న చమురు సరఫరా ఐరోపాకు మళ్లింది. ఆ సమయంలో ప్రపంచ ఇంధన మార్కెట్లలో స్థిరత్వం కోసం రష్యా చమురు కొనుగోలుకు భారత్‌ను అమెరికానే ప్రోత్సహించింది" అని వివరించింది.

రష్యాతో వ్యాపారంలో భారత్‌ను విమర్శిస్తున్న దేశాలు కూడా

భారత్‌లో వినియోగదారులకు అందుబాటు ధరల్లో చమురు లభించేలా భారత్ చర్యలు తీసుకుంటోందని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. చమురు కొనుగోలుపై భారత్‌ను విమర్శిస్తున్న దేశాలు కూడా రష్యాతో వ్యాపారం చేస్తున్నాయని గుర్తు చేసింది. "2024లో రష్యాతో ఐరోపా సమాఖ్య 67.5 బిలియన్ యూరోల విలువైన వాణిజ్యం జరిపింది. 2023లో సేవల రంగంలో 17.2 బిలియన్ యూరోల వాణిజ్యాన్ని కొనసాగించింది. ఈ మొత్తం విలువ భారత్-రష్యా మధ్య జరిగే వాణిజ్యం కంటే చాలా తక్కువ. అమెరికా కూడా తన అణు పరిశ్రమ కోసం రష్యా నుంచి యురేనియం హెక్సాఫ్లోరైడ్‌ను.. ఈవీ పరిశ్రమల కోసం పల్లాడియం, ఎరువులు, రసాయనాలను దిగుమతి చేసుకుంటోంది" అనిపేర్కొంది.

గాజాలో యుద్ధాన్ని ఆపండి..!

» ట్రంప్‌కు ఇజ్రాయెల్ భద్రతా సంస్థల మాజీ అధికారుల లేఖ

వాషింగ్టన్, ఆగస్టు 4: గాజాలో యుద్ధాన్ని ఆపేలా ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుపై ఒత్తిడి తీసుకురావాలని ఆ దేశ భద్రతా సంస్థలకు చెందిన విశ్రాంత ఉన్నతాధికారులు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను కోరారు. 600 మందికి పైగా విశ్రాంత అధికారులు, నిఘా సంస్థల మాజీ అధిపతులు ఈ మేరకు అమెరికా అధ్యక్షుడికి ఓ లేఖ రాశారు. హమాస్ ఇకపై ఇజ్రాయెల్‌కు వ్యూహాత్మక ముప్పు కాదని పేర్కొన్నారు. హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదరకపోవడం.. నెతన్యాహు గాజాపై దాడులను మరింత ఉధృతం చేయాలని భావిస్తున్న తరుణంలో ఈ లేఖ రాయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ లేఖ రాసిన వారిలో మొసాద్ మాజీ చీఫ్ తమీర్ పర్డో, షిన్ బెట్ మాజీ చీఫ్ అమీ అయలోన్, ఇజ్రాయెల్ మాజీ ప్రధాని ఎహుద్ బరాక్ తదితరులు కూడా ఉన్నారు. ఇజ్రాయెల్‌ను నెతన్యాహు వినాశనం వైపు నడిపిస్తున్నారని.. సైనిక లక్ష్యాలను సాధించినప్పటికీ యుద్ధాన్ని కొనసాగించడం సరికాదని వారు పేర్కొన్నారు. అయితే, గాజాలో ఇజ్రాయెల్ కొనసాగిస్తున్నది నరమేధం కాదని, అది యుద్ధమేనని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టం చేశారు. గాజాలో చిన్న పిల్లల ఆకలి చావుల దృశ్యాలను సోమవారం ట్రంప్ ఎదుట ప్రస్తావించిన విలేకరులు దాన్ని నరమేధంగా భావిస్తున్నారా? అని ప్రశ్నించగా, ట్రంప్ పైవిధంగా స్పందించారు.

మా దగ్గరా అణు జలాంతర్గాములున్నాయ్: రష్యా

మాస్కో, ఆగస్టు 4: అమెరికా పంపిన రెండు అణు జలాంతర్గాములను ఎదుర్కొనేందుకు తమ వద్ద చాలా ఎక్కువగానే అణు జలాంతర్గాములు ఉన్నాయంటూ రష్యా గట్టిగా కౌంటర్ ఇచ్చింది. రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రీ మెద్వెదేవ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతో ఆ దేశానికి చేరువలో రెండు అణు జలాంతర్గాములను మోహరించాలని తాను ఆదేశించినట్టు శుక్రవారం ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై తాజాగా రష్యా పార్లమెంటు సీనియర్ సభ్యుడు విక్టర్ వాడలాట్స్కీ స్పందించారు. 'అమెరికా అణు జలాంతర్గాముల కంటే రష్యా అణు జలాంతర్గాములు చాలా పెద్దవి' అన్నారు.

మద్యం మత్తులో డ్రైవింగ్..
కారుతో 30 మందిని ఢీకొట్టిన ఆర్మీ అధికారి

నాగ్‌పూర్, ఆగస్టు 4: సెలవుపై వచ్చిన ఓ ఆర్మీ అధికారి మద్యం మత్తులో కారు నడిపి 30 మందిని గాయపరిచాడు. దీంతో ఆగ్రహించిన స్థానికులు అతడిని చితకబాది పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగింది. అస్సాంలో సైనికుడిగా పనిచేస్తున్న హర్షపాల్ మహదేవ్ వాఘమారే (40) నాలుగు రోజుల సెలవుపై మహారాష్ట్రలోని తన స్వగ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 8:30 గంటల ప్రాంతంలో పక్క గ్రామానికి కారులో బయల్దేరాడు. అయితే, అప్పటికే మద్యం మత్తులో ఉన్న అతడు కారును వేగంగా, నిర్లక్ష్యంగా నడిపి రోడ్డుపై వెళ్తున్న దాదాపు 30 మందిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారు బోల్తాకొట్టి పక్కనే ఉన్న మురుగు కాలువలో పడిపోయింది. క్షణాల్లోనే అక్కడికి చేరుకున్న స్థానికులు ఆ మురుగు కాలువ నుంచి హర్షపాల్‌ను బయటకు లాగి చితకబాదారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఆ ఆర్మీ అధికారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అనంతరం అతడిపై కేసు నమోదు చేశారు.

సత్యేందర్ జైన్‌పై అవినీతి కేసు మూసివేత

న్యూఢిల్లీ, ఆగస్టు 4: ఆమ్ ఆద్మీ పార్టీ నేత సత్యేందర్ జైన్‌పై అవినీతి కేసును ఢిల్లీ కోర్టు మూసివేసింది. ఈ కేసును నాలుగేళ్ల పాటు దర్యాప్తు జరిపిన సీబీఐ.. జైన్ అవినీతికి పాల్పడినట్లు ఆధారాలు లేవని రౌస్ అవెన్యూ కోర్టులో క్లోజర్ రిపోర్ట్ సమర్పించింది. దీంతో ప్రత్యేక న్యాయమూర్తి జస్టిస్ దిగ్ వినయ్ సింగ్ ఈ కేసును మూసివేస్తున్నట్లు ప్రకటించారు. సత్యేందర్ జైన్ ఢిల్లీ ప్రజా పనుల విభాగం మంత్రిగా పనిచేస్తున్న సమయంలో ఔట్ సోర్సింగ్ ద్వారా 17 మంది కన్సల్టెంట్లను నియమించుకున్నారు. దీనిపై విజిలెన్స్ విభాగం 2019 మే నెలలో సత్యేందర్ జైన్‌పై ఎఫ్ఐఆర్ దాఖలు చేసింది.

ఎంపీల కొత్త ఫ్లాట్లు ప్రారంభానికి సిద్ధం

న్యూఢిల్లీ, ఆగస్టు 4: ఎంపీల హౌసింగ్ ప్రాజెక్టులో భాగంగా ఢిల్లీలోని బాబా ఖరక్‌సింగ్ మార్గ్‌లో నిర్మిస్తున్న కొత్త నివాస భవనాల పనులు పూర్తయ్యాయి. మొత్తం 184 రెసిడెన్షియల్ ఫ్లాట్లను నాలుగు అపార్టుమెంట్లుగా నిర్మించారు. ఒక్కో అపార్ట్‌మెంట్‌లో 25 అంతస్తులు ఉంటాయి. ప్రతి ఫ్లాట్ వైశాల్యం దాదాపు 5వేల చదరపు అడుగులు. ఒక్కొక్క ఫ్లాట్‌లో ఐదు బెడ్ రూమ్‌లు, ఎంపీల సహాయ సిబ్బంది కోసం రెండు ప్రత్యేక గదులు ఉంటాయి. ప్రతీ అపార్ట్‌మెంట్‌లో అండర్‌గ్రౌండ్‌లో రెండు అంతస్తులను పార్కింగ్ కోసం కేటాయించారు. మొత్తంగా ఐదు వందలకు పైగా వాహనాలను ఇక్కడ పార్క్ చేయవచ్చు. సామ్ ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనే కంపెనీ ఇటుకలను వాడకుండా కేవలం కాంక్రీటు-సిమెంటు మిక్సింగ్(ఆర్సీసీ), అల్యూమినియంతో రెండేళ్లలో ఈ అపార్ట్‌మెంట్లను నిర్మించింది. దీనికి రూ.550కోట్లు ఖర్చయ్యాయి.



ఎంపీల కోసం ఢిల్లీలో నిర్మించిన భవనాలు


నిజమైన భారతీయుడు అలా మాట్లాడడు!



రాహుల్ చైనా వ్యాఖ్యలపై సుప్రీం ఆగ్రహం

» ఆ దేశం మన భూభాగంలో 2వేల చ.కిమీ ఆక్రమించిందని మీకెలా తెలుసు?
» మీరు అక్కడ ఉన్నారా.. అని ప్రశ్న
» రాహుల్ మెరుగ్గా మాట్లాడాల్సిందని న్యాయవాది సింఘ్వీ అంగీకారం
» పరువు నష్టం కేసులో రాహుల్‌కు ఊరట
» లఖ్‌నవూ కోర్టులో విచారణపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ, ఆగస్టు 4: చైనా భారత భూభాగాన్ని ఆక్రమించిందని.. అరుణాచల్ ప్రదేశ్‌లో భారత జవాన్లను కొడుతోందని వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై సుప్రీంకోర్టు సోమవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆయన నిజంగా భారతీయుడైతే ఇలాంటి వ్యాఖ్యలు చేయరని స్పష్టంచేసింది. గల్వాన్ లోయలో 2020 జూన్‌లో భారత, చైనా సైనికుల మధ్య జరిగిన ఘర్షణల్లో 20 మంది భారత జవాన్లు అమరులైన సంగతి తెలిసిందే. చైనా భూభాగాన్ని ఆక్రమించుకుందని, ప్రధాని మోదీ, ఆయన ప్రభుత్వం చైనాకు లొంగిపోయారని 2022 డిసెంబరులో 'భారత్ జోడో యాత్ర' సందర్భంగా రాహుల్ విమర్శించారు. ఆయన భారత సైన్యాన్ని అవమానించేలా మాట్లాడారంటూ లఖ్‌నవూ ప్రత్యేక కోర్టులో ఉదయ్‌శంకర్ శ్రీవాస్తవ అనే వ్యక్తి పరువునష్టం దావా దాఖలు చేశారు. ఈ కేసులో తమ ముందు హాజరు కావాలని కోర్టు రాహుల్‌కు ఈ ఏడాది ఫిబ్రవరిలో సమన్లు జారీచేసింది. దీనిని ఆయన అలహాబాద్ హైకోర్టులో సవాల్ చేశారు. ఆయన వ్యాజ్యాన్ని న్యాయస్థానం మే 29న కొట్టివేసింది. ఆర్మీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా మాట్లాడే హక్కు వాక్ స్వాతంత్ర్యం కిందకు రాదని.. కోర్టు ముందు ఆయన హాజరు కావలసిందేనని స్పష్టంచేసింది. దీంతో తనపై కేసును రద్దుచేయాలంటూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో క్వాష్ పిటిషన్ వేశారు. ఇది సోమవారం జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ అగస్టీన్ జార్జి మసీహ్‌తో కూడిన ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా జస్టిస్ దత్తా రాహుల్ తీరుపై కటువైన వ్యాఖ్యలు చేశారు. 'చైనా మన భూభాగంలో 2 వేల చదరపు కిలోమీటర్లు ఆక్రమించిందని మీకెలా తెలుసు? మీరు అక్కడ ఉన్నారా? విశ్వసనీయ ఆధారాలేమైనా మీ వద్ద ఉన్నాయా? పార్లమెంటులో మాట్లాడకుండా సోషల్ మీడియాలో ఎందుకు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారు? ఎలాంటి ఆధారాల్లేకుండా ఇలాంటి ప్రకటనలు ఎందుకు చేస్తారు' అని ప్రశ్నలవర్షం కురిపించారు. నిజమైన భారతీయుడైతే ఇలా మాట్లాడరని స్పష్టం చేశారు. వీటిపై మీడియాలో ప్రచురించేలా ఇలా మాట్లాడకుంటే ఆయన ప్రతిపక్ష నేత ఎలా అవుతారని ఆయన తరఫు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ కోర్టును ప్రశ్నించారు. ధర్మాసనం స్పందిస్తూ.. సరిహద్దుల్లో సంక్షోభం జరుగుతుంటే ఇరువైపులా ప్రాణనష్టం జరుగడం అసాధారణం కాదని గుర్తుచేసింది. అయితే నిజమైన భారతీయులు కూడా మన జవాన్లను కొట్టి చంపారనే అంటారని సింఘ్వీ అన్నారు. ప్రభుత్వం సరైన వివరాలు చెప్పాలన్నదే రాహుల్ అభిమతమని.. సమాచారాన్ని అణచివేయడాన్నే ఆయన లేవనెత్తుతున్నారని తెలిపారు. జస్టిస్ దత్తా జోక్యం చేసుకుని.. బాధ్యతాయుత ప్రతిపక్ష నేతగా రాహుల్ ఇలా మాట్లాడి ఉండాల్సింది కాదని.. ఇలాంటి వ్యాఖ్యలు చేయడానికి తగు వేదికలు ఉంటాయని.. వీటిపై ఆయన పార్లమెంటులో ఎందుకు మాట్లాడరని జస్టిస్ దత్తా నిలదీశారు. రాహుల్ మరింత మెరుగ్గా వ్యాఖ్యలు చేసి ఉండాల్సిందని సింఘ్వీ అంగీకరించారు. అయితే అయనపై ఫిర్యాదు చేయడం.. ఆయన్ను వేధించడానికి చేసిన ప్రయత్నమని చెప్పారు. క్రిమినల్ ఫిర్యాదును కోర్టు పరిగణనలోకి తీసుకోదలిస్తే.. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 223 ప్రకారం.. నిందితుడి వాదనలు కూడా వినాలని.. ఈ కేసులో అలా జరుగలేదని తెలిపారు. దీంతో రాహుల్‌పై లఖ్‌నవూ కోర్టులో విచారణపై ధర్మాసనం స్టే విధించింది. కేసును కొట్టివేయాలన్న ఆయన అభ్యర్థనపై యూపీ ప్రభుత్వానికి, పరువునష్టం దావా వేసిన ఉదయ్‌శంకర్ శ్రీవాస్తవకు నోటీసులు జారీచేసింది. 3 వారాల్లో జవాబివ్వాలని ఆదేశించింది.



ప్రయాణికులకు 'ఎయిరిండియా' పరీక్ష!

ఒకేరోజు 2విమానాల్లో సాంకేతిక లోపం

బెంగళూరు, గన్నవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రెండు ఎయిరిండియా విమానాలు సోమవారం ఒకేరోజు సాంకేతిక సమస్యతో ప్రయాణికులను ఇక్కట్లకు గురిచేసింది. వీటిలో ఒకటి బెంగళూరు నుంచి కోల్‌కతాకు బయలుదేరి, గమ్యం చేరకుండానే వెనుదిరిగింది. ఢిల్లీ నుంచి విజయవాడ బయలుదేరాల్సిన మరో విమానంలో సాంకేతిక సమస్యతో నాలుగు గంటలు ఆలస్యంగా నడిచింది. వివరాలివీ.. బెంగళూరు నుంచి ఎయిరిండియా విమానం(1ఎక్స్ 2718) ఆదివారం రాత్రి 7.05 గంటలకు కోల్‌కతాకు బయల్దేరాల్సి ఉంది. కానీ 11 నిమిషాలు ఆలస్యంగా 7.16 గంటలకు టేకాఫ్ అయ్యింది. ఆకాశంలోకి వెళ్లిన కాసేపటికే విమానంలో హైడ్రాలిక్ సమస్య తలెత్తినట్లు పైలట్‌లు గుర్తించారు. కోల్‌కతాకు వెళ్లేందుకు సమయం పడుతుందని భావించి వెంటనే వెనుదిరిగారు. ముందు జాగ్రత్త చర్యగా, విమానంలో ఇంధనం బరువు తగ్గించేందుకు రాత్రి 9.19 గంటల వరకు ఆకాశంలోనే చక్కర్లు కొట్టించారు. అనంతరం బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో సురక్షితంగా ల్యాండ్ చేశారు. అలాగే, ఢిల్లీ-విజయవాడ ఎయిరిండియా విమానం ప్రతి రోజూ ఢిల్లీలో బయలుదేరి గన్నవరం విమానాశ్రయానికి మధ్యాహ్నం 12 గంటలకు వచ్చి 12.40కి ఢిల్లీ వెళుతుంది. ఈ క్రమంలో సోమవారం గన్నవరానికి బయలుదేరగా.. టేకాఫ్ సమయంలో పైలట్ సాంకేతిక సమస్యను గుర్తించి మళ్లీ రన్‌వే మీదకు తీసుకువచ్చారు. అందులో 155 మంది ప్రయాణికులున్నారు. సాంకేతిక సమస్యను సరి చేసిన తర్వాత సాయంత్రం 4 గంటలకు గన్నవరం చేరుకుంది. తిరిగి 4.48కి 103 మంది ప్రయాణికులతో ఢిల్లీ వెళ్లింది. మరో 32 మంది ప్రయాణికులు టికెట్లను క్యాన్సిల్ చేసుకున్నారు.

శ్రీకృష్ణుడే మొదటి మధ్యవర్తి!

» ఆ మార్గంలో వివాదాన్ని పరిష్కరించుకోవాలి
» యూపీలో బాంకే బిహారీ ఆలయ కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఆగస్టు 4: ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, శ్రీ బాంకే బిహారీ ఆలయ ట్రస్టు మధ్య వివాదం కేసులో సుప్రీంకోర్టు సోమవారం ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. శ్రీకృష్ణుడే 'మొదటి మధ్యవర్తి' అని, మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కరించుకొనేందుకు ప్రయత్నించాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చిలతో కూడిన ధర్మాసనం సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం, ఆలయ ట్రస్టు మధ్య వివాద పరిష్కారానికి, ఆలయ వ్యవహారాలు చూసుకొనేందుకు హైకోర్టు మాజీ న్యాయమూర్తి లేదా సీనియర్ రిటైర్డ్ జిల్లా జడ్జి నేతృత్వంలో ఒక కమిటీని ప్రతిపాదించింది. మథుర జిల్లాల్లోని వృందావన్‌లో బాంకే బిహారీ ఆలయం ఉంది. భక్తుల ప్రయోజనాలు, సౌకర్యాల కోసం ఆలయ నిధుల నుంచి రూ.500 కోట్లతో బాంకే బిహారీ ఆలయ కారిడార్‌ను అభివృద్ధి చేయాలని ప్రతిపాదిస్తూ యూపీ ప్రభుత్వం ఇటీవల ఆర్డినెన్స్ జారీచేసింది. దీన్ని సవాల్ చేస్తూ ఆలయ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇది ఒక ప్రైవేటు ఆలయం అని, తమ వాదనలు వినాలని వారి తరఫు సీనియర్ న్యాయవాది శ్యామ్ దివన్ కోరారు. దీనిపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు శ్రీకృష్ణుడి రాయబారం గురించి ప్రస్తావించింది. ఆయన ప్రపంచానికి తెలిసిన మొదటి మధ్యవర్తి అని పేర్కొంది. ఇదే సమయంలో ఆలయ నిర్వహణను తమ అధీనంలోకి తెచ్చుకొనేందుకు ఆర్డినెన్స్ తీసుకురావడంలో అంత తొందర ఎందుకని సర్వోన్నత న్యాయస్థానం యూపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అసలు మొదట ఆ ఆర్డినెన్స్ రాజ్యాంగ బద్ధతను పరిశీలించాలని అలహాబాద్ హైకోర్టుకు సూచించింది. ఆలయ నిధులు ఉపయోగించుకొనేందుకు యూపీ ప్రభుత్వం సుప్రీంకోర్టు నుంచి అనుమతి పొందిన 'రహస్య పద్ధతి' పట్ల అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ కేసులో ప్రధాన భాగస్వాముల వాదనలు వినని నేపథ్యంలో ఆలయ నిధులు వినియోగించుకొనేందుకు అనుమతిస్తూ మే 15న ఇచ్చిన తీర్పును నిలిపివేస్తామని, దీనిపై మంగళవారం ఉత్తర్వులు ఇస్తామని ధర్మాసనం పేర్కొంది. 1862లో నిర్మించిన బాంకే బిహారీ ఆలయం ఉత్తర భారతంలో ఇక ప్రముఖ పుణ్యక్షేత్రంగా ఉంది. దీని రోజువారీ ఆచారాలు, ఆలయ పాలనను వంశపారపర్యంగా వస్తున్న పూజారులైన షెబాయిత్‌లు నిర్వహిస్తుంటారు. అయితే 2022లో జన్మాష్టమి వేడుకల సందర్భంగా చోటుచేసుకున్న తొక్కిసలాటలో ఇద్దరు భక్తులు మరణించిన తర్వాత ఆలయాన్ని అభివృద్ధి చేయాలనే డిమాండ్ వచ్చింది. ఈ నేపథ్యంలో భక్తుల రద్దీని నిర్వహించేందుకు, భద్రతా ప్రమాణాలు పాటించేందుకు ఒక కారిడార్ ప్లాన్‌ను అభివృద్ధి చేయాలని 2023 సెప్టెంబరులో అలహాబాద్ హైకోర్టు యూపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

పార్లమెంటులో ప్రతిష్టంభనపై..

నేడు ఎన్డీయే.. 7న ఇండియా కూటముల భేటీ

న్యూఢిల్లీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై ప్రతిపక్షాలు బుధవారం కూడా లోక్‌సభలో తీవ్ర గందరగోళం సృష్టించాయి. ఓటర్ల జాబితా సవరణపై పార్లమెంట్‌లో చర్చించేది లేదని ప్రభుత్వం స్పష్టం చేయడంతో ఉభయ సభలు కొనసాగలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ ఆదివారం రాత్రి రాష్ట్రపతి ముర్ముతో సమావేశం అయ్యారు. కానీ, ఇటీవల మోదీ బ్రిటన్, మాల్దీవుల పర్యటన తర్వాత రాష్ట్రపతిని మర్యాద పూర్వకంగా కలిసినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. అయితే.. పార్లమెంట్‌లో ఏర్పడిన ప్రతిష్టంభనపైనే మోదీ చర్చించినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు, ఒడిసాలో వరుసగా జరుగుతున్న అత్యాచార ఘటనలపై వివరణ ఇచ్చేందుకు రాష్ట్రపతిని హోంమంత్రి అమిత్ షా కలిసినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. అయితే, జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించే విషయంపై మోదీ, అమిత్‌షా రాష్ట్రపతిని కలిసినట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై చిచ్చు రోజురోజుకూ పెరుగుతుండడంతో ప్రతిపక్షాలపై దాడిని ఎక్కుపెట్టేందుకు మోదీ మంగళవారం ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల షెడ్యూలు రీత్యా మొత్తం ఎన్డీయే ఎంపీలను సంఘటితం చేసి, అధికార కూటమి అభ్యర్థిని గెలిపించేందుకు అవసరమైన వ్యూహరచనను ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిసింది. ప్రతిపక్షాలు కూడా సంఘటిత కార్యాచరణను రూపొందించేందుకు ఈ నెల 7న భేటీకానున్నాయి. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ ఇవ్వనున్నారు. కూటమి నేతలంతా బిహార్ ఓటర్ల జాబితా అంశంపై నిరసనలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఈనెల 8న ఎన్నికల కమిషన్(ఈసీఐ) కార్యాలయం వరకు ఊరేగింపుగా వెళ్లాలని నిర్ణయించినట్లు సమాచారం.

మూగబోయిన గిరిజన గళం!

ఝార్ఖండ్ మాజీ సీఎం, జేఎంఎం అధినేత శిబుసొరేన్ కన్నుమూత

» కిడ్నీ వ్యాధికి చికిత్స పొందుతూ ఢిల్లీలోని ఓ ఆసుపత్రిలో తుదిశ్వాస
» ఝార్ఖండ్ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరు
» 'సంతాలీ జాతి గురూజీ'గా గుర్తింపు
» శూన్యమే మిగిలింది: హేమంత్

రాంచీ/న్యూఢిల్లీ, ఆగస్టు 4: గిరిజనుల హక్కుల కోసం, వారి సాధికారత కోసం, ముఖ్యంగా సంతాలీ జాతి అభివృద్ధి కోసం అవిరళ కృషి సల్పిన ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, ఝార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) పార్టీ వ్యవస్థాపకుడు శిబు సొరేన్ కన్నుమూశారు. 81 ఏళ్ల శిబు.. గత నెల రోజులకు పైగా కిడ్నీ సంబంధిత వ్యాధితో ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 8.56 గంటల సమయంలో ఆసుపత్రిలోనే ఆయన తుదిశ్వాస విడిచినట్టు డాక్టర్ ఏకే భల్లా ప్రకటించారు. "నెల రోజుల కిందట ఆయనకు గుండెపోటు వచ్చింది. ఆసుపత్రిలో అత్యవసర చికిత్సల విభాగంలో వైద్యం అందించాం. శిబు ప్రాణాలు కాపాడేందుకు అన్ని ప్రయత్నాలు చేశాం. సోమవారం పరిస్థితి విషమించి.. ఆసుపత్రిలో కుటుంబ సభ్యుల సమక్షంలోనే ఆయన తుదిశ్వాస విడిచారు." అని డాక్టర్ భల్లా వివరించారు.

సంతాలీ జాతి గురూజీ..

ఝార్ఖండ్‌ను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలనే సంకల్పంతో శిబు సొరేన్ చేపట్టిన ఉద్యమాలు.. దేశవ్యాప్తంగా ఆయనకు గుర్తింపు తెచ్చిపెట్టాయి. సుదీర్ఘకాలం ఉద్యమాలతోనే గడిపిన శిబు సొరేన్.. గిరిజనుల హక్కుల కోసం పోరాడారు. ముఖ్యంగా సంతాలీ ప్రజల అభ్యున్నతి, పేదరికం, విద్య వంటి వాటి కోసం ఉద్యమాలు చేశారు. ఫలితంగా సంతాలీ జాతి గురూజీ(దిశోం గురూజీ)గా ఆయన మన్ననలు పొందారు. 38 ఏళ్ల కిందట జేఎంఎం పార్టీని స్థాపించారు. ఝార్ఖండ్ ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా కూడా పనిచేశారు. అయితే.. ఆయన రాజకీయ జీవితం వివాదాల సుడుల్లో చిక్కుకుంది. పలు కేసులు కూడా నమోదై.. జైలుకు వెళ్లాల్సి వచ్చింది. కాగా, తన తండ్రి మరణంతో తనకు శూన్యమే మిగిలిందని ఝార్ఖండ్ సీఎం హేమంత్ సొరేన్ కన్నీటి పర్యంతమయ్యారు. "దిశోం గురూజీ మనల్ని వదిలి వెళ్లిపోయారు. నాకిప్పుడు శూన్యమే మిగిలింది." అని 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఇదిలావుంటే, మాజీ సీఎం శిబు మరణంతో ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ వర్షాకాల సమావేశాలను నిరవధికంగా వాయిదా వేశారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు రోజుల సంతాప దినాలను ప్రకటించింది. పార్టీలకు అతీతంగా పలువురు నాయకులు శిబు సొరేన్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. గిరిజన హక్కుల కోసం పోరాడిన యోధుడిగా అభివర్ణించారు.



నేడు అంత్యక్రియలు

శిబు సొరేన్ భౌతిక కాయాన్ని సోమవారం సాయంత్రం ఢిల్లీ నుంచి ఝార్ఖండ్ రాజధాని రాంచీకి తరలించారు. మంగళవారం ఉదయం వరకు జేఎంఎం కేంద్ర కార్యాలయంలో ప్రజల సందర్శనార్థం ఉంచనున్నారు. అనంతరం.. రామ్‌గఢ్ జిల్లాలోని శిబు స్వగ్రామానికి తరలించి అక్కడే అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

ఆసుపత్రికి మోదీ



శిబు సొరేన్ మరణ వార్త తెలియగానే.. ప్రధాని మోదీ గంగారామ్ ఆసుపత్రికి చేరుకుని నివాళులర్పించారు. సీఎం హేమంత్ సొరేన్ సహా కుటుంబ సభ్యులను ఓదార్చారు. గిరిజనుల కోసం శిబు జీవితాంతం కృషి సల్పారని, పేదలు, అట్టడుగు వర్గాల అభ్యున్నతిని ఆకాంక్షించారని ప్రధాని పేర్కొన్నారు. అదేవిధంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా శిబు మరణం పట్ల సంతాపం వ్యక్తం చేశారు. అమిత్‌షా, నితిన్ గడ్కరీ సహా పలువురు కేంద్ర మంత్రులు, ఝార్ఖండ్ గవర్నర్ సంతోష్ గంగ్వార్, ఖర్గే, రాహుల్ గాంధీ, సీఎం రేవంత్, తమిళనాడు సీఎం స్టాలిన్ సంతాపం వ్యక్తం చేశారు. ఆర్జేడీ అధినేత, మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్.. శిబు సొరేన్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అట్టడుగు వర్గాలకు సామాజిక న్యాయం, సాధికారత కోసం తామిద్దరం కలిసి ఉద్యమించిన రోజులు ఇప్పటికీ కళ్లముందు కదలాడుతున్నాయని పేర్కొన్నారు.

అమెరికాలోకి 'ఈబీ-5' రూట్!

» హెచ్1బీ, విద్యార్థి వీసాలపై ఆంక్షల నేపథ్యంలో పెట్టుబడుల మార్గం పడుతున్న భారతీయులు
» 2024 అక్టోబర్- 2025 జనవరి మధ్య 1,200 దరఖాస్తులు..649 వీసాల మంజూరు



వాషింగ్టన్, ఆగస్టు 4: అమెరికాలో ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ వీసాలపై ఆంక్షలు పెరిగాయి. ముఖ్యంగా భారతీయులకు విద్యార్థి వీసాలు, చదువు పూర్తయ్యాక తాత్కాలిక ఉద్యోగం చేసుకునేందుకు వీలు కల్పించే హెచ్ 1బీ వీసాలు అందడం కష్టంగా మారింది. 2024 అక్టోబర్ నుంచి 2025 మార్చి మధ్య.. అంతకుముందు ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఏకంగా 43.5 శాతం విద్యార్థి వీసాలు తగ్గిపోయాయి. ఈ క్రమంలో అమెరికాకు వెళ్లేందుకు భారతీయులు 'ఈబీ-5' వీసాల మార్గం పడుతున్నారు. ఇక అమెరికాలో గ్రీన్‌కార్డులు, హెచ్1బీ తదితర వీసాలకు సంబంధించి ప్రస్తుతం కోటీ పది లక్షల వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్టు అంచనా. వాటిని పరిష్కరించేందుకు కొన్నేళ్లు పట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో త్వరగా శాశ్వత నివాస అర్హత పొందేందుకు ఈబీ-5 వీసా వీలు కల్పిస్తుంది. 'అమెరికన్ ఇమిగ్రెంట్ ఇన్వెస్టర్ అలయన్స్ (ఏఐఐఏ)' తాజాగా ఈ వివరాలను వెల్లడించింది. గత ఏడాది ఏప్రిల్ నుంచి భారతీయులు ఈబీ-5 వీసాల కోసం దరఖాస్తు చేసుకోవడం ఇంతకు ముందెన్నడూ లేనంతగా పెరిగిందని తెలిపింది. ఈబీ-5 వీసాల కోసం భారతీయుల నుంచి 2024 అక్టోబర్ నుంచి 2025 జనవరి వరకు 1,200 దరఖాస్తులు వచ్చాయని, అందులో 649 వీసాలు మంజూరయ్యాయని యూనైటెడ్ స్టేట్స్ ఇమిగ్రేషన్ ఫండ్ (యూఎస్ఐఎఫ్) చీఫ్ నికోలస్ తెలిపారు. అంతకుముందు 2023 అక్టోబర్ నుంచి సెప్టెంబర్ 2024 వరకు ఏడాది కాలంలో మంజూరైన ఈబీ-5 వీసాలు 1,428 మాత్రమేనని తెలిపారు. అమెరికాలో నివాసం కోసం రకరకాల వీసాల అవసరం లేకుండా 'గోల్డ్ కార్డు' ప్రవేశపెడుతున్నామని.. రూ.43.8 కోట్లు (5 మిలియన్ డాలర్లు) చెల్లించి 'గోల్డ్ కార్డు'ను పొందవచ్చని ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఈబీ-5 వీసా స్థానంలోనే గోల్డ్ కార్డును ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అది అమల్లోకి వచ్చేలోగానే ఈబీ-5 వీసాతో అమెరికాలో నివాస అర్హత పొందేందుకు భారతీయులు క్యూ కడుతున్నారు.

ఏమిటీ ఈబీ-5 వీసా..

అమెరికాలో పెట్టుబడులు పెట్టి, స్థానికంగా ఉద్యోగాలు కల్పించేవారికి నివాస అర్హత కల్పిస్తూ ఈబీ-5 వీసాలను జారీ చేస్తారు. అమెరికాలోని సాధారణ ప్రాంతాల్లో సుమారు రూ.9.2 కోట్లు (10.5 లక్షల డాలర్లు) లేదా 'టార్గెటెడ్ ఎంప్లాయ్‌మెంట్ ఏరియా (టీఈఏ)'లలో రూ.7 కోట్లు (8 లక్షల డాలర్లు) పెట్టుబడిగా పెట్టాల్సి ఉంటుంది. పెట్టుబడి పెట్టినవారితోపాటు వారి జీవిత భాగస్వామి, వివాహం కాని 21 ఏళ్లలోపు పిల్లలకు అమెరికాలో శాశ్వత నివాస అర్హత లభిస్తుంది.. ఈబీ-5 గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాక మూడు నుంచి ఆరు నెలల్లోపే ఉద్యోగ, ప్రయాణ పర్మిట్లు వస్తాయని.. ఈబీ-5 గ్రీన్‌కార్డు మంజూరయ్యే వరకు ఆగాల్సిన అవసరం లేదని వివరించారు. కాగా, అమెరికాలో స్థానికుల ఉద్యోగావకాశాలను విదేశీ విద్యార్థులు కొల్లగొట్టేందుకు హెచ్-1బీ వీసాలు కారణమవుతున్నాయని.. అందువల్ల హెచ్-1బీ వీసాలను మొత్తంగా ఎత్తేయాలని ట్రంప్ సన్నిహితుడు స్టీవ్ బానన్ డిమాండ్ చేశారు. అమెరికాకు వస్తున్న విదేశీ విద్యార్థులను వారి చదువు పూర్తికాగానే స్వదేశాలకు తిప్పి పంపేయాలని ప్రతిపాదించారు.

పీసీబీ అధికారుల తీరు బాగాలేదు

సీఎం రేవంత్‌కు మంత్రి కొండా ఫిర్యాదు



హైదరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ)కి సంబంధించిన కీలక అంశాలపై కనీస సమాచారం అందడం లేదని మంత్రి కొండా సురేఖ ఆగ్రహంగా ఉన్నారు. ఆ విభాగం ఉన్నతాధికారులే ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. పీసీబీకి సంబంధించి ఉన్నతస్థాయి సమీక్షలు నిర్వహించిన సమయంలోనూ అధికారులు కనీస సమాచారం లేకుండా మొక్కుబడిగా హాజరవుతున్నారని.. సూచనలు, సలహాలు ఇస్తే వాటిని పరిగణనలోకి తీసుకోవడం లేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో అధికారుల తీరుపై ఆమె నేరుగా సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. కీలక అంశాలకు సంబంధించి తనకు సమాచారం ఇవ్వకుండా పీసీబీ అధికారులే ఫైళ్లు క్లియర్ చేసేసుకుంటున్నారని చెప్పినట్లు తెలిసింది. కీలక నిర్ణయాలు, ఫైళ్లకు సంబంధించిన సమాచారం తన దృష్టికి తీసుకురావడం లేదని.. ఏవైనా అంశాలపై లేఖలు రాసినా అధికారులు వాటిని పక్కనబెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. అత్యంత కీలక ప్రభుత్వ విభాగాల్లో పీసీబీ ఒకటి కావడంతో బోర్డుకు సీఎస్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఏ నిర్ణయం తీసుకోవాలన్నా సీఎస్ అనుమతితోపాటు బోర్డులో చర్చ జరగాల్సి ఉంటుంది. అయితే, సీఎస్ రోజువారీ ప్రభుత్వ కార్యక్రమాలతో తీరిక లేకుండా ఉండడంతో బోర్డు సమావేశాలకు హాజరవడం లేదని తెలుస్తోంది. సీఎస్ సమావేశాలు నిర్వహించకపోవడం, మంత్రికి సమాచారం ఇవ్వకపోవడంతో అసలు ఆ విభాగంలో ఏం జరుగుతోందనేది ప్రభుత్వానికి తెలియని పరిస్థితి నెలకొంది. దీన్ని తీవ్రంగా పరిగణించిన మంత్రి సురేఖ అధికారుల తీరుపై సీఎంకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

బీఆర్‌ఎస్‌కు గువ్వల గుడ్‌బై

(మొదటి పేజీ తరువాయి)



గాంధీభవన్‌లో కొండబాల కోటేశ్వరరావుకు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న మహేశ్‌కుమార్‌గౌడ్, భట్టి విక్రమార్క



వీఎం అబ్రహం

సమాచారం. కాగా, బాలరాజు బీజేపీలో చేరనున్నట్లు, ఈ నెల 9న కాషాయ కండువా కప్పుకొనేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై ఆయనను 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో సంప్రదించగా.. రాజీనామాను ధ్రువీకరించడంతో పాటు అంబేడ్కరిజం, జాతీయవాద భావజాలం ఉన్న పార్టీలో చేరతానని అన్నారు. 2006లో బీఆర్‌ఎస్‌లో చేరిన గువ్వల 2014, 2018 ఎన్నికల్లో ఆ పార్టీ తరఫున అచ్చంపేట నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రభుత్వ విప్‌గా కూడా పనిచేశారు. అయితే 2023 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఓడిపోయాక నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్‌ను ఆశించారు. కానీ, తనను కాదని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ఎంపీ టికెట్ ఇవ్వడంపై బాలరాజు కొంతకాలంగా తన సన్నిహితుల వద్ద అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్.. బీజేపీతో పొత్తు పెట్టుకోవడమో, విలీనం కావడమో జరుగుతుందనుందని వార్తలు వస్తున్నాయని, అదే జరిగితే తన స్థానం గల్లంతవుతుందని బాలరాజు భావించినట్లు సమాచారం. అందుకే తానే ముందుగా బీజేపీలో చేరితే ఆ సమస్య ఉండదనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై బీఆర్‌ఎస్ కార్యకర్త ఒకరితో బాలరాజు జరిపిన ఫోన్ సంభాషణకు సంబంధించిన ఆడియో లీకైంది. కాగా, బీఆర్‌ఎస్‌కు గువ్వల రాజీనామా చేయడంతో ఆయన ప్రధాన అనుచరుడు పదర మాజీ జడ్పీటీసీ సభ్యుడు రాంబాబుతో పాటు మరికొందరు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొన్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు.

గువ్వల బాటలో అబ్రహం..

బీఆర్‌ఎస్‌కు గువ్వల బాలరాజు రాజీనామా నేపథ్యంలో అదే జిల్లాకు చెందిన నాగర్‌కర్నూలు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి కూడా గులాబీ పార్టీని వీడుతున్నట్లు ప్రచారం జరిగింది. వారిని 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా తాము బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతామని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. గద్వాల జిల్లా అలంపూర్ మాజీ ఎమ్మెల్యే వీఎం అబ్రహం కాంగ్రెస్ పార్టీని వీడి బీజేపీలో చేరేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల వరకు బీఆర్‌ఎస్‌లోనే కొనసాగిన అబ్రహం.. చివరి నిమిషంలో టికెట్ దక్కకపోవడంతో కాంగ్రెస్ చేరారు. హస్తం పార్టీ అభ్యర్థి సంపత్‌కుమార్ తరఫున ప్రచారం చేశారు. అయితే అక్కడ బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలవగా, కాంగ్రెస్‌లో సంపత్ వర్గంతో అబ్రహంకు పొసగడం లేదన్న ప్రచారం ఉంది. తాజా వార్తలపై అబ్రహంను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా.. కాంగ్రెస్ పార్టీతో తన బంధం గత అసెంబ్లీ ఎన్నికల నాటితోనే తెగిపోయిందని అన్నారు. తాను అసలు కాంగ్రెస్ పార్టీ సభ్యత్వమే తీసుకోలేదన్నారు. బీజేపీలో చేరికకు సంబంధించి ఆ పార్టీ అధిష్ఠానం నుంచి, తన అనుచరుల నుంచి ఒత్తిళ్లు వస్తున్న మాట వాస్తవమేనన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన కొండబాల

ఖమ్మం జిల్లా మధిర మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ కొండబాల కోటేశ్వరరావు బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమక్షంలో సోమవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. కొండబాలతో పాటు మధిర మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ బందం శ్రీనివాసరావు పలువురు మాజీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కూడా కాంగ్రెస్‌లో చేరారు.

15 నుంచి వార్షిక ఫాస్టాగ్ పాస్

రూ.3 వేలతో 200 ట్రిప్పులు ప్రయాణించొచ్చు

హైదరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన వార్షిక ఫాస్టాగ్ పాస్ ఈ నెల 15 నుంచి అమల్లోకి రానుంది. వాహనదారుడు ఏడాదిలో 200 ట్రిప్పులు ఈ పాస్‌తో ఉచితంగా ప్రయాణించే అవకాశం ఉంటుంది. వార్షిక పాస్ కోసం వాహనదారులు ప్రత్యేకంగా ఫాస్టాగ్ కార్డు తీసుకోవాల్సిన అవసరం లేదు. వాహన్ పోర్టల్‌లో అవసరమైన వివరాలు నమోదు చేస్తే ప్రస్తుతం ఉన్న ఫాస్టాగ్‌తోనే పాస్ సదుపాయాల్ని పొందవచ్చు. రూ. 3 వేలు చెల్లించి వార్షిక ఫాస్టాగ్ పాస్ తీసుకుంటే ఏడాది పాటు మనుగడలో ఉంటుంది.

మార్గదర్శిపై కేసు కొట్టివేత

రామోజీరావు మరణం నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) చట్టానికి విరుద్ధంగా డిపాజిట్లు సేకరించారన్న ఆరోపణల కేసులో మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కు సోమవారం హైకోర్టులో ఊరట లభించింది. యజమాని రామోజీరావు మరణించిన నేపథ్యంలో ఇక ఆ సంస్థపై కేసు అవసరం లేదని స్పష్టం చేసింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ దాఖలు చేసిన రెండు క్వాష్ పిటిషన్లను అనుమతించి ఆ సంస్థపై నాంపల్లి మెట్రో పాలిటన్ మేజిస్ట్రేటు కోర్టులో ఉన్న కేసును కొట్టివేసింది. ఈ మేరకు జస్టిస్ శ్యాంకోషీ, జస్టిస్ కే సుజనల ధర్మాసనం నిర్ణయాన్ని వెలువరించింది. హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్)గా నమోదైన మార్గదర్శి సంస్థ అనుమతి లేకపోయినప్పటికీ ఆర్బీఐ చట్టంలోని 45 (ఎస్) నిబంధనకు విరుద్ధంగా ప్రజల నుంచి నగదు డిపాజిట్లు స్వీకరించిందనేది ప్రధాన ఆరోపణగా ఉంది. దీనిపై 2008లో ట్రయల్ కోర్టులో కేసు విచారణ ప్రారంభమైంది. ఈ కేసును కొట్టివేయాలని మార్గదర్శి ఉమ్మడి ఏపీ హైకోర్టులో 2011లో పిటిషన్లు దాఖలు చేసింది. అనంతరం వాటిపై విచారణ చేపట్టిన తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీ రజనీ ధర్మాసనం.. మార్గదర్శికి అనుకూలంగా 2018 డిసెంబర్ 31న తీర్పు ఇచ్చింది. దీనిని సవాల్ చేస్తూ పిటిషన్‌దారు అయిన మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. ఈ కేసును మళ్లీ సమగ్రంగా విచారించాలని తెలంగాణ హైకోర్టును ఆదేశించింది. ఈ క్రమంలోనే మార్గదర్శి సంస్థ యజమాని రామోజీరావు మరణించారు. మార్గదర్శి తరఫున అన్నీ తానై వ్యవహరించిన రామోజీరావు మరణించిన తర్వాత క్రిమినల్ కేసు కొనసాగడానికి అవకాశం లేదని, క్రిమినల్ కేసుల్లో వారసులపై చర్యలు తీసుకోవడం అనేది ఉండదని మార్గదర్శి సంస్థ మధ్యంతర అప్లికేషన్లు దాఖలు చేసింది. ఈ వాదనతో ధర్మాసనం ఏకీభవించి కేసును కొట్టివేసింది.

మేడ్చల్‌లో పేలిన గ్యాస్ సిలిండర్

ఒకరి మృతి.. ముగ్గురికి తీవ్రగాయాలు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణంలోని మార్కెట్ రోడ్డులో ఓ ఇంట్లో వంట గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. పేలుడు ధాటికి ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. పేలుడు సమయంలో ఇంటి ముందు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న యువకుడికి శకలాలు బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పేలుడు సమయంలో ఇంట్లో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. షార్ట్ సర్క్యూట్ వల్ల పేలుడు జరిగిందా, లేక గ్యాస్ లీకేజీ వల్ల జరిగిందా అనేది పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన యువకుడి వివరాలు కూడా తెలియరాలేదు.

తెలంగాణలో ఐఐఎం ఏర్పాటు చేయాలి

లోక్‌సభలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి

హనుమకొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) ఏర్పాటుపై కేంద్రం వెంటనే నిర్ణయం తీసుకోవాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సోమవారం లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలో ఐఐఎం లేని ఏకైక రాష్ట్రం తెలంగాణనే అని ఎంపీ గుర్తు చేశారు. లోక్‌సభ వర్షాకాల సమావేశాల్లో ఎంపీ డాక్టర్ కావ్య ఈ అంశాన్ని లేవనెత్తారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఐఐఎంకు అవసరమైన భూమి, మౌలిక వసతులు సిద్ధం చేసిందన్నారు. హైదరాబాద్‌లో ఇప్పటికే ఐఎస్‌బీ, ఐఐటీ-హైదరాబాద్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో ఐఐఎం ఏర్పాటుకు అనువైన వాతావరణం ఉందని పేర్కొన్నారు. ఇందుకు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్ స్పందిస్తూ ప్రస్తుతం హైదరాబాద్‌లో ఐఐఎం స్థాపనకు ఎటువంటి ప్రతిపాదన కేంద్రం వద్ద పరిశీలనలో లేదనిచెప్పారు. దేశంలో 21 ఐఐఎంలు ఉన్నాయని వివరించారు. కేంద్రం స్పందనపై ఎంపీ అసంతృప్తి వ్యక్తంచేశారు. తెలంగాణ రాష్ట్రంలోని యువతకు మంచి మేనేజ్‌మెంట్ విద్య అవసరంఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి రాష్ట్రానికి తప్పనిసరిగా ఐఐఎం మంజూరు చేయాలని డాక్టర్ కావ్య కోరారు.

'సృష్టి' కేసులో మరో డాక్టర్ అరెస్ట్

శంషాబాద్‌లో అదుపులోకి విధులత.. ఒక్కొక్కరుగా పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు

హైదరాబాద్‌సిటీ/అడ్డగుట్ట/శంషాబాద్ రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సృష్టి ఫర్టిలిటీ కేంద్రం కేసులో మరో మహిళా డాక్టర్ అరెస్టయ్యారు. ఈ కేసులో డాక్టర్ విధులత పాత్ర ఇదివరకే వెలుగులోకి రావడంతో.. పోలీసులు ఆమెపై లుకౌట్ నోటీసు జారీ చేశారు. ఈ క్రమంలో సికింద్రాబాద్‌కు చెందిన డాక్టర్ విధులత సోమవారం సాయంత్రం విశాఖ వెళ్లేందుకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆమెపై లుకౌట్ నోటీసు ఉండడంతో ఎయిర్‌పోర్టు భద్రతను పర్యవేక్షించే సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది గోపాలపురం పోలీసులకు సమాచారం అందజేశారు. దాంతో పోలీసులు ఆమెను అరెస్టు చేసి, గోపాలపురం స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదైనప్పుడే విధులత పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చినట్లు పోలీసులు తెలిపారు. ఆమె నమ్రతకు బినామీ డాక్టర్ అని తెలుస్తోంది. ఈ కేసులో మరికొందరు నిందితుల కోసం గాలిస్తున్నట్లు వెల్లడించారు. అయితే, మరో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. కాగా.. ఈ కేసులో ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రత పోలీసు కస్టడీ మంగళవారంతో ముగియనుంది. ఇప్పటి వరకు జరిపిన విచారణలో ఆమె పిల్లల్లేని దంపతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు వసూలు చేసినట్లు గుర్తించారు. నమ్రత కస్టడీ ముగిశాక చంచల్‌గూడ మహిళా జైలుకు తరలించనున్నారు. ఆమె కుమారుడు జయంత్‌కృష్ణ, ఇతర నిందితులను కూడా కస్టడీకి తీసుకుని, విచారించాలని పోలీసులు భావిస్తున్నారు.

4 కేసులు.. 15 అరెస్టులు

సృష్టి కేసులో బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. నల్లగొండకు చెందిన ఓ జంట.. తమ వద్ద నమ్రత రూ.44 లక్షలు వసూలు చేసిందని ఫిర్యాదులో పేర్కొంది. మరో జంట రూ.18లక్షలు, ఓ ఎన్నారై జంట రూ.25 లక్షల చొప్పున నమ్రతకు ముట్టజెప్పినట్లు వివరించారు. ఈ ఫిర్యాదులతో కలిపి పోలీసులు మొత్తం 4 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఇవి కాకుండా సృష్టి ఫర్టిలిటీ కేంద్రంపై తెలుగు రాష్ట్రాల్లో పదికిపైగా ఠాణాల్లో కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఇటీవల రాజస్థాన్ దంపతులు ఇచ్చిన ఫిర్యాదుతో నమోదైన కేసులో.. డాక్టర్ నమ్రత, ఆమె కుమారుడు జయంత్ కృష్ణ, విశాఖకు చెందిన కళ్యాణి అచ్చాయమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ చెన్నారావు, గాంధీ ఆస్పత్రి అనస్థీషియా డాక్టర్ సదానందం, అసోంకు చెందిన ధనశ్రీ సంతోషి, మహమ్మద్ అలీ ఆదిక్, నస్రీన్ బేగం.. ఇలా 15 మందిని పోలీసులు అరెస్టు చేశారు. తాజాగా విధులత, కృష్ణ, శేషగిరిరావు, శ్రీనివాస్, సురేఖ, నయీందాస్, ఆశాబేగం ఉన్నట్లు సమాచారం.

ఏజీ ఆడిట్ ప్రస్తావించిన అంశాలను నివృత్తి చేశాం

విత్తన ధ్రువీకరణ విస్తీర్ణంలో హెచ్చుతగ్గులుంటాయి

విత్తన, సేంద్రియ ధ్రువీకరణ అథారిటీ డైరెక్టర్ కె. కేశవులు

హైదరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విత్తన, సేంద్రియ ధ్రువీకరణ అథారిటీలో ప్రతి సంవత్సరం ఏజీ ఆడిట్ పూర్తయిన వెంటనే ఆడిటింగ్ వారు ప్రస్తావించిన అంశాలన్నింటిని లేఖ రూపంలో నివృత్తి చేశామని, ఇది సర్వసాధారణంగా జరిగే ప్రక్రియని డైరెక్టర్ కె. కేశవులు తెలిపారు. ఆన్‌లైన్ పద్ధతిలో విత్తన ధ్రువీకరణ పద్ధతి అమలు చేస్తున్నామని, గత 7 ఏళ్లలో విత్తన ధ్రువీకరణ విస్తీర్ణంలో హెచ్చుతగ్గులున్నాయన్నారు. సరాసరి లక్ష నుంచి 1.30 లక్షల ఎకరాల్లో రిజిస్ట్రేషన్లు అవుతుంటాయని తెలిపారు. 'విత్తన ధ్రువీకరణ సంస్థలో రూ.20 కోట్లకు తేలని లెక్కలు' అనే శీర్షికతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. అథారిటీ తానే బిల్డింగుల నిర్మాణం చేపట్టదని, పారదర్శకత కోసం వాటి నిర్మాణ బాధ్యతలను ఇతర ప్రభుత్వరంగ నిర్మాణ సంస్థలకు అప్పగించినట్లు వివరించారు. కొత్త భవనాలు నిరుపయోగంగా ఉన్నాయనేది అవాస్తవమన్నారు. 'ఇస్టా' 1924లో ఏర్పడిన అంతర్జాతీయ ఇంటర్ గవర్నమెంటల్ సంస్థ అని, ఇది 80కి పైగా దేశాల వ్యవసాయ మంత్రిత్వశాఖలతో అనుసంధానం చేసుకొని విత్తన ప్రమాణాలు, విత్తన పరీక్ష పద్ధతులను రూపొందించి ఆ దేశాల ప్రభుత్వాలు పాటించేలా చొరవ తీసుకొని రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయడంలో ప్రముఖ పాత్ర పోషిస్తోందన్నారు. ఇది ప్రైవేటు సంస్థకాదని తెలిపారు. సొంత వాహనాలు, ప్రైవేటు సదస్సులకు, భవనాల నిర్మాణ ఖర్చుల విషయంలో అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని సోమవారం పేర్కొన్నారు.

చైల్డ్ పోర్న్ వీక్షణ.. పాల్వంచలో ఇద్దరిపై కేసు

పాల్వంచ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో చైల్డ్ పోర్నోగ్రఫీ వీడియోలు చూసిన ఇద్దరిపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన సైబర్ క్రైమ్ విభాగం ఆన్‌లైన్ కార్యకలాపాలపై నిఘా పెట్టింది. ఈ నేపథ్యంలో పాల్వంచకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఓ యాప్‌లో తరచూ చైల్డ్ పోర్న్ వీడియోలు చూస్తున్నారని గుర్తించింది. చట్ట ప్రకారం ఇది నేరం కావడంతో, విషయాన్ని పాల్వంచ పోలీసులకు తెలియజేసింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆ ఇద్దరినీ గుర్తించి వారిపై కేసు నమోదు చేశారు.

కలెక్టర్ల పనితీరుపై రేవంత్ ప్రశంసలు

ఆంధ్రజ్యోతి కథనం ఎక్స్‌లో పోస్ట్

హైదరాబాద్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయి పర్యటనలు చేపడుతున్న కలెక్టర్లు, అధికారుల పనితీరుపై సీఎం రేవంత్‌రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'పల్లెల వద్దకే పాలన' కథనాన్ని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "నా ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళ్లి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ.. ఆసుపత్రుల్లో వైద్య సేవలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను స్వయంగా వెళ్లి పరిశీలిస్తున్న కలెక్టర్లు, ఇతర అధికారులకు అభినందనలు. ప్రతి గూడెం, తండా, మారుమూల పల్లెకు ప్రజాపాలన చేరాలి. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందాలి. ఇదే స్ఫూర్తిని ఇక ముందు కూడా కొనసాగిస్తారని ఆశిస్తున్నా" అంటూ రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.

ఇంజనీరింగ్ సీట్ల తారుమారుపై విచారణ చేపట్టాలి

బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు రామకృష్ణ

బర్కత్‌పుర, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, కౌన్సెలింగ్ సీట్ల తారుమారుపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. బాలికల సీట్లను బాలురకు కేటాయించడం అత్యంత దుర్మార్గమని ఆయన పేర్కొన్నారు. ఇంజనీరింగ్ కళాశాలల ఫీజుల విత్‌డ్రా తేదీని ఈ నెల 23 వరకు పొడిగించాలని కోరారు. సోమవారం కాచిగూడలో రామకృష్ణ విలేకరులతో మాట్లాడారు. ఓపెన్ బాలికల కోటాలో బాలురకు అక్రమంగా కేటాయించిన ఇంజనీరింగ్ సీట్లను తక్షణమే రద్దు చేసి మెరిట్ ప్రకారం అర్హులైన విద్యార్థినులకు తిరిగి కేటాయించాలని, తప్పిదానికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని రామకృష్ణ కోరారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమాన రాకపోకలకు అంతరాయం

తీవ్ర ఇబ్బందులు పడిన ప్రయాణికులు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షం వల్ల సోమవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శంషాబాద్ నుంచి 119 మంది ప్రయాణికులతో సాయంత్రం 6.35 గంటలకు రాంచీ వెళ్లాల్సిన ఇండిగో విమానం టేకాఫ్ తీసుకునే సమయంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో అధికారులు ఆ సర్వీసును రద్దు చేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రయాణికులు ఎయిర్‌పోర్టులో ఆందోళనకు దిగారు. ఎట్టకేలకు వరాణసీ నుంచి శంషాబాద్ వచ్చిన విమానంలో ప్రయాణికులు రాంచీకి వెళ్లేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అలాగే వరాణసీ నుంచి శంషాబాద్ రావాల్సిన విమానాన్ని ఇక్కడ వాతావరణం అనుకూలించకపోవడంతో బెంగుళూరుకు మళ్లించారు. కాగా, సమస్యల పరిష్కారం కోసం క్యాబ్ డ్రైవర్లు ఆందోళన చేపడుతున్న నేపథ్యంలో శంషాబాద్‌లో సోమవారం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. క్యాబ్‌ల కోసం గంటల తరబడి పడిగాపులు కాశారు. 70 రోజులుగా ఎయిర్‌పోర్టులో క్యాబ్ డ్రైవర్లు ఆందోళన చేస్తున్నారు. జీఎంఆర్ అధికారులు, ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆందోళన కొనసాగుతోంది. సోమవారం భారీ వర్షం వల్ల నడుస్తున్న కొన్ని క్యాబ్‌లు కూడా బంద్ అయ్యాయి. దీంతో ఎయిర్‌పోర్టులో దాదాపు 700మంది ప్రయాణికులు వర్షంలో తడుస్తూ క్యాబ్‌ల కోసం చూశారు.

భార్యపై కోపంతో... రెండేళ్ల బిడ్డను నేలకేసి కొట్టిన తండ్రి

నర్సాపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): భార్యపై ఆగ్రహంతో.. మద్యం మత్తులో ఉన్న ఓ కసాయి తండ్రి తన రెండేళ్ల చిన్నారిని నేలకేసి కొట్టిన ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్‌లో సోమవారం వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. మండలంలోని తుజాల్‌పూర్‌కు చెందిన ప్రశాంత్, ఇందు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు. భర్తతో గొడవల కారణంగా ఇందు అచ్చంపేటలో తన పుట్టింటిలో ఉంటోంది. ఆదివారం సాయంత్రం భార్య వద్దకు వచ్చిన ప్రశాంత్ ఆమెతో గొడవ పడ్డాడు. ఆమెను కొట్టేందుకు ప్రయత్నించగా, భయంతో పెద్ద కుమార్తెను తీసుకుని పక్కింట్లోకి వెళ్లింది. దీంతో ఇంట్లో ఉన్న చిన్న కుమార్తెను ఎత్తుకుని కోపంతో నేలకేసి కొట్టాడు. తీవ్రంగా గాయపడిన పాపను ఇరుగుపొరుగు వారు హుటాహుటిన నర్సాపూర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు, చిన్నారిని హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

అయోమయం... జగన్ నాదం!

వెంకటేశ్ నాయుడిపై అర్థంలేని వాదనలు.. జగన్ రోత పత్రికలో విచిత్ర కథనాలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అడ్డగోలు సమర్థనలు... అడ్డదిడ్డం వాదనలు! గుట్టలుగా నోట్లకట్టలతో దొరికిపోయిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అనుచరుడు వెంకటేశ్ నాయుడుని వెనకేసుకొచ్చేందుకు జగన్ రోత పత్రిక నానా తంటాలు పడుతోంది. అసలు ఆయన తమ పార్టీకి చెందిన వ్యక్తా... లేక, కూటమి పార్టీలకు మద్దతుదారా? కనీసం ఈ విషయంపైనా స్పష్టత ఇవ్వలేక తన పాఠకులనూ గందరగోళంలోకి నెడుతోంది. అభద్రతా భావంతో అర్థంలేని వాదనలను తెరపైకి తెస్తోంది. మద్యం కుంభకోణం కేసులో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని, వెంకటేశ్ నాయుడును బెంగళూరు విమానాశ్రయంలో ఒకే రోజు, ఒకే సమయంలో,ఇద్దరినీ కలిపి 'సిట్' అధికారులు అరెస్టు చేశారు. ఆయన చెవిరెడ్డి ప్రధాన అనచరుడనేది నిర్వివాదాంశం. ఆదివారం సంచికలో జగన్ రోత పత్రిక పరోక్షంగా ఈ విషయాన్ని అంగీకరించింది. పట్టుబడిన డబ్బులు మద్యం స్కామ్‌కు సంబంధించినవి కావని... వెంకటేశ్ నాయుడికి రియల్ ఎస్టేట్ వ్యాపారం ఉందని వెనకేసుకొచ్చింది. ఒక్కరోజు తిరగ్గానే... సోమవారం సంచికలో వెంకటేశ్ నాయుడు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులతో దిగిన ఫొటో ప్రచురించి... అతను టీడీపీ మద్దతుదారుడన్నట్లుగా 'కవరేజీ' ఇచ్చింది. నిజానికి... పలు సందర్భాల్లో అనేక రాజకీయ పార్టీల నాయకులతో వెంకటేశ్ నాయుడు ఫొటోలు దిగారు. టీడీపీ, బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలతోనూ ఫొటోలు దిగారు. 'మరి... దొరికిపోయిన డబ్బులు వాళ్లందరివీ కూడా అని అనుకోవచ్చు కదా!' అనే అతితెలివి లాజిక్కును లేవనెత్తింది. వెంకటేశ్ నాయుడు వేర్వేరు సందర్భాల్లో ఇతర పార్టీలకు చెందిన నేతల పక్కన నిలబడి ఫొటోలు దిగడం నిజమే. కానీ... చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వంటి నేతలతో 'తాడేపల్లి ప్యాలెస్'లోకి వెంకటేశ్ నాయుడు డైరెక్ట్ ఎంట్రీ ఇచ్చారు. జగన్‌ను అనేకపర్యాయాలు కలిశారు. ఇద్దరూ ఆత్మీయ కరచాలనాలు చేసుకున్న చిత్రాలు అనేకం బయటికి వచ్చాయి. తాడేపల్లి ప్యాలెస్‌లోకి 'ఎంట్రీ' అంత ఈజీ కాదని... ఎవరు పడితే వారు లోపలికి వెళ్లి, జగన్‌ను కలిసే అవకాశం రాదని వైసీపీ నేతలకు బాగా తెలుసు. అంతెందుకు... 'చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆయన స్నేహితుడు వెంకటేశ్ నాయుడుపై సిట్ సమర్పించిన రిమాండ్ నివేదికలు ప్రభుత్వ పెద్దల కుట్రను మరోసారి వెలుగులోకి తెచ్చాయి" అని జగన్ పత్రిక ఒక కథనంలో పేర్కొంది. 'అతను మా వాడే' అని ధ్రువీకరించింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఇజ్రాయెల్‌లో యుద్ధ వ్యతిరేకత!

హమాస్‌తో తమదేశం చేస్తున్న యుద్ధం నిలిచిపోవాలని ఇజ్రాయెల్‌కు చెందిన ఆరువందలమంది రిటైర్డ్ సీనియర్ భద్రతాధికారులు, సైనికాధికారులు కోరుకున్నారట. యుద్ధం ఆపేయమని మా బెంజమిన్ నెతన్యాహూకు చెప్పండి అంటూ అమెరికా అధ్యక్షుడికి 550 మంది మాజీ ఉన్నతాధికారులు ఓ లేఖ రాశారు. మాజీ ప్రధాని ఇహూద్ బరాక్, మాజీ సైన్యాధ్యక్షులు, మొసాద్ మాజీ అధినేతలు, రక్షణ మంత్రులు, పోలీస్ చీఫ్‌లు కలిసి విడుదల చేసిన వీడియో కూడా ఒకటి మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమవుతున్నది. హమాస్ ఇక ఎంతమాత్రం ఇజ్రాయెల్ ఉనికికి ప్రమాదకరం కాదని, యుద్ధం కొనసాగించడం ద్వారా ఇజ్రాయెల్ తన గౌరవాన్ని కోల్పోతున్నదని వీరి వాదన. 23 నెలలుగా జరుగుతున్న యుద్ధం ఆగనిపక్షంలో దేశభద్రతకు మంచిదికాదని వారు అభిప్రాయపడుతున్నారు. మొసాద్ మాజీ అధినేత ఒకరు మనం ఓటమి అంచున ఉన్నామని కూడా వ్యాఖ్యానించారు.

ప్రపంచం మనల్ని తప్పుపడుతోంది, మన పాపాలను గమనిస్తోంది అంటూ గాజా మృత్యుఘోషపట్ల వీరు సానుభూతి వెలిబుచ్చారు. యుద్ధం ఎందుకు ఆరంభమైందో, ఆ లక్ష్యం పరిపూర్ణమైందని, ఇంకా ఎందుకు కొనసాగుతోందన్నది అర్థంలేని, అర్థంకాని అంశమని వారంటున్నారు. తన పదవిని కాపాడుకోవడానికి, తనమీద ఉన్న కేసులను కదలకుండా చేయడానికీ నెతన్యాహూ యుద్ధం కొనసాగిస్తున్నాడన్న విమర్శ ఎంతోకాలంగా ఉన్నదే. ఇప్పుడు వీరి వీడియోలు, లేఖలు మరింత ఒత్తిడిపెంచేందుకు ఉపకరిస్తాయి. సుదీర్ఘయుద్ధంతో ఐడీఎఫ్ బలగాలు నిరాశానిస్పృహల్లోకి జారిపోయాయని, విసుగుచెంది, డస్సిపోయి ఉన్న బలగాలు కూడా యుద్ధం ఆగిపోవాలని ఆకాంక్షిస్తున్నాయని వార్తలు వస్తున్నాయి.

హమాస్ దగ్గర బందీలుగా ఉన్న తమవారు ఎంతటి ఘోరమైన స్థితిలో ఉన్నారో ఇటీవలి వీడియోల్లో ఇజ్రాయెలీలు చూశారు. హమాస్‌ను దుంపనాశనం చేయడం, బందీలను విడిపించడం లక్ష్యంగా యుద్ధం కొనసాగిస్తున్నట్టు నెతన్యాహూ చెప్పుకుంటారు. కానీ, హమాస్ తీవ్రంగా దెబ్బతిన్నదేకానీ, తుడిచిపెట్టేయడం మాత్రం నెతన్యాహూ తరంకాలేదు. తన వద్ద ఉన్న బందీల్లో కొందరిని హమాస్ తనకుతానుగా అప్పగించడం వినా, ఇజ్రాయెల్ వారిని విడిపించిందేమీ లేదు. ఈ నేపథ్యంలో, అత్యంత దుర్భరమైన పరిస్థితుల మధ్య, ఎముకలగూళ్ళుగా మారిన శరీరాలతో ఇజ్రాయెలీ బందీలున్న వీడియోలు, చిత్రాలు వెలుగుచూసి నెతన్యాహూను ఆత్మరక్షణలో పడేశాయి. తమవారిని హమాస్‌కు బలిపెడుతున్నాడన్న బంధుజనం విమర్శలు తీవ్రమైనాయి. తక్షణమే యుద్ధాన్ని ఆపివేసి, బందీలను విడిపించి తేవాలంటూ పలుచోట్ల ప్రదర్శనలు కూడా జరిగాయి. ఈ నేపథ్యంలోనే, అమెరికా అధ్యక్షుడికి లేఖలు, నెతన్యాహూ మీద విమర్శలు తిరిగి మొదలైనాయి.

గాజాలో సాగుతున్నది నరమేధం కాదంటున్నారు ట్రంప్. కాల్పుల విరమణ పకడ్బందీగా అమలు జరుగుతూ, బందీల అప్పగింతల ప్రక్రియ సాఫీగా సాగుతున్నదశలో, గాజాను ఒక అద్భుతమైన రిసార్టుగా మార్చేయాలన్న ట్రంప్ కలనెరవేర్చడంకోసం నెతన్యాహూ తిరిగి ఊచకోత ఆరంభించిన విషయం తెలిసిందే. చివరకు ఆకలిని కూడా ఆయుధంగా వాడి ఒక్కప్రాణికూడా అక్కడ ఉండకూడదన్న లక్ష్యంతో ఇద్దరూ పనిచేస్తున్నారు. పసికందులనుంచి వృద్ధులవరకూ అందరినీ ఆకలి మింగేస్తున్నది. అన్నంకోసం నిలబడినవారు క్యూలైన్లలోనే కన్నుమూస్తున్నారు. ఆహారంకోసం ఎదురుచూస్తున్నవారినీ, ఎగబడినవారినీ ఇజ్రాయెల్ నిర్దాక్షిణ్యంగా చంపుతోంది. ఆహారపంపిణీ కేంద్రాల వద్ద తొక్కిసలాటలు, కాల్పుల్లో వందలాదిమంది మరణిస్తున్నారు. ఒకపక్క ఆకలిచావులు, మరోవైపు బందీల విడుదల ఇజ్రాయెల్ మీద తీవ్రమైన ఒత్తిడిపెంచుతున్నాయి. హమాస్ వద్ద ఇంకా మిగిలివున్న యాభైమందిలో 20మంది సజీవంగా ఉండివుంటారని అంచనా. ఈ నేపథ్యంలో, ట్రంప్ ప్రతిపాదించిన 60 రోజుల కాల్పుల విరమణ, ఆయుధాల అప్పగింత, బందీల విడుదల ఇత్యాది అంశాలను హమాస్ పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఇజ్రాయెల్ సైన్యాలు వెనక్కుపోవడం నుంచి పాలస్తీనా రాజ్యం స్థాపన వరకూ అది చాలా డిమాండ్లు ముందుకు తెస్తోంది. ఒప్పందానికి సిద్ధమని అంటూనే ఇరుపక్షాలూ రాజీపడకపోవడంతో చర్చలు కదలడం లేదు. ఈ ప్రతిష్టంభన తొలగనంతవరకూ గాజాలో కరువు, ఆకలిచావులకు ముగింపు ఉండదు.

కాంగ్రెస్ డీఎన్ఏలోనే 'సామాజిక న్యాయం'

స్వాతంత్ర్యానంతరం నెహ్రూ మొదలుకొని మన్మోహన్‌సింగ్ వరకూ అన్ని ప్రభుత్వాలూ ఏ మినహాయింపూ లేకుండా సామాజిక న్యాయసాధనకు పాటుబడ్డాయి. అట్టడుగువర్గాల ఆర్థికావకాశాల మెరుగుదలకు కృషిచేశాయి. ఈ రెండు సాధనాల ద్వారా నిజమైన జాతీయ ప్రగతికి దృఢమైన పునాదులు పడ్డాయి. సామాజిక న్యాయం సమకూర్చటం మొదలుకొని ఆర్థికశక్తిగా ఆవిర్భవించటం వరకూ సాగిన ఎదుగుదలలో ఉన్నది కాంగ్రెస్ వారసత్వమే. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఓబీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు ఖరారు చేయటం ఆ వారసత్వం కొనసాగింపే.

సామాజిక న్యాయం! ఈ మాట ఇటీవల తరచుగా వినిపిస్తోంది. నిన్న మొన్న కళ్లు తెరిచిన పార్టీలు, కొందరు నాయకులు తామే దానికి ఆద్యులమని భ్రమపడి రకరకాల వ్యాఖ్యలు చేస్తున్నారు. స్వాతంత్ర్య సాధనకు పూర్వం నుంచీ సామాజిక న్యాయాన్ని తన డీఎన్ఏలో భాగం చేసుకున్న కాంగ్రెస్ పార్టీకి ఇది వింతగా అనిపిస్తున్నది. ఎందుకంటే ఆరంభం నుంచీ సామాజిక న్యాయవిస్తరణ, ఆర్థికావకాశాల మెరుగుదల అనే రెండు మూలస్తంభాలే మన దేశ ప్రగతి ప్రస్థానాన్ని నిర్వచిస్తున్నాయి. ఈ ప్రస్థానానికి కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వాలే సంపూర్ణంగా దోహదపడ్డాయి. నిరుపేదలూ, అట్టడుగువర్గాల అభ్యున్నతి అనేది కేవలం నైతిక బాధ్యతగా కాక జాతీయ ప్రగతికి దోహదపడే నిజమైన సాధనాలుగా కాంగ్రెస్ విశ్వసించటమే ఇందుకు కారణం. కేంద్రంలో అయినా, రాష్ట్రాల్లోనైనా కాంగ్రెస్ ప్రభుత్వాలున్నప్పుడే సామాజిక న్యాయం, పేదరిక నిర్మూలన, ఆర్థికాభివృద్ధి సాధ్యమయ్యాయన్నది చరిత్ర చాటుతున్న సత్యం. దీనికి కొనసాగింపుగానే తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న దృఢ సంకల్పంతో ఉంది. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం దీనికి ఆమోదం తెలిపే దాకా కాంగ్రెస్ పార్టీ విశ్రమించదు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం, మా అధినేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టింది. దాని ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించింది. వెనకబడిన తరగతులకు రాజకీయాధికారం ఇచ్చే ఈ సంకల్పానికి బీజేపీ, బీఆర్ఎస్ మద్దతు పలకకపోతే బీసీల ద్రోహులుగా మిగిలిపోతారు.

ఒక్కసారి చరిత్రను తిరగేస్తే, భారత ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలోని కాంగ్రెస్ రాజ్యాంగ సమానతకు పథనిర్దేశం చేసింది. రాజ్యాంగ ముసాయిదా రూపకల్పనకు నియమించిన రాజ్యాంగ నిర్మాయక సభ సారథ్యాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు నెహ్రూ అప్పగించారు. పర్యవసానంగానే షెడ్యూల్ కులాలు, జాతులకు పార్లమెంటులోనూ, అసెంబ్లీల్లోనూ, ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ రిజర్వేషన్లు కల్పించే రాజ్యాంగం రూపుదిద్దుకుంది. ఈ రక్షణలు దశాబ్దాలు గడుస్తున్నా, భిన్న రాజకీయ పక్షాల ఏలుబడులొచ్చినా నిరాటంకంగా, అప్రతిహతంగా సాగుతున్నాయంటే అది కాంగ్రెస్ సమ్మిళిత భావనకూ, నిబద్ధతకూ చిహ్నం.



కాంగ్రెస్ ప్రభుత్వాలు సమ్మిళిత అభివృద్ధి భావన కేంద్రంగా వ్యూహరచన చేశాయి. నెహ్రూ, అంబేద్కర్‌ల హయాంలో రిజర్వేషన్లకు రాజ్యాంగపరమైన గ్యారెంటీ లభించటం మొదలుకొని ఇందిరాగాంధీ సంక్షేమ ఎజెండా, రాజీవ్‌గాంధీ విద్యా సాధికారత, పీవీ అమలుచేసిన ఓబీసీ రిజర్వేషన్లు, మన్మోహన్ ఉపాధి హామీ పథకం వరకూ అమలైనవన్నీ సమాజంలోని అత్యంత నిరుపేద వర్గాల అభ్యున్నతికి దోహదపడ్డాయి. సామాజిక న్యాయం సమకూర్చటం మొదలుకొని ప్రపంచ ఆర్థికశక్తిగా దేశం ఆవిర్భవించటం వరకూ సాగిన ఆ ఎదుగుదలలో దృఢమైన పునాదిగా ఉన్నది నిస్సందేహంగా కాంగ్రెస్ వారసత్వమే.

అనంతర కాలంలో వచ్చిన కాంగ్రెస్ ప్రధానమంత్రులందరూ ఆ దృఢమైన పునాది ఆలంబనగా సామాజిక న్యాయసాధన దిశగా మరిన్ని చర్యలు తీసుకున్నారు. ఉపాధి కల్పన ద్వారా పేదరిక నిర్మూలన, గృహకల్పన, అట్టడుగు వర్గాలకు సామాజిక మద్దతు వంటి లక్ష్యాలతో ఇందిరాగాంధీ ఇరవై సూత్రాల కార్యక్రమం రూపొందించారు. అత్యధికులకు విద్య అందించాలన్న సంకల్పంతో రాజీవ్‌గాంధీ మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత పట్టుదలతో అమలుచేయటం, ఎస్సీ విద్యార్థుల ఉన్నత చదువులే లక్ష్యంగా నేషనల్ ఫెలోషిప్‌ల ఏర్పాటు వంటివి అమలు చేశారు. ఈ చర్యలు డ్రాపౌట్‌లను తగ్గించి, అక్షరాస్యతను పెంచి, అవకాశాలను మరింత విస్తృతపరిచాయి.

సామాజిక న్యాయ విప్లవం పీవీ నరసింహారావు ప్రభుత్వ హయాంలోనూ కొనసాగింది. ఓబీసీలకు విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న మండల్ కమిషన్ సిఫార్సులకు చట్టబద్ధత కల్పిస్తూ ఆయన ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దేశ చరిత్రను కీలక మలుపు తిప్పింది. ఎందుకంటే, ఆ ఒక్క చర్యవల్ల ఓబీసీల ప్రాతినిధ్యం భిన్న రంగాల్లో అపారంగా పెరిగింది. పీవీ కేబినెట్‌లో డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఆర్థికమంత్రిగా, అనంతరం ప్రధానిగా సమ్మిళిత అభివృద్ధి విధానాన్ని కొనసాగించి కాంగ్రెస్ ప్రతిష్ఠను మరింత పెంచారు. అందరూ 'ఉపాధి హామీ పథకం'గా పిలిచే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారెంటీ చట్టం(నరేగా)ను 2005లో తీసుకొచ్చిన ఘనత ఆయన ప్రభుత్వానిదే. ప్రతిష్ఠాత్మకమైన ఈ చట్టం పల్లెసీమల్లోని అట్టడుగువర్గాలైన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కుటుంబాలకు ఏడాదికి వందరోజుల వేతనంతో కూడిన ఉపాధిని కల్పించింది.

ఉపాధి హామీ పథకం కింద సమకూరిన హక్కు పర్యవసానంగా దాదాపు 14.3 కోట్ల మంది లబ్ధిదారులున్నారు. అంటే గత మూడేళ్లలో ఈ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికీ కనీసం ఒక్కసారైనా పని దొరికిందని అర్థం. నవంబర్ 2023 నాటికి ఈ పథకం 221 కోట్ల పనిదినాలను సృష్టించింది. అంతకు క్రితం సంవత్సరం ఇది 208 కోట్లు. నిధుల రీత్యా చూస్తే కేంద్రం కోవిడ్ కాలాన్ని కలుపుకొని 2022 నాటికి ఎనిమిదేళ్లలో రూ.5 లక్షల కోట్లు వ్యయం చేసింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో దీని కోసం రూ.60,000 కోట్లు కేటాయిస్తే, అది రూ.89,400 కోట్లకు పెరిగింది. అసలు వందరోజుల పని లక్ష్యాన్ని సంపూర్ణంగా సాధించాలంటే ఈ పథకానికి 1.1 లక్ష కోట్లు అవసరమవుతాయి. కాంగ్రెస్ పాలనలో ఈ పథక విస్తృతి అర్థవంతమైన పనికి, వేతనాలకు తోడ్పడి కోట్లాది కుటుంబాల్లో వెలుగులు నింపింది. ఉదాహరణకు దేశ జీడీపీ 1991 నాటి ఆర్థిక సంస్కరణల అనంతరం అది ఒక్కసారిగా ముందుకురికింది. 2000లలోనూ, అటు తర్వాత 6 నుంచి 8శాతం వార్షిక వృద్ధిరేటు నిలకడగా



సాగింది. తలసరి ఆదాయం 1991–2023మధ్య 360 శాతం పెరిగింది. మరోపక్క దారిద్ర్యం రేటు క్షీణిస్తూ కోట్లాది మందిని ప్రధాన ఆర్థిక స్రవంతిలోకి తీసుకురాగలిగింది. సామాజిక సమ్మిళితమూ, ఆర్థిక విస్తృతి చెట్టపట్టాలేసుకుని సాగాయి. రిజర్వేషన్లు ప్రాతినిధ్యానికి చోటు కల్పిస్తే, సంక్షేమ పథకాలు సామాన్యులకు దేన్నయినా తట్టుకునే సామర్థ్యాన్నిచ్చాయి.

ఇదే సమయంలో మన భారతీయ సంస్థలు సృజనాత్మకతకూ, అభివృద్ధికి ప్రతీకలుగా రూపుదిద్దుకున్నాయి. జవహర్‌లాల్ నెహ్రూ సంకల్పంతో 1962లో ప్రారంభమైన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ప్రపంచ శ్రేణి అంతరిక్ష యాత్రలకు చిరునామాగా మారింది. 1994లో పీవీ నరసింహారావు ప్రధానిగా ఉండగా, అభివృద్ధి చెందిన దేశాలను విస్మయానికి గురిచేసిన పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పిఎస్ఎల్‌వీ) వినియోగంలోకి వచ్చింది. ఇప్పుడు రక్షణ పరిశోధన సంస్థలు బ్రహ్మోస్, ఆకాశ్ వంటి క్షిపణులకు రూపకల్పన చేసి వాటిని ఎగుమతిచేసే స్థాయికి వెళ్లాయి.

ఇవన్నీ నిరూపిస్తున్నది ఒక్కటే– కాంగ్రెస్ ప్రభుత్వాలు సమ్మిళిత అభివృద్ధి భావన కేంద్రంగా వ్యూహరచన చేశాయి. నెహ్రూ, అంబేద్కర్‌ల హయాంలో రిజర్వేషన్లకు రాజ్యాంగపరమైన గ్యారెంటీ లభించటం మొదలుకొని ఇందిరాగాంధీ సంక్షేమ ఎజెండా, రాజీవ్‌గాంధీ విద్యా సాధికారత, పీవీ అమలుచేసిన ఓబీసీ రిజర్వేషన్లు, మన్మోహన్ ఉపాధి హామీ పథకం వరకూ అమలైనవన్నీ సమాజంలోని అత్యంత నిరుపేద వర్గాల అభ్యున్నతికి దోహదపడ్డాయి. కాంగ్రెస్ విధానాలు దేశాభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషించే విధంగా ఆ వర్గాలను తీర్చిదిద్దాయి.

ఉపాధి హామీ పథకం కింద 14 కోట్లకు మించిన కుటుంబాలు ఏటా తమ జీవికను పొందగలుగుతున్నాయి. ఆ పథకం తాలూకు వార్షిక వ్యయం దాదాపు రూ.90,000 కోట్లు. ఇటీవలి సంవత్సరాల్లో దీని సంచిత వ్యయం రూ.5 లక్షల కోట్లు దాటింది. కోట్లాది మంది దారిద్ర్యం నుంచి బయటపడి, జీవన అవకాశాలను మెరుగుపరుచుకున్నారు.

కాంగ్రెస్ నాయకత్వం అందించిన పాలన దేశాన్ని– జీడీపీ అంకెల ద్వారా కాదు... దుర్బల వర్గాల జీవితాల్లో వెలుగులు నింపటం ద్వారా– రూపాంతరం చెందించగలిగింది. చట్టంలో న్యాయాన్ని, విధానంలో సమానతను పొందుపరచటం వల్ల ఒక బలహీన, విభజిత సమాజం పల్లెసీమల ఆధారంగా నడిచే శక్తిమంతమైన ఆర్థిక వ్యవస్థగా రూపుదాల్చింది. సామాజిక న్యాయం సమకూర్చటం మొదలుకొని ప్రపంచ ఆర్థికశక్తిగా దేశం ఆవిర్భవించటం వరకూ సాగిన ఆ ఎదుగుదలలో దృఢమైన పునాదిగా ఉన్నది నిస్సందేహంగా కాంగ్రెస్ వారసత్వమే.

● దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి

వినమ్ర వ్యక్తిత్వం స్వేచ్ఛా కళాతత్త్వం

మాదిరాజు రంగారావు గారు తెలుగులో, సంస్కృతంలో గొప్ప పండితులు, కవితారాధకులు, కవి, సాహిత్య విమర్శకులు. పిన్న వయస్సులోనే డాక్టరేట్ తీసుకున్న ప్రజ్ఞాశాలి. అధ్యాపక వృత్తిలో వారు అధిరోహించని ఉన్నత శిఖరాలు లేవు. సీనియర్ ప్రొఫెసర్‌గా, డీన్‌గా ప్రసిద్ధులు. మృదుస్వభావి, వినయశీలి, పూర్వభాషి, బహుగ్రంథకర్త.

"Fame is the last infirmity of a noble mind," అన్నారు సుప్రసిద్ధ ఆంగ్లకవి మిల్టన్. రంగారావు గారి విషయంలో ఇది ప్రత్యక్షర సత్యం. నిజాయితీతో ఇచ్చే కాంప్లిమెంట్‌ను కూడా పట్టించుకోని వినయ భూషణులు ఆయన. మెచ్చుకోబోతే దారి మళ్ళిస్తారు! 'లైమ్‌లైట్'లో ఉండడానికి ఏ మాత్రం ఇష్టపడని పెద్ద మనిషి.

కొన్ని రోజులు విశ్వనాథవారి ఇంట్లో ఉండి శిష్యుడిగా కవితా కళ రహస్యాలను ఆకళింపు చేసుకున్న భాగ్యశాలి మాదిరాజు రంగారావు. అయినా తన గ్రంథాన్నొకదాన్ని శ్రీశ్రీకి అంకితమిచ్చిన సమ్యక్‌దృష్టి కలిగినవారు. తన పని తాను చేసుకుంటూ పోయినవారు, రాసుకుంటూ పోయినవారు.. తపస్సు చేసుకుంటూ పోయినట్లు. అది ఆయన మనోధర్మం. లోకం పొగడుతుందో, తెగుడుతుందో పట్టించుకోని వైరాగ్యం కలిగిన మనిషి.



మాదిరాజు రంగారావు గారి ప్రతి పంక్తీ ఏదో ఒక విషయ నిర్వచనమే. ప్రతి పంక్తీ అందమైన నిర్వచన క్లుప్తతతో, ఆలోచనాంశాలతో మన మేధస్సును, హృదయాన్ని ఆకట్టుకునేదే. ఆయన పదాలలోని శబ్దం, అర్థం భవిష్యవాణిలా ప్రతిధ్వనిస్తుంది.

సాహిత్యం సమాజ హితం కోరేదై వుండాలన్నది రంగారావు నిశ్చితాభిప్రాయం. ఛందోబద్ధమైన పద్యం, గేయం ఉండనే ఉన్నవి. వాటి పట్ల వారికి గౌరవమూ ఉన్నది. కానీ వారు అభిమానించే కవితారూపం "స్వేచ్ఛా కవిత్వం". వచన కవిత్వమని బహుళ ప్రచారంలో ఉన్న దానిని వారు స్వేచ్ఛా కవిత్వమని సంభావిస్తారు. ప్రజాస్వామ్య సామ్యవాద యుగంలో ఉన్న మనకు తగినది ఈ స్వేచ్ఛా కవిత్వమేనని వారు గాఢంగా విశ్వసిస్తారు. కొన్ని పదుల సంవత్సరాల నుంచి నెలకు ఒక స్వేచ్ఛా కవిత్వ గ్రంథాన్ని రాస్తున్నారు, ప్రచురిస్తున్నారు. నన్ను అభిమానించి నాకు పంపుతున్నారు.

స్వేచ్ఛా కవిత్వాన్ని గురించి ఆయన ఇలా అంటారు: "ఎందరు కవులు వచ్చినా ఇంకా మరొకరికి చోటు లభిస్తూనే వుంటుంది. ఇదీ దీని మహనీయత." అంటే పుష్పక విమానం లాగ అన్నమాట. ఇంకా అంటారు– "జీవనయాన కవిత్వంలో ఒక పొర (లేయర్) భావమయం, ఊహానవం, కొంత కల్పన ఎక్కువగా యాదార్థ్యంతో కూడినది. రెండో పొర అనుభవ సుందరమైంది. అనుభవ స్పందనలతో ఆవిష్కృతమైంది. మూడోది దార్శనికత చేత ఆయువుపట్టుగా ఏర్పడింది. చివరిది నాల్గవది దివ్యత, భవ్యత చేత కళాత్మకతను కలిగింది." ఇలా కవిత్వతత్త్వాన్ని సిద్ధాంతీకరించగలిగిన గొప్ప మేధావి, విమర్శకులు రంగారావు. పగలనక, రాత్రనక వెల్లివిరిసే ప్రకృతి సౌందర్యాన్ని ఎంత చక్కగా కవిత్వీకరించారో చూడండి: "రాత్రి అయితే పదహారు చంద్రకళలు/ పగలయితేనో శతసహస్ర కిరణ పంక్తులు" – జీవన సౌందర్యాన్ని వారు ఆవిష్కరించే తీరే వేరు..

"ఆకుపచ్చని భాగ్యం సమృద్ధికి సంకేతం/ ఎరుపురంగు పరివర్తన తైజస చిహ్నం/ వివిధ వర్ణసమాహితం ఈ అనుభవం."

రంగారావు గారు John Donne వలె మెటాఫిజికల్ పొయెట్. జీవన సత్యాలను, లక్షణాలను సిద్ధాంతీకరిస్తున్నట్లు ఆయన కవిత సాగుతుంది.

"ఈ చరిత్ర నిర్మాణంలో మనిషిది ప్రధాన భాగస్వామ్యం/ భాగ్యస్థితకు సమాజ పరిణామంలో స్థాయి బహు ముఖ్యం".

వీటిని అర్థం చేసుకొని ఆనందించడానికి ఎంతటి పరిణతి కావాలి? అంచేతే నేను దీనిని 'మెటాఫిజికల్ పొయెట్రీ' అంటున్నాను. కవితలనిండా కాన్సెప్ట్, ఇన్సిడెంట్స్ తక్కువ. వాటిని అందంగా చెప్పడం వారి ప్రత్యేకత.

అక్కడక్కడ sensuous beautyని అందించే కవితలు కూడా చక్కగా రాస్తారు. "మనసులో బాధ, కనులలో నీరు/ తూకంలో దేని బరువు దానిదే" – జీవితాన్ని వీడని దుఃఖాన్ని ఎంత మన హృదయాలు ఆర్ద్రమయేట్లు చెప్పినారు! గుండెల్ని పిండే జీవన సత్యమిది.

మాదిరాజు రంగారావు గారి ప్రతి పంక్తీ ఏదో ఒక విషయ నిర్వచనమే. ప్రతి పంక్తీ అందమైన నిర్వచన క్లుప్తతతో, ఆలోచనాంశాలతో మన మేధస్సును, హృదయాన్ని ఆకట్టుకునేదే. ఆయన పదాలలోని శబ్దం, అర్థం భవిష్యవాణిలా ప్రతిధ్వనిస్తుంది. ఈ క్రింది పంక్తుల్లోని ప్రాఫెటింగ్ రింగ్ విందాం: "రవి చండతను వానను అదుపులో పెట్టేను మనిషి/ కవితకు నవత ప్రతీకమై కళాకృతి నిచ్చేను"/ "రాజకీయ క్రియా చరణపర్వంలో/ కలహ సమర చర్యలతో రోబోట్ ప్రవేశం" అయినా/ "ఇది నవయుగాలోకనం, సృజన జగం/ అక్షరతేజంతో వెలిగేను నవభవం./ ఆశారేఖలు శుభనవ యుగారంభానికి/ సూచికలై ఫలిస్తాయి".

రంగారావుగారు మంచి విమర్శకులు. సాహిత్య విమర్శను బయోగ్రాఫికల్, హిస్టారికల్ పరిశీలనకు పరిమితం చేయకుండా సూత్రబద్ధమైన సిద్ధాంతచర్చ చేయగలరు. మూలాలకు వెళ్లి విషయస్థితిని సిద్ధాంతీకరించగలరు. అది నిజమైన విమర్శ. దీనికి సునిశితమైన మేధస్సు కావాలి. కవితా రచనకు సౌందర్య విలసితమైన సృజనాత్మకశక్తిలాగా. ఈ రెండూ రావుగారికున్నవి.

కొద్దిరోజుల క్రితం వెల్చాల కొండలరావు నిర్వహించిన రంగారావుగారి సంస్మరణ సభలో వారి పిల్లలను చూశాను. ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. అందరూ నాన్నగారి వినయాన్ని పుణికిపుచ్చుకున్నవారు, విద్యాధికులు. నాన్నగారి స్మృత్యర్థం ప్రతి ఏటా తెలుగు, సంస్కృతంలో విశిష్ట సేవలందించిన వారికి పెద్ద మొత్తంలో అవార్డులను కొండలరావుగారి విశ్వనాథ సాహిత్యపీఠం నిర్వహణ క్రింద ట్రస్టును ఏర్పాటు చేసి అందిస్తామని రంగారావుగారి పిల్లలు ఆ సమావేశంలో ప్రకటించారు. అంతటి తండ్రికి వారు పిల్లలవడం వారి అదృష్టం. అంతటి మంచి పిల్లలు కలగడం రంగారావుగారి అదృష్టం.

○ చేపూరు సుబ్బారావు

అమృత కాలానికి అమెరికా అడ్డంకి!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ వాణిజ్యంపై విరుచుకుపడ్డారు. భారత్ నుంచి తమకు వస్తున్న దిగుమతులపై ఇరవై ఐదు శాతం పన్ను విధించడంతో బాటు అదనంగా పెనాల్టీ కూడా వేస్తానంటున్నారు. అది కూడా తక్షణమే అమలులోకి తీసుకువచ్చారు. అమెరికా ప్రయోజనాలకు, ఆకాంక్షలకు వ్యతిరేకంగా రష్యా, ఇరాన్‌లతో భారత్ వాణిజ్య సంబంధాలు కొనసాగించడం ఈ నిర్ణయాలకు కారణాలుగా చెప్తున్నా, అంతకు మించిన కడుపు మంట, కంటగింపు ఉన్నట్టున్నాయి. అందుకనే పన్నులు పెంచడంతో బాటు మన దేశ ఆర్థిక వ్యవస్థని ప్రాణం లేనిదిగా అభివర్ణించారు. ప్రపంచంలో నాలుగో స్థానంలో ఉన్న పెద్ద ఆర్థిక వ్యవస్థ, జీడీపీ వృద్ధి ఆరు శాతం పైగా కొనసాగుతున్న వేళ అలా అభివర్ణించడం పిచ్చితనమే. వీటి వెనుక అసలు కారణం భారత్ తన దేశ ప్రయోజనాల కోణంలో స్వతంత్రంగా వ్యవహరించడమే.

అమెరికా కోరుకున్నట్లు వ్యవసాయ, పాడి ఉత్పత్తుల దిగుమతులకు సుంకాలు తగ్గిస్తే, అవి వెల్లువెత్తి మన దేశవాళీ పంటలు, పాలు నష్టపోతాయి. రక్షణ కొరవడుతుంది. అక్కడ ఆ దేశం వాటికి భారీ రాయితీలు సమకూర్చి ప్రోత్సహించడం వల్ల, అంత చౌకగా ఇక్కడ రైతు పోటీకి నిలువలేడు. ఒకసారి వాళ్ల మార్కెట్ ఆక్రమించుకున్నాక, గుత్తాధిపత్యం సాధించి తర్వాత తన ప్రతాపం చూపిస్తారు. అప్పటికి ఇక్కడి స్వయం సమృద్ధి ధ్వంసం అవుతుంది. అందుకనే ఈ విషయంలో బేరసారాలకు తావుండకూడదు. ఇక అమెరికా రెండో అభ్యంతరం.. రష్యా నుంచి ఆయుధాలు, ఇంధనం కొనుగోలు చెయ్యడం. అది భారత్ ఇష్టం. పైగా ఒకప్పటి కన్నా ఇప్పుడు ఆ దేశం నుంచి కొనుగోళ్లు కూడా తగ్గాయి. పోనీ అమెరికా చెప్పినట్టు మన లాభం వదులుకొని అమెరికాతోనే అంటకాగితే ఫలితం ఏమైనా ఉందా? నాస్తి. అమెరికాలో భారతీయుల ఉద్యోగాలతో సహా అన్నింట్లో కోత. పక్కన శత్రువుగా తయారైన పాకిస్తాన్‌ని పెంచి పోషించడం, దాని భారత వ్యతిరేక విధానాన్ని సమర్థించడం.

ఏదేమైనా అమెరికా సుంకాలు, ఆంక్షలు భారత్‌ని కలవరపెట్టరాదు. మరింత బలం పొందడానికి, ప్రపంచ దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపరుచుకోడానికి కారణం కావాలి. ఈ మధ్య బ్రిటన్‌తో ఒప్పందం కుదుర్చుకున్న రీతిలో మిగతా దేశాలతో ప్రయత్నించాలి. దేశంలోని వనరుల్ని సద్వినియోగం చేసుకోవాలి. స్వతంత్ర భారతానికి అమృత కాలం అని భావిస్తున్న 2047 లోగా అభివృద్ధి యాత్రలో, రాగల అడ్డంకుల్ని ఊహించి, అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. ముఖ్యంగా అమెరికాతో వాణిజ్యంలో సమాన స్థాయిలో బేరసారాలు సాగించాలి. బెదిరింపులకు, వడ్డింపులకు సై అంటే సై అనాలి. ఎందుకంటే ట్రంప్‌దంతా మేకపోతు గాంభీర్యమే. చైనాని ఇలాగే బెదిరించి వెనక్కు తగ్గలేదా! ఈ విధంగా ముందుకు పోతే అమెరికా ఆర్థిక వ్యవస్థకూ నష్టమే కదా!

– డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

కులం – అహంకారం – అవినీతి

కులం, అహంకారం, అవినీతి.. మన ప్రజాస్వామ్య వ్యవస్థలను, సమాజాన్ని పట్టి పీడిస్తున్న జాడ్యాలు. కులం రెండు వైపులా పదును ఉన్న కత్తిగా మారింది. అధికారంతో కూడిన అహంకారం వ్యవస్థల విధ్వంసానికి దారితీస్తున్నది. ఇక స్వార్థం డబ్బు రూపంలో జడలు విప్పుతున్నది. సమాజ ధర్మాన్నే సవాలు చేస్తున్నది. తిమ్మిని బమ్మిని చేసే సాధనంగా, అన్యాయాన్ని న్యాయంగా, అధర్మాన్ని ధర్మంగా చిత్రించే స్థాయికి అది ఎదిగింది. ధనమూల మిదం జగత్ అన్న సామెతను పరిపూర్ణంగా నిజం చేస్తున్నది. వీటన్నిటికీ మూలాధారం రాజకీయం. మంచీ చెడును వేరు చేయలేనంతగా రూపు మార్చుకుంది నేటి రాజకీయం.

కులం గురించి అడగడాన్ని, మాట్లాడడాన్ని ఒకప్పుడు చిన్నతనంగా చూసేవారు. కుల నిర్మూలన ఉద్యమాలు కూడ ఆంధ్రలో ఒకప్పుడు బలంగానే ఉండేవి. అందుకోసం కులాంతర వివాహాలను కూడ నాస్తికులు, హేతువాదులు, కమ్యూనిస్టులు ప్రోత్సహించేవారు. కాని క్రమంగా పరిస్థితులు మారిపోయాయి. కుల ప్రాతిపదికన ఎక్కడికక్కడ సంఘాలు ఏర్పడడం, రాజకీయ డిమాండ్లను తెరపైకి తేవడం మొదలయింది. సామాజిక న్యాయం ప్రధాన విధానంగా, నినాదంగా మారిపోయింది. వర్గం బదులు వర్ణం / కులం వెనుకబడిన తనానికి ప్రమాణం అయింది. కమ్యూనిస్టులలో కూడ క్రమంగా ఈ విషయంలో కొంత మార్పు వచ్చింది. కులానికి – అది ఏ కులమైనా – గౌరవం పెరిగిపోయింది. ఆత్మన్యూనత స్థాయి నుంచి ఆత్మగౌరవ స్థాయికి చేరుకుంది. ఒకప్పుడు పత్రికలలో కులం గురించి రాస్తే చిరాకుపడేవారు. ఒకవేళ రాయవలసి వచ్చినా 'సామాజిక వర్గం' అనే మాటను కులానికి ప్రత్యామ్నాయంగా, తప్పించుకునే ఉపాయంగా వాడేవారు. కాని సమాజంలోను, రాజకీయాలలోను వచ్చిన మార్పులతో మీడియా కూడ ఇప్పుడు నేరుగా రంగంలోకి వచ్చేసింది. కులప్రాతిపదికన వివరాలు ఇవ్వడం, విశ్లేషణలు చేయడం ఎక్కువయింది. ఎవరయినా అదేమని ప్రశ్నిస్తే 'ఏమిటయ్యా ఎంతకాలం దాచిపెడతావు?' అని ఎదురు ప్రశ్నించే పరిస్థితి. ఆ విధంగా కులం వేసుకున్న ముసుగు తొలగిపోయింది. ఇంకా చెప్పాలంటే, కులాభిమానం ముదిరి పాకానపడి కులద్వేషంగా కూడ జడలు విప్పుతున్నది.

అధికారంలో ఉన్నవారికి అహంకారం కూడదంటారు. అదే పతనానికి దగ్గర దారి అని కూడా అంటారు. వ్యక్తులకే కాదు, మొత్తం సమాజానికి కూడా నష్టం జరుగుతుంది. కాని ఆచరణలో అహంకారం ఆవహించని ముఖ్యమంత్రులు తక్కువ. ఎంత ఎక్కువ అధికారం లభిస్తే, మరెంత ఎక్కువకాలం అధికారంలో కొనసాగితే అంత ఎక్కువగా అహంకారం ప్రదర్శించడం కద్దు! ఆంధ్రప్రదేశ్‌లో అధికారం చెలాయించిన 16 మంది ముఖ్యమంత్రులలో ఎక్కువ భాగం ఎంతో కొంత ఈ ధోరణి ప్రదర్శించినవారే! రెండవసారి ముఖ్యమంత్రి అయితే ఇక చెప్పనవసరం లేదు. అహంకారానికి తాము ఆమడదూరం అనుకునేవాళ్ళు, ఒకసారి ముఖ్యమంత్రి గద్దెనెక్కగానే, వారికి తెలియకుండానే అహంకారభూతం ఆవహిస్తుంది. జనానికి దూరం చేస్తుంది. ఇది అవరోహణకు నాంది.

అహంకారం తర్వాత ముఖ్యమంత్రులను, తద్వారా ప్రజాజీవితాన్ని భ్రష్టుపట్టించే మరో జాడ్యం డబ్బు పిచ్చి. అవినీతి అనే మాట దీనికి పర్యాయపదం. అధికారం అందించే అవకాశాలు అనేకం తన్నుకుంటూ వస్తాయి. ఒకసారి రుచి మరిగితే ఇక అంతే సంగతులు! అవినీతి విషయంలో మన ముఖ్యమంత్రులను అందరినీ ఒకే గాటన కట్టలేం! తొలితరం ముఖ్యమంత్రులది అదొక తరహా! అవినీతి మకిలకు వీలయినంత దూరం! కాని మధ్యకాలం నాటికి మరికొంత మార్పు! చూసీచూడనట్టు నడిపించే మధ్యస్థ రకం. ఇక కొత్త మిలీనియం అయితే బిలియన్‌ల వ్యవహారంగా మారిపోయింది. ఎన్నికలలో వాడకం పెరిగేకొద్దీ, ఆర్జన కూడా అమాంతం పెరిగిపోయింది. అవసరాల హద్దులను కూడ దాటిపోయింది. కొందరికయితే ఆకాశమే హద్దు. వందల వేల కోట్ల మాటలు మూటలు – కాకపోతే కీర్తికాంక్ష ఉన్నవారు ఇందులో రవంత నయం. అభివృద్ధి – అవినీతి బొమ్మ బొరుసు కావడం ఈనాటి రాజకీయంలో ఒక విషాదపర్వం.

స్వాతంత్ర్యానంతర రాజకీయాలలో మత సమీకరణలు ప్రధానంగా ఉండేవి. హిందూత్వ పేరుతో బీజేపీ, సెక్యులరిజం పేరుతో కాంగ్రెస్ పని చేసేవి. ప్రయోజనం పొందేవి. ఇది దేశవ్యాప్త ధోరణి. ఇటీవలి కాలంలో ఇది బీజేపీకి అనుకూలంగా మారడంతో కాంగ్రెసు పార్టీ దానికి విరుగుడుగా కులం మంత్రాన్ని తెరపైకి తెచ్చింది. కులం ప్రాంతీయ రాజకీయ చదరంగంలో ఎప్పుడూ కదను తొక్కే అశ్వం లాంటిదే. కులం బలంతో ఏర్పడిన ప్రాంతీయ పార్టీలు కూడ చాలానే ఉన్నాయి. బలహీనవర్గాలు ఓకే. కానీ అగ్రకులాల చాటింపు కూడ ఇటీవల మరీ బహిరంగం అయిపోయింది.

పాత్రికేయ ప్రముఖుడు ఇనగంటి వెంకట్రావు కొత్త పుస్తకం 'విలీనం–విభజన' స్వతంత్ర భారతదేశంలో తెలుగు ప్రజల రాజకీయ ప్రస్థానానికి అక్షర దర్పణం. ఆంధ్ర, తెలంగాణలు ఆంధ్రప్రదేశ్‌గా విలీనం కాక ముందు, సమైక్యమైన తరువాత, విడిపోయిన అనంతరం 22 మంది ముఖ్యమంత్రుల రాజకీయ వ్యక్తిత్వాలను ఆసక్తికరంగా వివరిస్తూ వారి పాలనా విజయాలు, వైఫల్యాలను విశ్లేషించిన పుస్తకమిది. ముఖ్యమంత్రులతో పాటు చరిత్ర నిర్మాతలైన పొట్టి శ్రీరాములు, ఆచార్య రంగా, పుచ్చలపల్లి సుందరయ్య, గౌతు లచ్చన్న తదితరులు, ఇంకా చిరంజీవి ప్రజారాజ్యం గురించి కూడా రచయిత రాశారు. గతాన్ని స్వగతంతో మేళవించి తేలికైన భాషలో వెంకట్రావు రాసిన ఈ పుస్తకం పాఠకుడిని ఏక బిగిన చదివిస్తుంది.



కాంగ్రెసు విధానాలకు అనుగుణంగా రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెసు ప్రభుత్వం తెలంగాణలో కులగణన చేపట్టింది. దానినీ విపక్షాలు వివాదాస్పదం చేశాయి. అయితే కేంద్ర ప్రభుత్వం కూడ ఇటీవల కులగణనకు పచ్చజెండా ఊపింది. నిజానికి కులం విషయంలో ఉన్నంత భావోద్రేక అనుబంధం మతం విషయంలో ఉండదు. కులానికి పుట్టుకతోనే విడదీయరాని బంధం ఏర్పడుతుంది. (ఆంధ్ర రాష్ట్రంలో కులాన్ని బట్టి పార్టీ విధేయత యథాలాపంగా నిర్ణయమైపోతున్నది.) మతాన్ని మార్చుకోగలం కాని, కులాన్ని మార్చుకోలేం. కాని ఆచరణలో అలా లేదు. మతం మారిన కుటుంబాలు, తమతో పాటే కులాన్ని వెంట తీసుకువెడుతున్నాయి. ఆంధ్ర, రాయలసీమలలో కమ్మ, రెడ్డితో సహా అగ్రకులాలలో కూడ ఈ 'ద్వంద్వ పౌరసత్వం' బాగా కనబడుతుంది. వాళ్లంతా క్రిస్టియన్‌లకు క్రిస్టియన్‌లు, కులానికి తమ కులస్థులు. గుంటూరు మెట్ట ప్రాంతాలలో, ముఖ్యంగా పల్నాడులో ఈ పరిస్థితి కనిపిస్తుంది. మళ్లీ ఇస్లాంలోకి మారితే ఇది కుదరదు. ముస్లింలలో కులానికి తావు ఉండదు. అయితే ఇందులో కూడా బీసీ కులాలు / వర్గాలను గుర్తిస్తున్నారు. ఈ కులగణన లక్ష్యం మొత్తం – జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్న డిమాండ్ నుంచి పుట్టుకువచ్చిందే!

(ఇనగంటి వెంకట్రావు 'విలీనం–విభజన' గ్రంథంలోని భాగం ఇది.)

(నేడు ఉదయం 10 గంటలకు బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్, సురవరం ప్రతాపరెడ్డి హాలులో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు 'విలీనం–విభజన'ను ఆవిష్కరిస్తారు. తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహిస్తారు.)

21న అర్బన్ బ్యాంక్ ఎన్నికలు

- 8, 11, 12 తేదీలలో నామినేషన్ల దాఖలు
- 13న పరిశీలన, 14న ఉపసంహరణ
- 21న ఎన్నికల పోలింగ్, ఫలితాల ప్రకటన
- షెడ్యూల్ ప్రకటించిన ఎన్నికల అధికారి ఎం.వాల్య నాయక్

7



లక్ష్యాలు సాధిస్తూ.. సేవలు విస్తరిస్తూ..

అభివృద్ధి బాటలో వరంగల్ డీసీసీ బ్యాంకు

- యేటేటా నమోదవుతున్న ఆర్థిక వృద్ధి
- కమర్షియల్ బ్యాంకులతో పోటీ
- రైతులకే కాకుండా అన్ని వర్గాలకు సేవల విస్తరణ
- విరివిగా రుణాలు.. స్వయం ఉపాధికి ఊతం
- ఆర్థిక మార్గాల అన్వేషణలో కొత్త పంథా

హనుమకొండ సిటీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక వృద్ధి సాధనలో ఉమ్మడి వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) సత్ఫలితాలను సాధిస్తోంది. ఒకప్పుడు రైతులకే ప్రాధాన్యతగా బ్యాంకు సేవలు ఉండేవి. ప్రతీ సంవత్సరం నిర్దేశిత ఆర్థిక లక్ష్యాల సాధన ఫలితాలు అంతంత మాత్రమే. ఈ పరిస్థితి మారింది. కేవలం రైతన్నలకే పరిమితం కాకుండా బ్యాంకు సేవలు విస్తరించాలనే లక్ష్యాలు ఏర్పాడ్డాయి. అన్ని వర్గాలకు రుణాల కల్పనతో పాటు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బలోపేతం, ఆర్థిక మార్గాల విస్తరణ, కమర్షియల్ బ్యాంకులతో పోటీ పడే సేవలను అమల్లోకి తీసుకురావడం తద్వారా టర్నోవర్ పెంపు లక్ష్యాల నెరవేర్పు వంటి ప్రణాళికలతో డీసీసీ బ్యాంకు ఆ మేరకు ఫలితాలను సాధిస్తోంది.

రూ.860 కోట్ల నుంచి..

మూడేళ్లకు ముందుగా బ్యాంకు టర్నోవర్ రూ.860 కోట్లతో ఉండేది. డీసీసీ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు నేతృత్వంలోని పాలకవర్గం, బ్యాంక్ అధికారులు, సిబ్బంది ఆర్థిక ఫలాలు సాధించే క్రమంలో నిర్దిష్టమైన కార్యాచరణ రూపొందించారు. తొలి దశలో టర్నోవర్ లక్ష్యం రూ.1200 కోట్లకు పైగా సాధించాలని నిర్ణయించారు. సమష్టి కృషితో లక్ష్యం నెరవేర్చారు. ఆపై బ్యాంకు ఆర్థిక వృద్ధి గ్రాఫ్ పైపైకే వెళ్లింది. ప్రతీ సారి టర్నోవర్ లక్ష్యాలను ఎప్పటికప్పుడు నిర్దేశించుకోవడం, ఫలితాలను సాధించడంతో రూ.2 వేల 230 కోట్ల టర్నోవర్‌కు బ్యాంకు చేరింది. ఇక్కడి నుంచి రూ.2వేల 600 కోట్ల లక్ష్యాన్ని సాధించాలని నిర్ణయించింది. ఇలా బ్యాంకు తన ప్రయాణంలో ఆర్థిక ఫలితాలను సాధించడంలో విజయాన్ని సాధిస్తోంది. తెలంగాణలోని తొమ్మిది డీసీసీ బ్యాంకుల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా సహకార బ్యాంక్ తనదైన ముద్రను చాటింది.

కమర్షియల్ బ్యాంకులతో పోటీ

సేవల విస్తరణ లక్ష్యంలో డీసీసీ బ్యాంక్ కమర్షియల్ బ్యాంకులతో పోటీ పడుతోంది. నిర్దిష్ట లక్ష్యాల సాధనలో ఈ పోటీ ఎంతో ప్రాధాన్యమని భావించి ఆ మేరకు సేవలను విస్తరించింది. ఫలితంగా అన్ని వర్గాలకు బ్యాంకు చేరువైంది. కేవలం రైతులకు మాత్రమే పరిమితం కాకుండా అన్ని వర్గాలకు రుణాలను అందచేస్తూ ఆశించిన ఫలితాలను రాబట్టింది. ఫిక్స్‌డ్ డిపాజిట్లు గతంలో కమర్షియల్ బ్యాంకులకే పరిమితమయ్యేవి. కానీ డీసీసీ బ్యాంకులో కూడా ఫిక్స్‌డ్ డిపాజిట్ల సంఖ్య పెరిగింది.

రుణాల కల్పన

కమర్షియల్ బ్యాంకులతో పోటీ పడేలా అన్ని వర్గాలకు రుణాలను అందచేసే ప్రణాళికలను విస్తరించింది. గ్రామీణ ప్రాంతాల్లో యువతకు స్వయం ఉపాధి మార్గాల వైపు ఆసక్తి కల్పించేలా రుణాల కల్పన చేపట్టింది. మహిళా సంఘాలకు రుణాలు అందచేస్తూ ఆర్థికాభివృద్ధికి బాటలు వేసింది. ఇక విద్యా రుణాలను సైతం అందచేస్తూ రైతుల పిల్లల ఉన్నత విద్యకు మార్గాలు తెరిచింది. విదేశీ విద్యకు రుణాలు కల్పిస్తోంది.

సంఘాల బలోపేతం

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బలోపేతం చేసేందుకు డీసీసీ బ్యాంకు ఆదాయ మార్గాలను అన్వేషించింది. ఇందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మల్టీ సర్వీసు సెంటర్ల ప్రాజెక్టు సంఘాల బలోపేతానికి పునాదిగా మారింది. ఎంఎస్‌సీ ప్రాజెక్టుతో పీఏసీఎస్‌ల స్వరూపమే మారింది. గతానికి భిన్నంగా సంఘాలు ఆర్థిక వనరుల సమకూర్పులో విస్తరించాయి. పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో వ్యాపారాల నిర్వహణ ప్రారంభమైంది. పెట్రోలు పంపులు, మాల్స్, ఫంక్షన్ హాల్స్ ఏర్పాటు తదితర వ్యాపారాల నిర్వహణతో బ్యాంకు ఆదాయ వనరుల పెంపు లక్ష్యాలు నెరవేరుతున్నాయి. మల్టీ సర్వీసు సెంటర్స్ ప్రాజెక్టులో పీఏసీఎస్‌ల ద్వారా వ్యాపారాల నిర్వహణలో ఉమ్మడి వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ తెలంగాణలోనే తొలి స్థానంలో నిలవడం ప్రస్తావనార్హం. బ్యాంకు ఉత్తమ సేవలకు ఐయస్‌వో 9001 గుర్తింపు, 'ఏ' గ్రేడ్ సాధన కొలమానంగా ఉన్నాయి. ఇక యాక్సిలేటర్ పథకంలో దేశంలో మొత్తంగా 30 సంఘాలు ఎంపికయ్యాయి. ఇందులో వరంగల్ డీసీసీ బ్యాంకు నుంచి నాలుగు సంఘాలు ఎంపికయ్యాయి.



కన్నెపల్లి పంప్‌హౌస్ ముట్టడి చేస్తుండగా బీఆర్ఎస్ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు

కాళేశ్వరం నీళ్లను ఎత్తిపోయాలి...

- కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద పుష్కలంగా నీళ్లు
- అయినా మోటార్లు ఆన్ చేయడం లేదు..
- ఎన్‌డీఎస్ఏ అనుమతి ఉన్నా ఎందుకు పట్టించుకోరు?
- రైతుల ఉసురు పోసుకుంటున్న కాంగ్రెస్ సర్కారు
- కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద బీఆర్ఎస్ నేతల ఫైర్

6



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

కొర్కిశాల కేజీబీవీలో ఫుడ్ పాయిజన్

- కిచిడీ తిన్న 27 మంది విద్యార్థినులకు అస్వస్థత
- సిబ్బంది నిర్లక్ష్యంపై అదనపు కలెక్టర్ విజయలక్ష్మి ఆగ్రహం
- విద్యార్థినులను పరామర్శించిన ఎమ్మెల్యే గండ్ర



చిట్యాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినిలు

భూపాలపల్లిటౌన్/చిట్యాల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం కొర్కిశాలలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం ఫుడ్ పాయిజన్ అయ్యింది. దీంతో 27మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు, బాధిత బాలికల కథనం ప్రకారం.. కేజీబీవీలో 246మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. సోమవారం ఉదయం కిచిడీ తిన్న విదార్థినుల్లో 27 మంది వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. దీంతో హాస్టల్ సిబ్బంది విషయం బయటికి పొక్కకుండా ఆ విద్యార్థినులను 108 సహాయంతో సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో చిట్యాలలోని సామాజిక ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి హాస్టల్‌కు చేరుకుని వివరాలు సేకరించారు. హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన చోటుచేసుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిట్యాల సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరామర్శించారు. ఎలాంటి ప్రమాదం జరగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. అక్కడి నుంచి నేరుగా కొర్కిశాలలోని కేజీబీవీ పాఠశాలకు చేరుకున్న ఎమ్మెల్యే విద్యార్థినులు, సిబ్బందిని అడిగి పూర్తి వివరాలు సేకరించారు. ఇటీవల పలుమార్లు ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని హెచ్చరించినా సిబ్బంది నిర్లక్ష్యంతోనే పునరావృతమైందని, బాధ్యులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని అన్నారు. హాస్టల్‌లో నెలకొన్న తాగునీటి సమస్యను తీరుస్తానని భరోసా ఇచ్చారు. అధికారులు విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ రఫీ, మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, తదితరులు ఉన్నారు.

రేపు కేయూలో జయశంకర్ ఎండోమెంట్ లెక్చర్

కేయూ క్యాంపస్ ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమ నేత దివంగత ప్రొఫెసర్ కె.జయశంకర్ 13వ ఎండోమెంట్ లెక్చర్ ఆగస్టు 6న బుధవారం కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో నిర్వహిస్తామని జయశంకర్ మెమోరియల్ ఫౌండేషన్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ, శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, ట్రస్టు అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎన్. లింగమూర్తిలు తెలిపారు. ఈ సదస్సుకు హైదరాబాద్ కేంద్రీయ వర్సిటీ రిటైర్డ్ ఎకానమిక్స్ ప్రొఫెసర్ డి.నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కీలక ప్రసంగం చేస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి కేయూ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి అధ్యక్షుడిగా వ్యవహరిస్తారని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం తెలిపారు.

ముంపు ముప్పుపై అప్రమత్తత అవసరం

- అందుబాటులో 6 ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు
- ఆపదమిత్ర సేవలను ఉపయోగించుకోవాలి
- డివిజన్ల వారీగా వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేయాలి
- రాష్ట్ర రెవెన్యూ విపత్తు ప్రత్యేక అధికారి అరవింద్‌కుమార్
- జీడబ్ల్యూఎంసీ కార్యాలయంలో అధికారులతో సమావేశం



గ్రేటర్ కార్యాలయం సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అరవింద్‌కుమార్

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో తలెత్తే ముంపు సమస్యను ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ విపత్తు నిర్వహణ ప్రత్యేక అధికారి అరవింద్‌కుమార్ అన్నారు. సోమవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సత్యశారదాదేవి, స్నేహ శబరీష్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరవింద్‌కుమార్ మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రాణనష్టం జరగకుండా చూడాలన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని, ముందే సమస్య గుర్తించకపోతే సమస్య పెద్దదిగా మారుతుందన్నారు. రాష్ట్రస్థాయిలో 6 ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నాయని, అత్యవసర పరిస్థితిలో ఉపయోగించుకోవాలని అన్నారు. ఆపద మిత్ర సేవలను కూడా ఉపయోగించుకోవాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) ద్వారా లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించి సూచనలు చేయాలన్నారు. ఆపదలో ఉన్న ప్రజల కోసం పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలన్నారు. జీడబ్ల్యూఎంసీ 66 డివిజన్ల కార్పొరేటర్లకు వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఎస్‌డీఆర్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ దామోదర్‌సింగ్ మాట్లాడుతూ.. ముందస్తుగా వరద నివారణ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటే ప్రమాదాల నుంచి బయటపడవచ్చని అన్నారు. కాగా, నగరంలో వరద ముంపు నివారించేందుకు తీసుకుంటున్న చర్యలపై కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అరవింద్ కుమార్‌కు వివరించారు.

నగరంలో పలు చోట్ల పరిశీలన..

రెవెన్యూ విపత్తు ప్రత్యేక అధికారి అరవింద్‌కుమార్ అధికారులతో కలిసి నగరంలోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. నయీంనగర్ నాలా, రాజాజీనగర్ కల్వర్టు, ప్రెసిడెన్సీ స్కూల్ నుంచి నయీంనగర్ వరకు రిటర్నింగ్ వాల్ నిర్మాణ పనులు, జవహర్‌నగర్, సమ్మయ్యనగర్, భద్రకాళి చెరువు ఎఫ్‌టీఎల్‌లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్ రవీందర్, పారిశుధ్య, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, డీఆర్ఎఫ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 181 వినతులు

అర్జీలు వెంటనే పరిష్కరించాలన్న కలెక్టర్



వినతులు తీసుకుంటున్న కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి సమస్యలు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ స్నేహ శబరీష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యలపై 181 వినతులు వచ్చాయి. బాధితుల నుండి కలెక్టర్ వినతులు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులను పిలిచి వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. బాధితుల సమస్యలపై ఇచ్చిన వినతులు పెండింగ్‌లో పెట్టవద్దని వెంటవెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్, డీఆర్‌డీవో మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, కె.నారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇప్పించండి...



యాకుబ్‌పాషా, కాపువాడ

గత 30 సంవత్సరాలుగా హనుమకొండ 10వ డివిజన్ పరిధిలోని కాపువాడలో కిరాయి ఇంట్లో ఉంటున్నాం. మాది నిరుపేద కుటుంబం. ఇద్దరు పిల్లలు వున్నారు. పెయింటర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నా. సొంత ఇల్లు లేక నానా ఇబ్బందులు పడుతున్నాం. ఇల్లు ఇప్పించాలని గత 10 సంవత్సరాలుగా కలెక్టరేట్‌కు వస్తూ అనేకసార్లు దరఖాస్తులు పెట్టుకున్నాం. ప్రజాపాలనలో కూడా సమర్పించాం. అయినప్పటికీ మా సమస్య పరిష్కారం కావడం లేదు. సొంత స్థలం లేకపోవడంతో ఇందిరమ్మ ఇల్లుకు అర్హత పొందలేకపోయాం. డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు పొందడానికి నాకు అన్ని అర్హతలు వున్నాయి. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్పందించి హనుమకొండ బాలసముద్రంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ సముదాయంలో ఇల్లు ఇప్పించి న్యాయం చేయాలని వేడుకుంటున్నాం.

వేదపండితులు, అర్చకులకు ఝలక్



- అనుమతి లేకుండా ఇతర ధార్మిక క్రతువుల్లో పాల్గొనరాదు
- ఆదేశాలు జారీ చేసిన దేవాదాయశాఖ

హనుమకొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : గుడికన్నా ఇల్లు పదిలమని గుళ్లోని పూజలను వదిలేసి సంభావనలు ఎక్కువగా వచ్చే ఇతర, ధార్మిక క్రతువుల్లో పాల్గొనే వేదపండితులు, అర్చకులు, పురోహితులకు రాష్ట్ర ప్రభుత్వం జలక్ ఇచ్చింది. ఈ మధ్య కాలంలో పలువురు వేదపండితులు, అర్చకులు, పురోహితులు దేవాదాయ శాఖ కమిషనర్‌కు సమాచారం ఇవ్వకుండా, అనుమతి సైతం తీసుకోకుండా గుళ్లలో పూజలను వదిలేసి రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలు, కొన్ని సందర్భాల్లో ఇతర దేశాలకు సైతం వెళ్లి అక్కడ లోకకల్యాణాలు, బ్రహ్మోత్సవాలు, ప్రవచనాలు, వేద సంబంధ కార్యక్రమాల్లో ఎక్కువగా పాల్గొంటున్నారు. ఈ విషయం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి వచ్చింది. ఈ విషయాన్ని దేవాదాయ శాఖ డైరెక్టర్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆమె ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించారు. వేదపండితులు, అర్చకులు, పురోహితులు కూడా ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే ప్రభుత్వ సీసీఎస్ (కండక్ట్) రూల్స్ కిందకు వస్తారని, ఇలా ముందస్తు సమాచారం ఇవ్వకుండా, అనుమతి తీసుకోకుండా వెళ్లడం క్రమశిక్షణ నియమాలను ఉల్లంఘించడం కిందకే వస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ దృష్ట్యా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో జరిగే ధార్మిక కార్యక్రమాలను నిర్వహించాలన్నా, పాల్గొనాలన్నా ఎట్టి పరిస్థితుల్లోనూ దేవాదాయశాఖ కమిషనర్ నుంచి ముందస్తు అనుమతిని పొందాలని, ప్రభుత్వ నియమ నిబంధనలకు కట్టుబడి ఉండాలని సర్క్యులర్‌ను ఇటీవల జారీ చేశారు. ఒక వేళ ఎవరైనా ఈ ఆదేశాలను ఉల్లంఘించిన పక్షంలో లేదా ఇందుకు సంబంధించి ఏ వైనా ఫిర్యాదులు అందినా క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్టు ఆ సర్క్యులర్‌లో హెచ్చరించారు.

విపత్తు నిర్వహణ సీఎస్‌ను కలిసిన కలెక్టర్లు



అరవింద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్, వరంగల్ కలెకర్ సత్యశారద

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రత్యేక కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్‌కుమార్‌ను హనుమకొండలోని ఎన్‌ఐటీలో సోమవారం హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరవింద్ కుమార్‌కు పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు.

● వరంగల్ కలెక్టరేట్: రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్‌ను సోమవారం నిట్ అతిథి గృహంలో కలెక్టర్ సత్యశారద మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. మాన్‌సూన్ అప్రమత్తత చర్యల నేపథ్యంలో జీడబ్ల్యూఎంసీ పరిధిలో చేపడుతున్న విధానాలను పరిశీలించడానికి నగరానికి వచ్చిన అరవింద్ కుమార్‌ను పలు అంశాలపై చర్చించారు. అనంతరం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో మాన్‌సూన్ అప్రమత్తతపై వివిధ విభాగాల అధికారులతో నిర్వహించిన సమావేశంలో సీఎస్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మామునూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా మామునూరులో గల జవహర్ నవోదయ విద్యాలయంలో పదకొండో(ప్లస్-1) తరగతిలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివి ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వారై ఉండాలి. పదోతరగతిలో కనీసం 60 శాతం మార్కులు ఉండాలి. అంతేగాకుండా సైన్స్ సబ్జెక్టుల్లో 60 శాతం లేదా ఆపైన మార్కులు సాధించినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. ఈ విద్యాలయంలో ఉచిత భోజన, విద్యా వసతితో పాటు సీబీఎస్ఈ సిలబస్‌తో బోధన ఉంటుంది. ఇతర వివరాలకు 7981017658, 9505430200 నెంబర్లలో సంప్రదించాలని నవోదయ ప్రిన్సిపాల్ పూర్ణిమ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

భళా 'ప్రయాస్'

● విద్యార్థుల్లో పరిశోధనాసక్తి పెంపొందించేందుకు పథకం
● ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభం ● 9 నుంచి 11 తరగతుల విద్యార్థులకు అవకాశం
● ఈ నెల 17 వరకు దరఖాస్తులు ● ప్రాజెక్టుకు ఎంపికైతే రూ. 50 వేలు అందజేత



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయాస్ పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఢిల్లీలోని సైన్స్ మ్యాథమెటిక్స్ ఎడ్యుకేషన్ విభాగం (డీఈఎస్ఎం) ద్వారా 2025-26 విద్యా సంవత్సరంలో ఈ పథకాన్ని ప్రవేశ పెట్టి అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. ప్రయాస్ (ప్రమోషన్ ఆఫ్ రీసెర్చ్ అటిట్యూడ్ ఇన్ యంగ్ అండ్ ఆస్పిరింగ్ స్టూడెంట్ అనే పథకాన్ని ప్రవేశ పెట్టి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తుంది.

ప్రయాస్ పథకం ప్రధాన లక్ష్యాలు

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఆయా తరగతుల సబ్జెక్టులతో పాటు శాస్త్రీయ పరిశోధనలు, ఆవిష్కరణలో పాల్గొనడానికి ప్రోత్సహించేందకు దోహదపడనుంది. నిజ జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రాజెక్టు అభివృద్ధిలో సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజనీరింగ్, ఆర్ట్స్ అండ్ మ్యాథమెటిక్స్‌ను ఏకీకృతం చేసేందుకు ఉపయోగపడనుంది. విద్యార్థుల్లో శాస్త్రీయ, తార్కిక ఆలోచనలను పెంపొందించడం, విద్యార్థులు సామాజిక, పర్యావరణ సవాళ్లను వినూత్న పరిష్కారాలను కనుగొనడానికి సాధికారత కల్పించేందుకు అవకాశం కలుగనుంది. విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు, ఉన్నత విద్యా సంస్థల నిపుణుల మధ్య సహకారాన్ని పెంపొందించనుంది.

పథకంలో పాల్గొనడానికి అర్హులై వీరే...

ప్రయాస్ పథకంలో పాల్గొనాలంటే 9వ తరగతి నుంచి 11వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులు. అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఒక విద్యార్థి లేదా గరిష్ఠంగా ఇద్దరు విద్యార్థుల బృందం, వారి పాఠశాలలోని ఒక ఉపాధ్యాయుడు లేక ఏదైనా ఉన్నత విద్యా సంస్థ (హెచ్ఈ) నుంచి ఒక నిపుణుడితో కలిసి ప్రాజెక్టు సమర్పించేందుకు అవకాశం ఉంటుంది. ఒక పాఠశాల నుంచి ఒక ఎంట్రీకి మాత్రమే అవకాశం ఉంటుంది.

వ్యవధి సంవత్సరం మాత్రమే..

ప్రయాస్ పథకం కాల వ్యవధి పాఠశాలలో ప్రాజెక్టు ప్రారంభమైన తేదీ నుంచి పూర్తయ్యే వరకు ఒక సంవత్సరం ఉంటుంది. దీని తాత్కాలిక వ్యవధి అక్టోబరు 16, 2025 నుంచి అక్టోబరు 16, 2026 వరకు ఉంటుంది. ఈ పథకంలో భాగంగా ఉపాధ్యాయుడు విద్యార్థులకు వారి పరిశోధనలో మార్గనిర్దేశం చేస్తారు. ఉన్నత విద్యా సంస్థల నుంచి వచ్చిన నిపుణుడు విద్యార్థులకు సాంకేతిక, ప్రయోగాత్మక మార్గనిర్దేశం అందించనున్నారు.

దరఖాస్తు ఇలా చేసుకోవాలి

విద్యార్థులు స్వయంగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉండదు. హెచ్ఎం ప్రయాస్ యోజన వెబ్‌సైట్‌లో అకౌంట్ తీసి ఓపెన్ చేయాల్సి ఉంటుంది. ఒక పాఠశాల నుంచి ఒక ప్రాజెక్టుకు మాత్రమే ప్రతిపాదనలు సమర్పించాల్సి ఉంటుంది. విద్యార్థులకు సైన్స్ ఉపాధ్యాయుడు మార్గదర్శకత్వం వహిస్తారు. సమీపంలో ఉన్నత విద్యా సంస్థల సైన్స్ నిపుణులు, టెక్నికల్ గైడ్స్ సహకారాన్ని తీసుకునేందుకు అవకాశం ఉంటుంది.

అర్హులైన, ఆసక్తిగల విద్యార్థు లు ఆగస్టు 17లోగా ఆన్‌లైన్‌లో www.ncert.nic.in చేసుకోవాలి. విద్యార్థులు చేసుకున్న దరఖాస్తును సెప్టెంబరు 15 నుంచి దరఖాస్తులను పరిశీలించి, 30 లోపు ఎంపిక చేస్తారు. ఈ పథకానికి ఎంపికైన విద్యార్థికి రూ. 50 వేలు అందజేస్తారు. ఈ డబ్బులను పరిశోధన, ప్రాజెక్టు రూపకల్పన, పరిశోధనా సామగ్రి, ప్రయాణ ఖర్చులకు వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుంది.

విద్యుత్ స్తంభం ఎక్కిన పాము

షార్ట్‌సర్క్యూట్‌తో వస్త్ర దుకాణం దగ్ధం
సుమారు రూ. 50 లక్షల నష్టం



అగ్నిప్రమాదంలో కాలిపోయిన బట్టలు

టేకుమట్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభంపై నాగు పాము ఎక్కడంతో షార్ట్ సర్క్యూట్ అయి వస్త్ర దుకాణం దగ్ధమైన సంఘటన భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండల కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. దుకాణం యజమాని గడదాసి శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్‌కు చెందిన వస్త్ర దుకాణం నుంచి అర్ధరాత్రి సమయంలో ఏదో కాలుతున్న వాసనతో పాటు పొగలు రావడంతో ఆయన దగ్గరికి వెళ్లి చూశాడు. అప్పటికే షాప్ మొత్తం పొగతో నిండిపోయి లోనికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. పోలీసులకు ఆయన సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి వారు చేరుకొని షాప్ షెట్టర్‌ను యంత్రాల సహాయంతో తొలగించి మండలను ఆర్పే ప్రయత్నం చేశారు.

అప్పటికే షాపులోని బట్టలు, కౌంటర్, ర్యాకులన్నీ కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను పూర్తిగా ఆర్పివేశారు. తీరా సోమవారం ఉదయం బాధితులు శ్రీనివాస్ పక్కనే ఉన్న విద్యుత్ పోల్‌ను పరిశీలించగా చనిపోయిన నాగుపాము కనిపించింది. పాము స్తంభం ఎక్కడం వల్లే షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి అగ్ని ప్రమాదం జరిగిందని ఆయన గుర్తించాడు. అగ్ని ప్రమాదానికి గురైన షాపున ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరిశీలించి బాధితుడు శ్రీనివాస్‌ను పరామర్శించారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రుణ సౌకర్యం కల్పిస్తామని కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అగ్నిప్రమాదంలో రూ. 30 లక్షల విలువ చేసే బట్టలు, ఇతర సామగ్రి, రూ. 20 లక్షల నగదు దగ్ధమైనట్టు బాధితుడు శ్రీనివాస్ తెలిపాడు.

ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వండి

బల్దియా కమిషనర్ చహత్ బాజ్‌పాయ్
ప్రజావాణిలో ఫిర్యాదులు వెల్లువ
109 దరఖాస్తులు స్వీకరించిన అధికారులు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి ద్వారా వచ్చే ఫిర్యాదులకు అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరించి పరిష్కారం కోసం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ మాట్లాడారు. నగర ప్రజలకు అందించాల్సిన మౌలిక సదుపాయాలపై అధికారులు చొరవ చూపాలని అన్నారు. ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ చూపించి సమస్యలు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 109 ఫిర్యాదులు స్వీకరించినట్టు కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డి, ఇంచార్జీ ఎస్ఈ మహేందర్, ఇంచార్జీ సీపీ రవీంద్ర రాడేకర్, వెటర్నరీ అధికారి గోపాల్‌రావు, హెచ్‌వో రమేష్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, పన్నుల విభాగం అధికారి రామకృష్ణతో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ - 22, హెల్త్, శానిటేషన్ - 9, ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ - 12, టౌన్‌ప్లానింగ్ - 52, తాగునీటి సరఫరా - 7, - హార్టికల్చర్ - 1, ఎలక్ట్రికల్ - 6 ఇలా మొత్తం 109 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ బాజ్‌పాయ్

అధికారులు స్వీకరించిన ఫిర్యాదులు ఇలా..

● గ్రేటర్ వరంగల్ 32వ డివిజన్ ఎస్ఆర్ఆర్ తోట కొండా కాలనీలో 10 సంవత్సరాలుగా వంద కుటుంబాలు నివాసం ఉంటున్నాం. కాలనీలో చాలా చోట్ల ఖాళీ ప్లాట్లలో తుమ్మలు, పిచ్చి మొక్కలు పెరగడం వల్ల పాములు, విషపురుగులు ఇళ్లల్లోకి వస్తున్నాయి. అధికారులు స్పందించి ఖాళీ ప్లాట్లతో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని విన్నవించారు.

● వరంగల్ లక్ష్మీపురంలోని ఈఎస్ఐ ఆసుపత్రి సమీపంలో ఉన్న మట్టి రోడ్డును కొందరు వ్యక్తులు ఆక్రమించి ఇండ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. రోడ్డుపై నిర్మాణాలు చేపట్టడం వల్ల అటుగా వెళ్లే ప్రజలకు, వాహ నాల రాకపోకలకు ఇబ్బందిగా ఏర్పడిందని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.

● హనుమకొండ అలంకార్ జంక్షన్ నుంచి ఉజిలిబేస్, కాపువాడ వరకు చాలా చోట్ల వీధి దీపాలు వెలగక రాత్రి సమయాల్లో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అంతే కాక రోడ్డుపై చాలా చోట్ల గుంతలు ఏర్పడ్డాయని కాపువాడకు చెందిన ఎమ్డీ నయిమోద్దీన్ విన్నవించారు.

● హనుమకొండ 4వ డివిజన్ అక్షరకాలనీ రోడ్డు నెంబర్ 3లో 40 ఫీట్ల రోడ్డు ఉండేది. కానీ కొందరు వ్యక్తులు రోడ్డును ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో 20 ఫీట్లకు చేరింది. కాలనీ చివరన ఉన్న కుటుంబాలు రోడ్డు ఇరుకుగా మారడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని కాలనీకి చెందిన రాపాక రాజు కమిషనర్‌ను కలిసి వెల్లడించారు.

శ్వాస ఆగిన శిశువుకు ఊపిరి అందించిన వైద్యులు

డాల్ఫిన్ ఆస్పత్రిలో ప్రత్యేక చికిత్స



మాట్లాడుతున్న వైద్యుడు ప్రవీణ్

వరంగల్ మెడికల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): చాలాకాలం తరువాత సంతానం కలిసిన దంపతులకు పుట్టిన శిశువుకు శ్వాస అందించి ప్రాణాలు కాపాడినట్లు డాల్ఫిన్ ఆస్పత్రి వైద్యులు ప్రవీణ్ తెలిపారు. సంగెం మండలం గాడిపల్లి గ్రామానికి చెందిన ప్రవళిక, మహేశ్ దంపతులకు 8 సంవత్సరాల అనంతరం సంతాన కలిగినట్లు డాక్టర్ ప్రవీణ్ తెలిపారు. ఇద్దరు కవల పిల్లలు ఉండటంతో ఫీటర్ స్కాన్ చేయగా ఒకరికి కాంజినేటల్ డయాఫ్రమేటిక్ హెర్నియా ఉన్నట్లు గుర్తించామన్నారు. వరంగల్ క్యూర్ వెల్ ఆస్పత్రిలో ప్రసవించగా ఒక శిశువును డాల్ఫిన్ ఆస్పత్రికి పంపించారు. ఆ శిశువు కిలో 600 గ్రాములతో జన్మించగా ఊపిరితిత్తుల్లో పేగులు అడ్డుపడడంతో శ్వాస కూడా తీసుకోవడం ఇబ్బందిగా మారింది. దీంతో తగిన శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు కాపాడినట్లు డాక్టర్ ప్రవీణ్ తెలిపారు. ప్రవీణ్‌తోపాటు డాక్టర్లు సిద్దార్థరెడ్డి, సురేశ్ పాల్గొన్నారు. మగ శిశువును రక్షించడంతో దంపతులిద్దరు ఆనందం వ్యక్తం చేశారు.



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న బంక సరళ సంపత్‌యాదవ్, డాక్టర్ దుర్గాప్రసాద్

నేపాల్ రుద్రాక్షల ఎగ్జిబిషన్ ప్రారంభం

బాలసముద్రం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన నేపాల్ రుద్రాక్షల ఎగ్జిబిషన్‌ను జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్, నేపాల్ రుద్రాక్షల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.దుర్గాప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సరళ యాదవ్ మాట్లాడుతూ పవిత్రమైన శ్రావణ మాసంలో రుద్రాక్షలు ధరించడం వలన ఆరోగ్యం, ఐశ్వర్యంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. ఈ రుద్రాక్షలు ధరించడం వలన మానవ జన్మ సుకృతమవుతుందని స్పష్టం చేశారు. సంస్థ ఎండి డాక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో ఏక ముఖి నుంచి 21 ముఖాల రుద్రాక్షలతోపాటు స్పటిక, తులసీ, నవరత్నమాలలు, పంచముఖి రుద్రాక్షమాలలు, సాలిగ్రాములు, మర్కట శివలింగాలు, కరుంగలి మాలలు, దైవికమైన వస్తువులు సరసమైన ధరలకు లభిస్తాయని అన్నారు. జన్మ నక్షత్రాన్ని పరిశీలించి అసలైన రుద్రాక్షలను ఇస్తామని చెప్పారు. ఈ ప్రదర్శన ఈనెల 9 వరకు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ జి.పద్మలత, బీసీ సంక్షేమ సంఘం జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి తేళ్ల సుగుణ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి తప్పిపోయింది

● కనిపిస్తే సమాచారం ఇవ్వండి
● వరంగల్ ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ షుకూర్



చిన్నారి సిస్టరీ (ఫైల్)

వరంగల్ క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ బస్టాండ్ ఆవరణలో ఆదివారం ఉదయం సుమారు 3 నుంచి 4 గంటల సమయంలో తండ్రితో నిద్రిస్తున్న బీహార్‌కు చెందిన 14 నెలల పాప పేరు సిస్టరీ కనిపించకుండా పోయిందని, గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లుగా అనుమానంగా ఉందని ఎవరికైనా సమాచారం తెలిస్తే వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఫోన్ నెంబర్స్ 87126 85118, 87126 85007, 87126 85096 కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పాప గుండ్రని ముఖంతో తప్పిపోయిన సమయంలో నీలం రంగు కలిగిన గౌను ధరించి ఉందని, పాపకు సంబంధించిన సమాచారం ఇస్తే తగిన పారితోషికం ఇవ్వనున్నట్టు తెలిపారు. పాప ఫొటోను ప్రజలు అన్ని వాట్సాప్ గ్రూప్‌లలో షేర్ చేయాలని కోరారు.

కాళేశ్వరం నీళ్లను ఎత్తిపోయాలి



కన్నెపల్లి పంప్‌హౌజ్ గేట్ వద్ద బైఠాయించిన బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ప్రజాప్రతినిధులు

మహదేవపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నేషనల్ డ్యామ్‌సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్) అనుమతులు ఉన్నా కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లను ఎందుకు ఆన్ చేయడం లేదని బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మేడిగడ్డ బ్యారేజీలో నీళ్లు పుష్కలంగా ఉన్నా రైతులకు సాగునీరు అందించకపోవడం దారుణమని దుయ్యబట్టారు. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద కరీంనగర్, వరంగల్ బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం ముట్టడికి యత్నించాయి.

బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధు ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం జరగ్గా ఎమ్మెల్సీ రమణ, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, విద్యాసాగర్‌రావు, రసమయి బాలకిషన్, దాసరి మనోహర్‌రెడ్డి, సుంకె రవిశంకర్, దివాకర్‌రావు, మాజీ జడ్పీచైర్మన్ జక్కు శ్రీహర్షిణి తదితరులు కాళేశ్వరం చేరుకున్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ ముట్టడికి భారీ శ్రేణులతో కలిసి బయల్దేరారు. డీఎస్పీ సూర్యనారాయణ నేతృత్వంలో అప్పటికే బందోబస్తులో ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. పంప్‌హౌస్‌లోకి బీఆర్ఎస్ నేతలు చొచ్చుకురాగా పోలీసులు వారిని నిలువరించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు అడ్డుకోవడంతో బీఆర్ఎస్ నేతలు పంప్‌హౌస్ ఎదుట బైఠాయించారు. ఈ నిరసన రెండు గంటలపాటు జరిగింది.

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మేడిగడ్డ బ్యారేజీ వద్ద గల కన్నెపంప్‌హౌస్ నుంచి సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. 'సీఎం డౌన్ డౌన్' అని నినాదాలు చేశారు. గోదావరి వద్ద నీటి ఉధృతి అధికంగా ఉందని, రోజుకు రెండు టీఎంసీల లభ్యత ఉందని, దీన్ని ఎత్తిపోయాలని అన్నారు. సరిపడా సాగునీరు ఉన్నా విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని దుయ్యబట్టారు. పొలాలు ఎండిపోతుంటే హైదరాబాద్‌లో కూర్చొని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ముచ్చట్లు చెబుతున్నారని మండిపడ్డారు.

ఎన్‌డీఎస్‌ఏ అనుమతి ఉంది కదా?

వారం రోజుల్లోగా నీటిని విడుదల చేసి సాగుకు నీరందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దీనిపై స్పందించాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగి మరమ్మతులకు వచ్చినా కన్నెపల్లి పంప్‌హౌస్‌లో నీటి లభ్యత ఉందని, వ్యవసాయ అవసరాల రీత్యా నీటిని విడుదల చేయొచ్చని తెలిపారు. తాము ఎన్‌డీఎస్ఏ అధికారులతో మాట్లాడామని, పంప్‌హౌస్ నుంచి నీటిని విడుదల చేయొచ్చని వారు చెప్పారని తెలిపారు. కన్నెపల్లి మోటార్లను ఆన్ చేయకపోతే వారం రోజుల్లోగా తామే ఆ పనిచేస్తామని హెచ్చరించారు.

నీళ్లు పుష్కలంగా ఉన్నాయి : బోయినపల్లి

బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటోందని విమర్శించారు. ప్రాణహిత కలిసిన తర్వాత మేడిగడ్డ బ్యారేజీ వద్ద పంప్‌హౌస్‌లో నీళ్లు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఉదయం 9.30 గంటలకు 93.76 మీటర్ల నీటిమట్టం ఉందన్నారు. లక్షా 40 వేల క్యూసెక్కుల నీళ్లు ఉదయం 9.30 గంటలకు ప్రవహిస్తున్నాయని తెలిపారు. ఆ నీటిని బ్రహ్మాండంగా వినియోగించుకోవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. తెలంగాణ సమస్యలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి, అలాగే కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు అర్థం కావడం లేదని దుయ్యబట్టారు. గతంలో మహారాష్ట్ర ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు చెప్పినా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లకు నీళ్లు ఎత్తిపోశామన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీళ్లు తెచ్చామన్నారు. ఇయ్యాల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల నోట్లో మట్టి కొడుతున్నారని దుయ్యబట్టారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రమణ, సింగిల్‌విండో అధ్యక్షులు రమణరావు, రామకృష్ణరావు, జగిత్యాల జిల్లా పరిషత్ చైర్మన్ దావ వసంత, మాజీ ఎంపీపీ వసంత, నేతలు ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, రఘువీర్‌సింగ్, రమేష్ రాజా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

● ఉపాధ్యాయుడు మందలించడంతో మనస్తాపం
● ఆస్పత్రికి తరలించిన కుటుంబ సభ్యులు



విద్యార్థి వినయ్

ఐనవోలు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలోని ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి పురుగుల మందు తాగిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. అదే గ్రామానికి చెందిన తోట వినయ్ స్థానిక పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. సాయంత్రం స్టడీ అవర్ సమయంలో అందరితో కలిసి కూర్చోకుండా బయటికి వెళ్లివచ్చాడు. తోటి విద్యార్థులతో కలిసి కూర్చొని చదువకుండా ఇదేం పద్ధతి అంటూ ఉపాధ్యాయులు, ప్రైవేటు పీఈటీ విద్యార్థిని మందలించాడు. ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ బాధ్యులు విద్యార్థి తల్లి రజితకు ఫోన్ చేసి బాలుడి ప్రవర్తనను సరిచేయాలని ఫిర్యాదు చేశారు. సాయంత్రం 6 గంటలకు స్టడీ అవర్ పూర్తయ్యాక తోటి విద్యార్థులతో కలిసి ఇంటికి వెళ్లాడు. ఇంటిపక్కనే ఉన్న పశువుల పాకలో పురుగుల మందు తాగగా కుటుంబసభ్యులు గుర్తించి ఆసుపత్రికి తరలించారు. అయితే విద్యార్థి వినయ్ నిత్యం అల్లరి చేస్తుండేవాడని, ఉపాధ్యాయులతో గొడవ పడేవాడు. 15 రోజుల క్రితం నలుగురు విద్యార్థులు ఐనవోలు పోలీస్‌స్టేషన్ సమీపంలో గొడవ పడి కొట్టుకున్నారు. ఈ సంఘటనపై నలుగురు విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాల కమిటీ బాధ్యులు పిలిపించి పిల్లల ప్రవర్తనను వివరించి సరిచేయాలని మందలించారు. ఈ నలుగురు విద్యార్థుల కారణంగా 10వ తరగతిలో ఉన్న 43 మంది విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగుతుందని, మరోసారి ఇలాంటి గొడవలకు దిగితే పాఠశాల నుంచి పంపిస్తామని హెచ్చరించి వదిలేశారు. పురుగుల మందు తాగిన విద్యార్థికి తల్లి, సోదరుడు ఉన్నారు. తండ్రి గతంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.



వస్తున్నాం కాచుకోండి..

- అపరిశుభ్ర జనావాసాల్లో తిష్ట వేస్తాం
- ఎవరినైనా సరే పీల్చి పిప్పి చేస్తాం
- అధికార యంత్రాంగం ఉత్తుత్తి చర్యలు మమ్మల్ని ఏమీ చేయలేవు
- శుచీ, శుభ్రత ఉంటే ఆవైపు రానే రాం...

వర్షాకాలం వేళ దోమల సవాల్

పల్లె మాదే.. పట్నంలో గల్లీ మాదే.. అక్కడా ఉంటాం.. ఇక్కడా ఉంటాం.. ఒక్కరమో ఇద్దరమో కాదు, వేలు.. లక్షల్లో కదిలి దండుగా వచ్చేస్తాం.. మేమెవరిమో తెలుసా..? జనాల రక్తాన్ని పీల్చి పిప్పిచేసే దోమలం.. అంతా శుభ్రంగా ఉంటే మేమెందుకు బాగుంటాం.. ఎక్కడ మురుగు ఉంటే అక్కడే వాలిపోతాం.. ఓపెన్ ప్లాట్లు మురుగునీటి గుంతలు.. డ్రెయినేజీలే మా స్థావరాలు.. అక్కడే దినదిన ప్రవర్థమానమవుతాం.. మీకు చేతనైతే మమ్మల్ని కట్టడి చేయండి చూద్దాం.. యుద్ధం నీదా.. నాదా.. సై.

రోగాలు దాసోహం..

మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు ఇలా చెప్పుకుంటూ పోతే వ్యాధుల జాబితాలోని రోగాలన్నీ మాకు దాసోహమే.. మేం ఎక్కడ సంచరిస్తే రోగాలు అక్కడే ప్రజ్వరిల్లుతాయి. మమ్మల్ని అంతమొందించేందుకు ప్రభుత్వం, అధికారులు వారోత్సవాలు పక్షోత్సవాలు అట్టహాసంగా నిర్వహిస్తారు.. రూ. కోట్ల కొద్దీ బడ్జెట్‌ను కేటాయించి ఖర్చులు చేస్తారు.. కానీ మమ్మల్ని అవేమీ చేయలేవు.

ఇంటింటా ప్రత్యేక బడ్జెట్..

మమ్మల్ని నాశనం చేసేందుకు సర్కారు చర్యలకు అదనంగా ఇంటింటా ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించకుంటున్నారు. జనగామ జిల్లానే తీసుకుంటే 2011 జనాభా లెక్కల ప్రకారం 5,66,376 మంది జనాభా ఉన్నారు. వారిలో 2,83,648 మంది పురుషులు, 2,82,728 మంది మహిళలు, 55056 మంది చిన్నారులు ఉన్నారు.. పిల్లా జెల్లా.. ముసలి ముతక అంతా కలిసి ప్రస్తుత జనాభా 7 లక్షల పైచిలుకే ఉంటుందని మేమనుకుంటున్నాం.. అందులో 5 లక్షల పైచిలుకు గ్రామీణ జనాభా అయితే రెండు లక్షల దాకా పట్టణ జనాభా. మొత్తంగా సుమారు రెండు లక్షల గృహాలు ఉంటాయని మేమంతా అంచనాకు వచ్చేశాం. వీరంతా కలిసి ఎవరికి వారు.. విడివిడిగా మా కోసం నెలవారీగా ప్రత్యేక బడ్జెట్ కేటాయించుకుంటున్నారు.. ఎందుకంటే.. మస్కిటో కాయిల్స్, ఎలక్ట్రిక్ బ్యాట్లు కొనుగోలు చేసుకుంటున్నారు.. పాపం వాళ్లకేం తెలుసు.. ఇళ్లంతా శుచి.. శుభ్రంగా ఉంచుకుంటే మేమెందుకు వస్తాం.. డెట్టాల్, బ్లీచింగ్‌ను వాడితే చాలు అటు వైపు కన్నెత్తి కాదుగదా.. ఆ ప్రాంతం జోలికే వెళ్లబోం.



మీ నిర్లక్ష్యమే.. మాకు సుభిక్షం..

పట్టణాలు, పల్లెలు, గల్లీలు, తండాలు అనే తేడా లేకుండా పెద్ద పెద్ద డ్రైనేజీలు, మురుగునీటి గుంతలు, ఇళ్ల మధ్య నిలిచే మురుగునీటి స్థావరాలే మా రాజభోగాలకు విలాసాలు.. మమ్మల్ని తన్ని తరిమేందుకు పారిశుధ్య సైనికులు మునిసిపాలిటీ, గ్రామపంచాయతీల్లో వందలాది మంది ఉన్నారు.. అయినా మమ్మల్నేం చేయలేరు.. మమ్మల్ని సంహరించేందుకు రూ. కోట్లల్లో ఖర్చు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.. వాటిని సజావుగా వినియోగించేందుకు పెద్ద పెద్ద సార్లు రోజూ మీటింగ్‌లు పెట్టి సమీక్షిస్తారు.. అంతకుమించి మమ్మల్నేం చేయగలరు చెప్పండి.. కలెక్టర్ సార్ హుకుం జారీ చేయడం.. కింది సార్లు తలలూపడం.. ఆ కింది వాళ్లు పారిశుధ్య చేయించినట్లు ఫోటోలు దిగడం.. ఇది చాలదా మా సామ్రాజ్య విస్తరణకు అవకాశం. క్షేత్రస్థాయి అధికారుల నిర్లక్ష్యం నిరంతరం నిండుకుండలా ఉండటం సహజమే. అదే సుభిక్షమై వర్ధిల్లడం మాకు సునాయసమే.


పనిచేయని ఫాగింగ్ మిషన్లు..

మమ్మల్ని అంతం చేయడమే లక్ష్యంగా నాలుగేళ్ల క్రితం గ్రామపంచాయతీ అధికారులు ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేశారు. అవి సరిగ్గా పనిచేస్తే కదా.. మా భరతం పట్టేది. ఫాగింగ్ మిషన్ల పప్పులు మా వద్ద ఏమీ ఉడకవు.. చాలా గ్రామాల్లో మిషన్లు పాడైపోయి స్టోర్ రూంలో మూలుగుతున్నాయి. మా లార్వాలను నాశనం చేసేందుకు ప్రతీ సీజన్‌లో ఆయిల్‌బాల్స్ డ్రైనేజీల్లో మందులను పిచికారి చేయాలని అధికారులు ప్రణాళికలను రచిస్తుంటారు. చూద్దాం.. మమ్మల్ని అవేం చేయగలవో. జనాలపై మా ఆపరేషన్ పూర్తయ్యాక అధికారులు మాపై ఆపరేషన్ షురూ చేస్తారు గదా, అప్పటికి జనాలకు జరిగే నష్టం ఎంచక్కా జరిగిపోవడం ఖాయం. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై, మురుగునీటి గుంతల్లో నీళ్లు నిలిచాయి.. అక్కడే మేమంతా మకాం వేస్తాం.. మా సంతతిని వృద్ధి చేస్తాం.. ఆఫీసర్ ఎవరో.. సామాన్యులు ఎవరో మాకేం తెలుసు.. మాకంతా సమానమే.. కాచుకోండి మమ్మల్నెవరూ అడ్డుకోలేరు.

ఇట్లు
దోమల దండు

- ఆంధ్రజ్యోతి, లింగాలఘణపురం

తల్లిపాలు.. ఎంతో మేలు!



- నామమాత్రంగా సాగుతున్న వారోత్సవాలు
- తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యం
- పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టిస్తే వ్యాధి నిరోధక శక్తి
- అంగన్‌వాడీ కేంద్రాల్లో కానరాని సమావేశాలు

కృష్ణకాలనీ(భూపాలపల్లి), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టిస్తే వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారు. పుట్టిన బిడ్డకు తల్లి పాలు పడితే.. బిడ్డతో పాటు తల్లికి కూడా ఆరోగ్యకరమే. తల్లిపా విశిష్ఠతపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతీయేటా ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు వారోత్సవాలను నిర్వహిస్తోంది. ఏడు రోజుల పాటు విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టి బాలింతలు, తల్లులకు అవగాహన కల్పించాల్సి ఉండగా జిల్లాలో క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు జరగడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి.

అడపాదడపా కార్యక్రమాలు..

తల్లిపాల ప్రాముఖ్యతను తెలుపుటకు రాష్ట్ర ప్రభుత్వం ఏడు రోజుల పాటు వివిధ కార్యక్రమాల నిర్వహణకు ప్రతీ యేటా శ్రీకారం చుడుతోంది. అయితే, క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమాలు జరగడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ర్యాలీలు నిర్వహించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాల్సి ఉండగా అంగన్‌వాడీ కేంద్రాల్లోని సెక్టార్ పరిధిలో అంతా ఒకే చోట నామమాత్రపు కార్యక్రమాలు చేపడుతూ చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. అంగన్‌వాడీ టీచర్లతో పాటు ఆశాలు, ఏఎన్ఎంలు, మహిళా సంఘాలతో సమావేశాలు నిర్వహించి గృహ సందర్శన చేయాలనే నిబంధన ఉంది. ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం సైతం చేపట్టాలి. కానీ, అవేమి జిల్లాలో కానరావడం లేదు.

అంతటా ఇదే తంతూ..?

జిల్లా వ్యాప్తంగా భూపాలపల్లి, మహదేవపూర్ రెండు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ రెండు ప్రాజెక్టులు కలుపుకొని 644 అంగన్‌వాడీ సెంటర్లు నడుస్తున్నాయి. వీటన్నింట్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే ఎక్కడా కార్యక్రమాలేవి నిర్వహించిన దాఖలాలు మాత్రం కానరావడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

అంగన్‌వాడీ టీచర్లు మాత్రమే అది కూడా సెక్టార్ పరిధిల్లోని మూడు, నాలుగు సెంటర్లు కలుపుకొని కార్యక్రమం చేపడుతూ ఉన్నతాధికారులకు ఫోటోలు పెట్టి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి.

లోపిస్తున్న సమన్వయం..

తల్లిపాల ప్రాముఖ్యత కీలకమైన కార్యక్రమంగానే చెప్పుకోవచ్చు. ఎందుకంటే పుట్టిన బిడ్డకు తల్లి తన పాలు పట్టించవచ్చా.. లేదా అనే సందేహాలు తల్లుల్లో వారి కుటుంబీకుల్లో నెలకొని ఉంటాయి. కానీ, పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు పట్టించడాన్ని ముర్రుపాలు అంటారు. ఆ ముర్రుపాలు పట్టిస్తే పుట్టిన బిడ్డ ఎంతో ఆరోగ్యంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. మహిళా స్త్రీశిశు, దివ్యాంగుల సంక్షేమశాఖ నేతృత్వంలో జరిగే ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ (డీఆర్‌డీఏ), వైద్యఆరోగ్యశాఖ, ప్రైవేటు ఆసుపత్రుల నెట్‌వర్క్, మహిళలు, పిల్లల కోసం పని చేసే ఎన్‌జీఓలను భాగస్వామ్యం చేయాల్సి ఉంటుంది. వీరిందరితో తల్లిపాల ప్రాముఖ్యతను తెలిపేలా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, ప్రచారం చేపట్టాలనే నిబంధన ప్రభుత్వం ద్వారా ఆర్‌జేడీ కార్యాలయం నుండి స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. కానీ, ఈ శాఖల్లో సమన్వయం లోపం కొట్టిచ్చినట్లుగా కానవస్తోంది.

నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ డీమ్డ్ యూనివర్శిటీలు, కాలేజీలు

నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు వినియోగదారుల మండలి ఫిర్యాదు



మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేసిన వినియోగదారుల మండలి జాతీయ ప్రతినిధులు చక్రపాణి, సుదర్శన్

హనుమకొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ డీమ్డ్ యూనివర్శిటీలు, ప్రైవేటు మెడికల్ యూనివర్శిటీల ఏర్పాటుపై వినియోగదారుల మండలి జాతీయ ప్రతినిధులు సాంబరాజు చక్రపాణి, మొగిలిచెర్ల సుదర్శన్ సోమవారం ఢిల్లీలో నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా, లోపభూయిష్ట విధానాలతో ఏర్పాటయిన రెండు డీమ్డ్ యూనివర్శిటీలు, ఒక ప్రైవేటు మెడికల్ యూనివర్శిటీ వల్ల రాష్ట్రంలో ప్రభుత్వ కోటాలో 550 ఎంబీబీఎస్ సీట్లకు కోత పడిందని, దీని వల్ల అర్హులైన విద్యార్థులు నష్టపోయారని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం తెలంగాణకు చెందిన మెడికల్ సీట్లలో కోత జరగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రైవేటు డీమ్డ్ యూనివర్శిటీలకు నో ఆబ్జక్షన్ సర్టిఫికెట్‌లు ఇవ్వరాదని ప్రకటించిన విషయాన్ని నేషనల్ మెడికల్ కౌన్సిల్ దృష్టికి చక్రపాణి, సుదర్శన్ తీసుకువచ్చారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన మెడికల్ సీట్ల కుంభకోణంపై తెలంగాణ లోకాయుక్త విచారణ ముగిసేంత వరకు మెడికల్ సీట్ల కేటాయింపు జరగరాదని, అర్హులైన విద్యార్థులకు గత రెండు సంవత్సరాలుగా జరిగిన అన్యాయానికి తగిన నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఎన్ఎంసీని వీరు అభ్యర్థించారు.

బీసీలపై ప్రేముంటే కాంగ్రెస్‌కు సహకరించాలి

బీజేపీ, బీఆర్ఎస్ నాయకులకు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు సూచన



ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు

వరంగల్ సిటీ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బీసీలపై ప్రేముంటే రిజర్వేషన్ కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బిల్లుకు చట్టబద్ధత కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీకి సహకరించాలని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులకు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు సూచించారు. సోమవారం ఆయన హనుమకొండలోని తన నివాసంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు శాసనసభలో బీసీ రిజర్వేషన్ల తీర్మానం చేసి కేంద్రానికి పంపితే.. చట్టబద్ధత కల్పించకుండా ప్రజలను మభ్య పెడుతోందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. బీసీ రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత కల్పించేందుకు కాంగ్రెస్‌తో కలిసిరావాలని పిలుపునిచ్చారు. తూర్పు నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల పనులు చురుకుగా సాగుతున్నాయని అన్నారు. ప్రజలు ఏ సమస్య ఉన్నా పరిష్కారం కోసం తన వద్దకు రావాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో వరంగల్ తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని అన్నారు.

అథ్లెటిక్స్ ఓవరాల్ చాంపియన్ ఖమ్మం

- ముగిసిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్, సీనియర్స్ పోటీలు
- బహుమతులు ప్రదానం చేసిన గట్టు మహేష్‌బాబు



ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన ఖమ్మం జిల్లా అథ్లెట్లకు ట్రోఫీని అందజేస్తున్న అతిథులు, నిర్వాహకులు



అండర్ 16-బాలికల విభాగంలో టీం చాంపియన్‌షిప్‌సాధించిన ఆతిథ్య హనుమకొండ జిల్లాకు ట్రోఫీని అందజేస్తున్న అతిథులు

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్) సింథటిక్‌ట్రాక్‌పై నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఖమ్మం జిల్లా క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సాధించారు. హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జేఎన్ఎస్‌లో నిర్వహిస్తున్న 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్, సీనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ముగిశాయి. 33 జిల్లాల, 10 స్పోర్ట్స్ పాఠశాలల నుంచి 1400 మంది రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. హోరాహోరీగా జరిగిన త్రోస్, జంప్స్, రన్స్‌తో పాటు టీం ఈ వెంట్లలో ఖమ్మం జిల్లా అథ్లెట్లు ముందు నుంచే దూకుడుగా తమ ప్రతిభతో మెరిసి పలు పసిడి, రజత, కాంస్య పతకాలు కొల్లగొట్టి ఓవరాల్ చాంపియన్‌షిప్‌తో పాటు అండర్- 20 బాలబాలికల టీం చాంపియన్‌షిప్ సైతం సాధించారు. అండర్-18 బాలుర విభాగం టీం చాంపియన్‌షిప్‌లో మహబూబ్‌నగర్, బాలికల్లో ఖమ్మం, అండర్-16 బాలురు విభాగంలో రంగారెడ్డి, బాలికల విభాగంలో ఆతిథ్య హనుమకొండ జిల్లా అథ్లెట్లు తమ ప్రతిభతో రాణించారు.జేఎన్ఎస్‌లో ఏర్పాటు చేసిన ముగింపు సమావేశానికి ఆర్య వైశ్య సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు గట్టు మహేష్ బాబు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలను, బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటమిని రేపటి గెలుపు కోసం మలుచుకోవాలని క్రీడాకారులకు సూచించారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి మాట్లాడుతూ... జూనియర్స్ బాలబాలికల విభాగంలో ఇక్కడ రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అథ్లెట్లు సెప్టెంబర్ 9 నుంచి 12 వరకు పాండిచ్చేరిలో నిర్వహించనున్న సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు. అదే విధంగా మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ విభాగంలో ఆగస్టు 20 నుంచి 24 వరకు చెన్నైలో నిర్వహించనున్న అంతర్ రాష్ట్రాల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో అశోక్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పగడాల వెంకటేశ్వర్‌రెడ్డి, అంతర్జాతీయ స్థాయి అథ్లెట్, మడికొండ పోలీస్ స్టేషన్ సీఐ పుల్యాల కిషన్, కోచ్‌లు శ్రీమన్నారాయణ, దిమ్మిక నాగరాజు, పీడీలు మనోజ్‌కుమార్, వాసు, రజినికాంత్, వివిధ జిల్లాలకు చెందిన అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, టెక్నికల్ అఫీషియల్స్ తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్‌తో యూరియాను పిచికారీ చేసే విధానాన్ని రైతులకు వివరిస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు

డ్రోన్‌తో నానో యూరియా పిచికారీ

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండలం సంద్రాలగూడెంలో సోమవారం నానో యూరియా పిచికారీ చేసే విధానాన్ని ఏడీఏ శ్రీనివాసరావు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. నత్రజని పోషకాన్ని అందించే నానో యూరియా పిచికారీ చేయడం వల్ల మొక్కల వినియోగ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చన్నారు. యూరియా వేయడం వల్ల వర్షానికి కొట్టుకుపోతుందని, నానో యూరియా వాడడం వల్ల మొక్కలపై ఉండి వాటి ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు. కూలీల ఖర్చును అధిగమించవచ్చని, సమయమూ ఆదా అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ఎన్.తిరుపతిరెడ్డి, కంబాలపల్లి ఏఈవో రంజిత్‌కుమార్, డ్రోన్ పైలెట్ కార్తీక్‌కుమార్, రైతులు దుబ్బ వెంకన్న, అప్పిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండలో 'ఇంటర్ సిటీ'

హాల్టింగ్ మళ్లీ రద్దు

తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

నెక్కొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్-గుంటూరు, గుంటూరు- సికింద్రాబాద్ (12705/12706) ఇంటర్‌సిటీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్‌ను నెక్కొండ రైల్వే స్టేషన్‌లో రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం నుంచే అమల్లోకి తీసుకువచ్చినట్టు తెలిపారు. తొమ్మిది పరిసర మండలాల్లోని ప్రయాణికులకు నెక్కొండ రైల్వే స్టేషన్ అందుబాటులో ఉంటోంది. రైల్వే శాఖకు ప్రతీ రోజు టికెట్ల ద్వారా రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ ఆదాయం వస్తోంది. అలాగే ఒక్క ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌కు ప్రతీ రోజు రూ.15వేల నుంచి రూ.20 వేల వరకు ఆదాయం వస్తోంది. అయినా ఇంటర్‌సిటీని రద్దు చేయడం పట్ల ప్రయాణికులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు. నెక్కొండ రైల్వే స్టేషన్ సమస్యలను పట్టించుకోవాల్సిన మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ కనీసం స్పందించడంలేదంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు సంవత్సరాల కాలంలో నెక్కొండ స్టేషన్‌లో ఇంటర్‌సిటీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్‌ను రద్దుపర్చడం ఇది మూడోసారి. రైల్వే అధికారుల చర్యతో నెక్కొండ నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

21న అర్బన్ బ్యాంక్ ఎన్నికలు

- 8, 11, 12 తేదీలలో నామినేషన్ల దాఖలు
- 13న పరిశీలన, 14న ఉపసంహరణ
- 21న ఎన్నికల పోలింగ్, ఫలితాల ప్రకటన
- షెడ్యూల్ ప్రకటించిన ఎన్నికల అధికారి ఎం.వాల్య నాయక్



వాల్యనాయక్

వరంగల్ సిటీ, అగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్‌కు ఈనెల 21న ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను ఎన్నికల అధికారి ఎం.వాల్యనాయక్ (డిప్యూటీ రిజిస్ట్రార్, జిల్లా సహకార అధికారి జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా) సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా వరంగల్ కాశిబుగ్గలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పది శాఖలు, 6368 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఎస్సీ ఎస్టీ 1, మహిళా క్యాటగిరిలో 2, ఓపెన్ క్యాటగిరిలో 9 మొత్తం 12 స్థానాలకు రహస్య బాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. పోటీ చేయదలిచిన వారు ఈనెల 8, 11, 12 తేదీలలో కాశిబుగ్గ కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేయాలన్నారు. 13వ తేదీన పరిశీలన, 14న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం తుది జాబితాను ప్రకటిస్తామన్నారు. అభ్యర్థులకు ఎన్నికల చిహ్నం కేటాయిస్తామన్నారు.

21న మట్టెవాడ, ఎస్‌వి ఎన్‌రోడ్ ఏవీవీ కళాశాలలో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎన్నికలు జరుపుతామని, పోలింగ్ ముగిసిన తరువాత వెంటనే ఓట్లను లెక్కించి ఫలితాలను ప్రకటిస్తామన్నారు. ఆ తదుపరి మూడు రోజుల్లో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరుగుతుందని, దీంతో ఎన్నికల తంతు ముగుస్తుందని ఎన్నికల అధికారి ఎం. వాల్య తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛతా అభియాన్



స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న స్టేషన్ మేనేజర్ అగ్గి రవీందర్

కాజీపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వే స్టేషన్‌లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రైల్వే స్వచ్ఛతా అభియాన్ పేరుతో పరిశుభ్రతపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతపై ఉద్యోగులకు, ప్రయాణికులకు అవగాహన కల్పించారు. స్టేషన్ మేనేజర్ అగ్గి రవీందర్ హాజరై స్వచ్ఛత, పరిశుభ్రతపై రైల్వే అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు నజన్‌లాల్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

వైభవంగా రుద్రాభిషేకాలు

వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని దంపతులు



రుద్రేశ్వరుడి సన్నిధిలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో శివ ప్రీతికర శ్రావణ సోమవారం ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడింది. సుప్రభాత సేవ, ఉత్తిష్ట గణపతికి క్షీరాభిషేకం అనంతరం రుద్రేశ్వరుడికి మహాన్యాసపూర్వక పాశుపత రుద్రాభిషేకం నిర్వహించా రు. అనంతరం 200 మంది పుణ్య దంపతులు స్వామికి సామూహిక రు ద్రాభిషేకాలు నిర్వహించారు. రుద్రాభిషేకంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి-నీలిమ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు గంగు మణికంఠశర్మ అవధాని, విశ్వనాథ కాశీలింగాచార్య, ప్రణవ్‌శర్మ భక్తులకు పూజాధికాలు నిర్వహింపజేశారు. సాయంత్రం ప్రదోషకాల సమయంలో భక్తులు పెద్ద ఎత్తున భజనలు చేశారు. అదే విధంగా హనుమకొండలోని దక్షిణ కాశీగా పేరుగాంచిన సిద్దేశ్వరాలయంలోనూ శ్రావణ సోమవారం వేళ ప్రత్యేక అలంకరణతో సిద్దేశుని వందలాది భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు రవికుమార్, సురేశ్ కుమార్‌లు భక్తులకు పూజాధికాలు నిర్వహింపజేశారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణగౌడ్

వడ్డెపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి వెంటనే అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణగౌడ్ డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈనెల 7న గోవాలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించే మహా సభకు వెళ్లే బస్సు యాత్రను సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్ ముందు జెండా ఊపి ప్రారంభించారు. గోవాకు బస్సు యాత్రకు వెళ్లే వారిలో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్య యాదవ్, రాష్ట్ర, జిల్లా నాయకులు బీమగాని యాదగిరిగౌడ్, బొనగాని యాదగిరిగౌడ్, కాసగాని అశోక్, మాదం పద్మజాదేవి, తేళ్ల సుగుణ కిశోర్, తమ్మల శోభారాణి, వల్లాల జగన్‌గౌడ్, పంజాల మధు, అరెగంటి నాగరాజు, బూర్గుల ప్రమోదాదేవి, జనగాం శ్రీనివాస్‌గౌడ్, మహేందర్, చంద్రశేఖర్, శ్రీకాంత్, మహేందర్ ఉన్నారు.

అరవింద్‌కుమార్‌ను కలిసిన కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 04 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరంలో లోతట్టు ప్రాంతాలు, వరద ముంపు నివారణ చర్యల కోసం వరంగల్ నగరానికి వచ్చిన రెవె న్యూ విపత్తు నిర్వహణ అధికారి అరవింద్‌కుమార్‌ను జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ కలిసి పూలమొక్కను అందించారు. జీడబ్ల్యూఎంసీకార్యాలయానికి సదా రంగా సాగతం పలికారు. వరంగల్ నగరంలోని స్థితిగతులపై ఇద్దరు అధికారులు కూలంకశంగా మాట్లాడుకున్నారు.

బీఆర్‌పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రమేష్



వడ్డెపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బహుజన్ రాజ్యాధికార పార్టీ(బీఆర్‌పీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హనుమకొండ పట్టణానికి చెందిన పూరేల్ల రమేష్ నియమితులయ్యారు. బీఆర్‌పీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య ఈ మేరకు సోమవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. బీఆర్‌పీని తెలంగాణ రాష్ట్రంలో బలోపేతం చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రమేష్ పేర్కొన్నారు.

‘ప్రెస్‌క్లబ్ సభ్యుల సంక్షేమమే లక్ష్యం’

వడ్డెపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ప్రెస్‌క్లబ్ సభ్యుల సంక్షేమమే తమ లక్ష్యమని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌క్లబ్ సభ్యులకు ఇన్సూరెన్స్‌కు సంబంధించిన ఫారాలను డెస్క్ జర్నలిస్టులకు పంపిణీ చేశారు. దరఖాస్తులను నింపి క్లబ్ బాధ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్ తదితరులతో పాటు పలువురు డెస్క్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

చెస్ విజేత అభినవ్‌సాయి

ముగిసిన జిల్లా స్థాయి చెస్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి) : వరంగల్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి చెస్ టోర్నీలో అభినవ్‌సాయి, షేక్ రియాజ్, విజయ్‌చందర్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచారు. టీటీడీ కల్యాణ మండపంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఓపెన్ టు ఆల్ బాలబాలికల చెస్ టోర్నీ సోమవారం ముగిసింది. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో హోరాహోరీగా జరిగిన చెస్ టోర్నీలో పాల్గొన్న క్రీడాకారులు తమ ప్రత్యర్థులపై ఎత్తుకు పై ఎత్తు వేస్తూ విజయం సాధించేందుకు మేదస్సుకు పదును పెట్టారు. ఈ సందర్భంగా చెస్ టోర్నీ నిర్వాహణ కార్యదర్శి కన్న మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన టోర్నీలో 50 మంది బాలబాలికలు పాల్గొన్నరన్నారు. ఈ సందర్భంగా నిర్వహకులు విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు.

కాజీపేట మీదుగా కాంగ్రెస్ స్పెషల్ రైలు

ఎమ్మెల్యేలను కలిసేందుకు ఆసక్తి చూపని మీనాక్షి నటరాజన్

కాజీపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈనెల 5, 6, 7 తేదీల్లో జరిగే బీసీ రిజర్వేషన్ల ధర్నాకు హైదరాబాద్ నుంచి ఢిల్లీకి వెళ్లే స్పెషల్ రైలు కాజీపేట మీదుగా సోమవారం వెళ్లింది. ఈ రైలులో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌తో పాటు ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ వెళ్లనున్నారన్న సమాచారంతో వారిని కలిసి స్వాగతం పలికేందుకు ఉదయం 11.30 గంటలకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుతోపాటు కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున కాజీపేట రైల్వే స్టేషన్‌కు వచ్చారు. కాజీపేటలో హాల్టింగ్ లేకున్నప్పటికి స్టేషన్ మాస్టర్‌తో ఎమ్మెల్యేలు మాట్లాడి ప్రత్యేకంగా రైలును ఆపాలని అనుమతి తీసుకున్నారు. అంతా బాగానే ఉన్నప్పటికి సడన్‌గా రైల్వే స్టేషన్ నుంచి ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు తిరుగుముఖం పట్టారు. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ ఆలేరులో దిగి శంషాబాద్‌కు వెళ్లి ఫ్లైట్‌లో ఢిల్లీ వెళ్లారని, స్పెషల్ రైలుకు కాజీపేట జంక్షన్‌లో హాల్టింగ్ లేదని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నప్పటికి రైలులో వస్తున్న తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఎమ్మెల్యేలను, కాంగ్రెస్ నాయకులను కలిసేందుకు ఆసక్తి చూపలేదని చర్చించుకుంటున్నారు. స్టేషన్ నుంచి కాంగ్రెస్ నాయకులు వెళ్లిపోగా, తీరా చూస్తే 11.55 గంటలకు స్పెషల్ రైలు వచ్చి కాజీపేటలో ఆగింది. 3 నిమిషాల తర్వాత రైలు వెళ్లింది.

రైలు ఆగినప్పుడు స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు ఒక్కరు కూడా లేరు. మొత్తంగా గంటసేపు మాత్రం కాంగ్రెస్ నాయకులు స్టేషన్‌లో హడావిడి చేశారు. కాగా, బొకేలు, శాలువాలతో కాంగ్రెస్ నాయకుల స్వాగతాన్ని మీనాక్షి నటరాజన్ ఆసక్తి చూపకపోవడంతో కాంగ్రెస్ నాయకులు తిరుగుముఖం పట్టారని తెలుస్తోంది.

బీసీ రిజర్వేషన్లకు బీజేపీనే అడ్డు

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

న్యూశాయంపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లకు బీజేపీనే ప్రధాన అడ్డంకి అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి అధ్యక్షతన సీపీఐ జిల్లా సమితి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా శ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై బీజేపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తుందని, ఆ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే వెంటనే బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని డిమాండ్ చేశారు. బీసీల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్న బీజేపీకి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు గుణపాఠం చెప్పాలన్నారు. బీసీ రిజర్వేషన్లకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని, బీసీల రిజర్వేషన్లను అడ్డుకుంటున్న బీజేపీని నిలువరించే వామపక్షాలను బలోపేతం చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టులను ప్రజలు ఆదరించాలని కోరారు. ఈ నెల 19వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు మేడ్చల్‌లో జరుగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలకు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నాయకులు శ్రీనివాస్, సదాలక్ష్మి, అశోక్‌స్టాలిన్, మద్దెల ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



శ్యామ్‌ను అభినందిస్తున్న యాదవరెడ్డి

శ్యామ్‌కు అభినందనలు

హనుమకొండ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ చలన చిత్ర అవార్డులలో భాగంగా బలగం సినిమాలో ‘ఊరు పల్లెటూరు’ అనే పాటకు లిరిక్స్ అందించిన కాసర్ల శ్యామ్‌కు జాతీయ అవార్డు ను ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా, సోమవారం హైదరాబాద్ లోని శ్యామ్ నివాసంలో వరంగల్ కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, ప్రముఖ రచయిత కోమరాజు, రామలక్ష్మి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, మధార్‌లతో కలిసి శ్యామ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.



కుడా చైర్మన్‌కు వినతి పత్రం అందిస్తున్న ఓ సిటీ ప్రజలు

ఓసిటీ సమస్యలు పరిష్కరించాలి

‘కుడా’ చైర్మన్‌ను కలిసిన కాలనీవాసులు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ ఓ సిటీలో నిత్యం లారీలు, బస్సులు అక్రమ పార్కింగ్ చేయడంతో పాటు అక్కడే వ్యర్థ పదార్థాలు వేయడం వల్ల దుర్వాసన వెదజల్లుతుందని అక్కడ నివాసాలు ఉండలేక పోతున్నామని ఓ సిటీ ప్రజలు సోమవారం కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ప్రతీ రోజు వందకు ప్రైవేటు లారీలు, డీసీఎంలు పార్కింగ్ చేయడంతో దుమ్ము దూళీ వస్తోందనీ వెల్లడించారు. ఇక్కడ పార్కింగ్ చేయడం వల్ల పార్కింగ్ సమస్య ఏర్పడుతుందని తమ సమస్యను పరిష్కరించాలని ప్రజలు చైర్మన్‌ను కోరారు. స్పందించిన చైర్మన్ సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

ఏబీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్



ఏబీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

న్యూశాయంపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఏబీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ ఆరోపించారు. విద్యాశాఖకు మంత్రిని నియమించాలని సోమవారం ఏబీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో హనుమకొండలో విద్యార్థులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా మంద నరేష్ మాట్లాడుతూ విద్యార్థులు, విద్యార్థుల తల్లి దండ్రులు వేసిన ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోవడం సరికాదన్నారు. అన్ని శాఖలకు మంత్రులను నియమించి విద్యాశాఖకు మంత్రిని నియమించక పోవడంతో సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థుల పక్షాన లేరని అర్థమవుతోందని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇప్పటికైనా సీఎం స్పందించి విద్యార్థులు సమస్యలు పరిష్కరించడంతోపాటు వెంటనే విద్యాశాఖకు మంత్రిని నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్‌ఎఫ్ నాయకులు చరణ్, విష్ణు, అరవింద్, శ్రీకాంత్, పీటర్, వంశీ, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి పట్టుబడిన అంబులెన్స్ డ్రైవర్

కేసు నమోదు చేసిన హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు

వరంగల్ క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : అత్యవసర సేవల కోసం రోగులను తరలించే అంబులెన్స్ డ్రైవర్ మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడటంతో పోలీసులు ఖంగు తిన్నారు. వెంటనే డ్రైవర్‌పై హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి అంబులెన్స్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే... హనుమకొండ అశోక జంక్షన్‌లో సోమవారం సాయంత్రం ట్రాఫిక్ పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తున్న సమయంలో భూపాలపల్లి సింగరేణి కాలరీ ఎకు చెందిన అంబులెన్స్‌ను ఆపి డ్రైవర్ సూరపాక ప్రశాంత్‌కు ట్రాఫిక్ ఎస్సై వసీయుద్దీన్ బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించగా మద్యం తాగినట్లుగా నిర్ధారణ జరిగింది. రోగులను అత్యవసరంగా ఆస్పత్రులకు తరలించాల్సిన డ్రైవర్ మద్యం తాగి ఉండటంతో పోలీసులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. కాగా, వెంటనే డ్రైవర్‌ను అదపులోకి తీసుకొని కేసు నమోదు చేసి అంబులెన్స్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సీఐ సీతారెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుళ్లు నవీన్, ఎజాస్, హోంగార్డు పాషా పాల్గొన్నారు.

డిప్లొమా విద్యతోనే విద్యార్థులకు భవిష్యత్

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్

హసన్‌పర్తి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు డిప్లొమా విద్యతోనే మంచి భవిష్యత్ ఉంటుందని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ అన్నారు. భీమారం ఎస్‌వీఎస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం పాలిటెక్నిక్ డిప్లొమా మొదటి సంవత్సరం విద్యార్థుల ఓరియంటేషన్ ప్రోగ్రాం ఎస్‌వీఎస్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ హాజరై మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు విద్యలో ఉన్నతంగా రాణించాలంటే క్రమశిక్షణ, పట్టుదల, లక్ష్య సాధన ముఖ్యమన్నారు. ఎస్‌వీఎస్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం అమెరికా పర్యటనలో వివిధ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకొని ఉద్యోగ అవకాశాలు అందించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్స్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు బాధ్యతగా వ్యవహరించాలి

- అవసరం లేకున్న రక్త పరీక్షలు, స్కానింగ్‌లు నిర్వహించొద్దు
- హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్



ఆస్పత్రుల నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ శివకుమార్

వరంగల్ క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ ఆస్పత్రుల యాజ మాన్యాలు రోగుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని హనుమకొండ సీఐ శివకుమార్ యాజమాన్యాలకు సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న వివిధ ఆస్పత్రుల మేనేజర్‌లు, పీఆర్‌వోలతో సోమవారం పోలీస్‌స్టేషన్ ఆవ రణలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... అవసరం లేకపోయిన రక్తపరీక్షలు, స్కానింగ్‌లు చేయించడం, ఆస్పత్రిలో పొందని సేవలకు పైసలు తీసుకొని బిల్లులు ఇవ్వడం వంటివి మానుకోవా లన్నారు. సాధారణ గదులను ఐసీయూ అని చూపించి అధిక మొత్తంలో డబ్బులు వసూళ్లు చేయడం, రోగి కుటుంబ సభ్యులకు పూర్తి సమాచారం ఇవ్వకుండా దాచిపెట్టడం వంటి ఫిర్యాదులు వస్తే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా చికి త్స తీసుకున్న సమయంలో రోగులు తప్పనిసరిగా బిల్లులు, ప్రిస్కిప్షన్‌లను అడిగి తీసుకోవాలన్నారు. ఆస్పత్రుల ఎదుట అంబులెన్స్, వాహనాలను అడ్డగోలుగా పార్కింగ్ చేస్తున్నారని, పార్కింగ్ చేయకుండా ముందుస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రుల్లో గొడవలు చోటు చేసుకుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆస్పత్రిలో సీసీ కెమెరాలు పనిచేసే విధంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ప్రధానంగా ఆస్పత్రి ఎదుట రోడ్డుకు ఇరు వైపులా కనిపించేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆసుపత్రిలో అన్యాయం జరిగినట్లయితే జిల్లా కలెక్టర్ లేదా వైద్యాధికారికి ఫిర్యాదు చేయవచ్చని రోగులకు సూచించారు.



బల్దియా కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కాలనీలో సీసీ రోడ్లు వేయాలి

సీపీఎం జిల్లా కమిటీ నాయకులు సింగారం బాబురావు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ 32వ డివిజన్ మల్లు స్వరాజ్యం కాలనీలో చాలా కాలంగా రోడ్లు, వీధి లైట్లు లేకపోవడం వల్ల అక్కడ నివసించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సింగారపు బాబురావు అన్నారు. సోమవారం సీపీఎం కరీమాబాద్ కమిటీ ఆధ్వర్యంలో మల్లు స్వరాజ్యం కాలనీ ప్రజలతో కలిసి జీడబ్ల్యూఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా పేద ప్రజల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యిందని విమర్శించారు. నిత్యం నిరుపేదలు ఉండే కాలనీలలో ఇప్పటికి రోడ్లు, వీధి లైట్లు, డ్రైనేజీలు లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు వాణి, దివ్య, జహిదా, ఇస్మాయిల్, యాకమ్మ, రతన్, రాఘవరెడ్డి, సదానందం, మురళీ, రాజ్‌కుమార్, శోభ, ప్రభాకర్, రజిత పాల్గొన్నారు.

ఎంజీఎంలో మరమ్మతులకు నిధుల మంజూరు

వరంగల్ మెడికల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రిలో పురాతన భవనాల మరమ్మతుల కోసం నిధులు విడుదలయ్యాయి. 75 సంవత్సరాల పురాతనమైన ఆస్పత్రి భవనంలో కొన్ని వార్డుల విభాగాలు పైకప్పు పెచ్చులు ఊడుతున్నాయి. మరమ్మతుల కోసం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిధులు విడుదల అయ్యాయి. పనులు ఇప్పటికే పురోగతిలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ప్రజలే గద్దర్ వారసులు

- డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్
- 6న గద్దర్ వర్ధంతి సభ

వడ్డెపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలే ప్రజా యుద్ధనౌక గద్దర్ వారసులని దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజందర్ అన్నారు. సోమవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గద్దర్ వర్ధంతి సభకు సంబంధించిన కరపత్రాలను ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6న ప్రముఖ వాగ్గేయకారుడు గద్దర్ ద్వితీయ వర్ధంతి సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కవులు, కళాకారులు, విద్యార్థులు, మేధావులు, అంబేద్కర్ వాదులు, ఉద్యమకారులు, బహుజన విప్లవ సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొని వర్ధంతి సభను విజయవంతం చేయాలని రాజేందర్ కోరారు. కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అంకేశ్వరపు రాంచందర్ రావు, కేయూ జాక్ చైర్మన్ డాక్టర్ మంద వీరస్వామి, ప్రజా సంఘాల నాయకులు మాదాసి సురేష్, కొమ్ముల కరుణాకర్, చుంచు నరేష్, కలకోటి మహేందర్, సుదర్శన్, రాజు, కిరణ్, సదానందం పాల్గొన్నారు.

పట్టణ ఆరోగ్య కేంద్రం తనిఖీ

వరంగల్ మెడికల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ న్యూశాయంపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ ఏ. అయ్యప్ప సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ప్రాంతాల్లో డ్రై డే కార్యక్రమం, ఏఎన్‌సీ నమోదు, ఎన్‌సీడీ రీ స్క్రీనింగ్, పాఠశాలలు, హాస్టళ్లలో నిర్వహిస్తున్న హెల్త్ క్యాంపులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ల్యాబ్‌ను పరిశీలించి, సిబ్బంది హాజరు పట్టికను తనిఖీచేశారు. మౌనిక, డెమో అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురికి జైలు

వరంగల్ క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 25 మందిని సోమవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ. వేణుగోపాల్ ఐదుగురికి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి తెలిపారు. మిగితా 20 మందికి రూ. 19,900 జరిమానా విధించారన్నారు. అదే విధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడిన 8 మందికి రూ. 5,500 జరిమానా విధించారన్నారు.

ఇన్‌సోమ్నియా





నిద్రలేమి వెంటాడుతోందా...

కంటినిండా నిద్ర లోపిస్తే, మరుసటి రోజంతా హుషారు తగ్గుతుంది. ఆలోచనల్లో స్పష్టత లోపిస్తుంది. రోజంతా డీలాగా గడుస్తుంది. ఇదే పరిస్థితి దీర్ఘకాలం కొనసాగితే, అంతిమంగా ఆరోగ్యం కుంటుపడుతుంది. కాబట్టి ఈ సమస్య మూలాలను వెతికి వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలంటున్నారు వైద్యులు.

కొందరికి నిద్ర పట్టడంలో ఇబ్బంది ఉంటుంది. ఇంకొందరికి పట్టిన నిద్రను కొనసాగించడంలో ఇబ్బంది ఉంటుంది. ఈ పరిస్థితి దైనందిన జీవితాన్ని ఇబ్బంది పెడుతుంటే, దాన్ని నిద్రలేమిగా భావించాలి. ఎప్పుడైనా అరుదుగా ఒకట్రెండు రోజుల పాటు ఈ సమస్య వేధిస్తే ఫరవాలేదు. కానీ వారాలు, నెలల తరబడి ఇదే పరిస్థితి కొనసాగితే పరిస్థితిని తీవ్రంగానే పరిగణించాలి. అయితే ఆత్మీయుల మరణం, తరచూ చేసే ప్రయాణాల మూలంగా నిద్రవేళలు మారడం వల్ల కొంత కాలం పాటు నిద్రలేమి వేధిస్తే, పరిస్థితులు అనుకూలించిన తర్వాత పరిస్థితి కూడా సర్దుకుంటుంది. కొందరికి స్వల్పకాలిక మాత్రలు అవసరవుతాయి. ఇలా కాకుండా వారాలు, నెలల తరబడి నిద్రలేమి వేధిస్తున్నా, దాన్ని సాధారణమైన విషయంగానే భావిస్తూ, రాత్రంతా మేలుకుంటూ ఉండిపోయే వాళ్లుంటారు. ఫలితంగా కుటుంబ అనుబంధాలు, పని నైపుణ్యాలు దెబ్బతిని అంతిమంగా వైద్యులను కలుస్తూ ఉంటారు. తీవ్రమైన నిద్రలేమి కలిగిన ఈ కోవకు చెందిన వాళ్లలో సమస్యను సరిదిద్దడం కొంత క్లిష్టం. వీళ్లలో నిద్రలేమిని ట్రిగ్గర్ చేసిన అంశాన్ని కనిపెట్టి, ఆ అంశం ఇప్పటికీ ప్రభావం కనబరుస్తూనే ఉందా? అన్నది గమనించాలి. ఉదాహరణకు కొందరు, ధూమపానం లేదా మద్యపానం అలవాటు చేసుకుంటారు. దాంతో మొదలయ్యే నిద్రలేమి, ఆ అలవాట్లతో పాటు అంతకంతకూ కొనసాగుతూనే ఉంటుంది. ఇలాంటి అంశాలను కనిపెట్టి, క్రమేపీ వాటిని దూరం చేయవలసి ఉంటుంది.

కారణాలను సరిదిద్ది...

సాధారణంగా నిద్రలేమిని ఎవరూ అంత తీవ్రంగా పరిగణించరు. కానీ ఈ సమస్యతో తీవ్రమైన పరిణామాలు ఎదురవుతాయి. చికాకు, వ్యక్తిత్వ సమస్యలు, సామర్థ్యం, జ్ఞాపకశక్తి తగ్గడం లాంటి సమస్యలు పెరుగుతాయి. నిద్రలేమితో బాధపడేవారు అతి త్వరగా అల్జీమర్స్‌కు లోనయ్యే అవకాశాలు కూడా ఎక్కువే! నిద్రలేమితో పెరిగే రక్తపోటు, అదుపు తప్పే మధుమేహం ఫలితంగా గుండెజబ్బుల బారిన పడే సమస్య కూడా పెరుగుతుంది. కాబట్టి నిద్రలేమి సమస్యను గుర్తించినప్పుడు, సరిదిద్దే వీలున్న కారణాలను కనిపెట్టే ప్రయత్నాలు మొదలుపెట్టాలి. శ్వాసనాళాన్ని ఇరుకుగా మార్చే అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా ఉంటే, ఆ సమస్యను సరిదిద్దుకోవాలి. అలాగే రక్తపరీక్షతో



శరీరంలోని పోషక లోపాలు, హార్మోన్ అవకతవకలను కనిపెట్టి, వాటిని సరిదిద్దుకోవాలి. అలాగే మానసిక సమస్యలతో నిద్రలేమికి గురవుతూ ఉంటే, మానసిక వైద్యుల సహాయంతో వాటి నుంచి బయటపడాలి. నొప్పుల వల్ల నిద్రలేమి వేధిస్తుంటే, వాటిని చికిత్సతో తగ్గించుకోవాలి. కొన్ని సందర్భాల్లో నిద్రలేమికి ఇవేమీ కారణం కాకపోవచ్చు. కొందరు నిద్రలేమికి గురయ్యే తత్వాన్ని కూడా కలిగి ఉండొచ్చు.

స్లీప్ డైరీతో...

నిద్రలేమి సమస్యను కచ్చితంగా అంచనా వేయడం కోసం, నిద్ర నాణ్యతను కనిపెట్టడం కోసం స్లీప్ డైరీ రాసుకోవాలి. ఏ సమయానికి నిద్రకు ఉపక్రమించారు? పడక మీద పడుకున్న తర్వాత ఎంత సేపటికి నిద్రలోకి జారుకుంటున్నారు? ఎన్నిసార్లు నిద్రాభంగం కలుగుతోంది? అనే వివరాలతో పాటు రోజులో తాగే కాఫీ, సిగరెట్ల వివరాలు, మద్యం వివరాలు కూడా డైరీలో రాసుకుని వైద్యులకు చూపించాలి. వీటి ఆధారంగా నిద్రలేమి తీవ్రత, కారణాలను వైద్యులు గ్రహించి నిద్రకు అడ్డుపడే అంశాలను కనిపెట్టి వాటికి దూరంగా ఉండమని సూచిస్తారు. ఆ అంశాలు ఏవంటే...

- నిద్రకు ముందు కాఫీ తాగే అలవాటు మానుకోవాలి
- మద్యం, ధూమపానాలు మానేయాలి
- వ్యాయామానికీ నిద్రకు మధ్య మూడు నుంచి నాలుగు గంటల వ్యవధి ఉండేలా చూసుకోవాలి
- నిద్రకు మూడు నుంచి నాలుగు గంటల ముందే భోజనం ముగించాలి
- నిద్రకు రెండు గంటల ముందు నుంచే మొబైల్, టివి స్ర్కీన్స్‌కు దూరం పాటించాలి
- కొన్నిసార్లు ఒక గదిలో నిద్ర పట్టకుండా, మరొక గదిలో నిద్ర పడుతూ ఉండొచ్చు. అలాంటప్పుడు నిద్ర పట్టే గదినే నిద్రకు కేటాయించాలి
- పడకను నిద్రకు తప్ప ఆఫీసు పనులకు ఉపయోగించకూడదు
- నిద్ర పట్టనప్పుడు బలవంతంగా నిద్రపోయే ప్రయత్నం చేయకుండా, హాల్‌లో కూర్చుని పుస్తకం చదవాలి
- గది ఉష్ణోగ్రత, 24 నుంచి 25 డిగ్రీల మధ్య ఉండాలి
- నిద్రవేళలు క్రమం తప్పకుండా పాటించాలి

> **ఆధునిక ఔషధాలున్నాయి**
>
> నిద్రకు తోడ్పడే మెలటోనిన్ హార్మోన్ ఆధారిత మాత్రలు ఇప్పుడు అందుబాటులోకొచ్చాయి. వీటితో పాటు అలవాటు పడే వీల్లేని, లెంబారెక్సెంట్ అనే నిద్ర మాత్రలు కూడా ఇప్పుడు దొరుకుతున్నాయి. అలాగే నిద్ర రావడం కోసం 'స్లీప్ ఆన్‌సెట్ ఇన్‌సోమ్నియా' మందులున్నాయి. పట్టిన నిద్ర కొనసాగడం కోసం 'స్లీప్ మెయింటెనెన్స్ ఇన్‌సోమ్నియా', తెల్లవారుఝామున మూడు గంటలకు మెలకువ వచ్చే వారికి 'ఎర్లీ మార్నింగ్ అవేకెనింగ్ ప్రివెన్షన్' మందులు అందుబాటులో ఉన్నాయి.

థెరపీ ప్రయోజనం

కొందర్లో చిన్ననాటి చేదు జ్ఞాపకాల వల్ల, ఆత్మీయుల మరణం వల్ల నిద్రలేమి వేధించవచ్చు. ఇలాంటి వారికి కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ ఎంతో బాగా తోడ్పడుతుంది. కౌన్సెలింగ్ ఆధారంగా సాగే ఈ థెరపీలో ప్రతికూల పరిస్థితుల వ్యవహరించే నైపుణ్యాలను నేర్పిస్తారు. గతంలో కూరుకుపోయి, దిగులు పడుతూ కూర్చోవడం వల్ల ప్రయోజనం లేదనీ, సమస్యను పరిష్కరించుకుని ముందుకు సాగాలనీ మానసిక వైద్యులు సూచిస్తారు. అలాగే జీవగడియారాన్ని గాడిలో పెట్టడం ద్వారా నిద్రలేమిని తొలగించడానికి లైట్ థెరపీని కూడా అనుసరించవచ్చు.

నిద్రమాత్రలు చివరి ప్రత్యామ్నాయం

నిద్రలేమిని పరిష్కరించే అన్ని ప్రయత్నాలు విఫలమైనప్పుడు, వైద్యులు అంతిమంగా నిద్ర మాత్రలు సూచిస్తారు. ఇలాంటి నిద్రమాత్రలను ఇష్టారాజ్యంగా కొనుక్కుని వాడుకోవడం వల్ల వాటికి అలవాటుపడే ప్రమాదం ఉంటుంది. ఒక స్థాయికి చేరుకున్న తర్వాత ఎంత మోతాదు మాత్రలు తీసుకున్నా నిద్రరాని పరిస్థితి తలెత్తుతుంది. ఈ స్థితికి చేరుకున్న వ్యక్తి నిద్రలేమి సమస్యను పరిష్కరించడం వైద్యులకు ఎంతో క్లిష్టంగా మారుతుంది. కాబట్టి ఎవరికి వారు నిద్రమాత్రలు కొనుక్కుని వాడుకోకూడదు. నిజానికి నిద్రమాత్రలతో నిద్రపోయే సమయం పెరుగుతుందే తప్ప నిద్ర నాణ్యత పెరగదు. కాబట్టి వైద్యులు సూచించే దుష్ప్రభావాలు లేని సమర్థమైన నిద్రమాత్రలనే వాడుకోవాలి.

డాక్టర్ విశ్వేశ్వరన్ బాలసుబ్రమణియన్
సీనియర్ ఇంటర్వెన్షనల్ పల్మొనాలజిస్ట్ అండ్ స్లీప్ మెడిసిన్ స్పెషలిస్ట్,
యశోద హాస్పిటల్స్, సోమాజిగూడ,
హైదరాబాద్



తల్లి పాలు బిడ్డ ఆకలి తీర్చడమే కాదు, అంతకు మించిన ప్రయోజనాలను కూడా కలిగి ఉంటాయి. బిడ్డ ఆరోగ్యానికి రక్షణ కల్పించడంతో పాటు, పోషక అవసరతలకు తగినట్టు మార్పులకు గురవుతూ ఉంటాయి. బిడ్డకు తల్లి నుంచి అందే అమూల్యమైన ఆ పాలామృతం గురించీ, వాటిని నిల్వ చేసుకునే మెలకువల గురించీ వైద్యులు ఏమంటున్నారో తెలుసుకుందాం!

తల్లి పాలామృతం

కొందరు పిల్లలు నెలలు నిండకుండా పుడతారు. ఇంకొందరు పిల్లలు నలతను వెంట తెచ్చుకుంటారు. ఈ రెండు కోవలకు చెందిన పిల్లల పోషక అవసరతలు భిన్నంగా ఉంటాయి. ఈ అవసరతలకు తగినట్టే తల్లుల్లో పాలు ఉత్పత్తి అవుతూ ఉంటాయి. ఏ ఇద్దరు తల్లుల పాలూ ఒకేలా ఉండవు. అలాగే ఒకే తల్లి పాలు కూడా ఎప్పుడూ ఒకేలా ఉండవు. బిడ్డకు ఎప్పుడు ఎలాంటి పోషకాలు అవసరమో వాటిని సమయానికి అందించేలా చనుబాలు తయారవుతూ ఉంటాయి. వినడానికి వింతగా అనిపించినా ఇదే నిజం. అలాగే పిల్లలకు పాలిచ్చే ప్రతిసారీ, వారికి పాల పట్ల ఇష్టం పెరగడం కోసం, మొదట నీరు, చక్కెర ఎక్కువగా కలిగి ఉండే తీయని పాలు, ఆ తర్వాత కొవ్వుతో కూడిన బలవర్ధకమైన పాలు రొమ్ములు నుంచి వెలువడతాయి. ఇలా తల్లిపాలు అద్భుతమైన స్వభావాలు, ప్రయోజనాలను కలిగి ఉంటాయి. కాబట్టి అమూల్యమైన తల్లిపాలను బిడ్డకు పరిపూర్ణంగా అందించడం తల్లులు బాధ్యతగా భావించాలి. మరీ ముఖ్యంగా పాలు పట్టించే విధానం, నిల్వ చేసుకునే తీరుల పట్ల అవగాహన పెంచుకోవాలి.

ఆగష్టు 1 - 7, తల్లి పాల వారోత్సవం

ఇలా సేకరించాలి

పాలు సేకరించడానికి మ్యాన్యువల్, మెషీన్ పంప్‌లు, ఎలక్ట్రిక్ పంపులు లాంటివి అందుబాటులో ఉన్నప్పటికీ, చేతులతోనే పాలను సేకరించడం అత్యుత్తమం. అలాగే పాలు సేకరించే పాత్రను సబ్బు నీళ్లతో కడిగి, కొన్ని నిమిషాల పాటు మరిగించిన నీళ్ల నింపి ఉంచి, తర్వాత వాటిని పారేసి, తడి ఆరే వరకూ పాత్రను బోర్లా ఉండి, ఆ తర్వాతే వాడుకోవాలి. పాల సేకరణకు వెడల్పాటి గిన్నె ఉపయోగించాలి. బ్రెస్ట్ మిల్క్ స్టోరేజీ బ్యాగ్స్ లేదా పాలీప్రొపిలీన్ ప్లాస్టిక్, గాజు పాత్రలు పాల నిల్వకు సురక్షితమైనవి. స్వల్ప కాలిక నిల్వ కోసం స్టీలు పాత్రలు కూడా వాడుకోవచ్చు. గది ఉష్ణోగ్రత దగ్గర 6 నుంచి 8 గంటల పాటు పాలు నిల్వ ఉంటాయి. అంతకు మించి ఎక్కువ కాలం నిల్వ చేసుకోవాలనుకుంటే అందుకోసం ఫ్రిజ్ వాడుకోవాలి.



- మైనస్ 4 డిగ్రీల ఉష్ణోగ్రత కలిగి ఉండే రెఫ్రిజిరేటర్ డోర్‌లో 72 గంటల పాటు నిల్వ చేసుకోవచ్చు
- ఫ్రీజర్ కంపార్ట్‌మెంట్‌లో నిల్వ చేసుకున్న పాలు, మరుసటి రోజుకు ఉపయోగించుకోవాలనుకుంటే రెఫ్రిజిరేటర్ డోర్‌లోకి మార్చుకోవాలి. ఆ తర్వాత అవసరమైనప్పుడు బయటకు తీసి గది ఉష్ణోగ్రతకు చేరుకున్న తర్వాత బిడ్డకు పట్టించాలి
- వృథాను అరికట్టడం కోసం 60 నుంచి 120 మిల్లీలీటర్ల స్టోరేజీ బ్యాగులనే ఎంచుకోవాలి
- తల్లి పాలను స్టవ్ మీద వేడి చేయకూడదు, మైక్రోవేవ్‌లో వేడి చేయకూడదు
- ఫ్రిజ్ నుంచి బయటకు తీసిన పాలు సహజసిద్ధంగానే ఆగాలి. లేదా గది ఉష్ణోగ్రతకు చేరుకునే వరకూ పాల సీసా, లేదా పాల బ్యాగ్‌ను ధారగా కారే నీళ్ల కింద ఉంచాలి.

> **అపోహలు - వాస్తవాలు**
>
> - రొమ్ములు చిన్నవిగా ఉంటే పాలు రావు అన్నది పూర్తిగా అపోహే! రొమ్ముల పరిమాణం దాన్లోని కొవ్వు కణజాలం మీదే ఆధారపడి ఉంటుంది. పాలకూ కొవ్వుకూ సంబంధం ఉండదు. ప్రతి రొమ్ములో పాల ఉత్పత్తి కణాలు ఒకే మోతాదులో ఉంటా యి. కాబట్టి తల్లి ఎత్తుగా ఉన్నా, కురచగా ఉన్నా, రొమ్ములు చిన్నవిగా ఉన్నా, పెద్దవిగా ఉన్నా పాల ఉత్పత్తికి ఢోకా ఉండదు.
> - రొమ్ము పాలతో రొమ్ములు సాగిపోతాయన్నది కూడా అపోహే! గర్భం, బరువు పెరగడం, వయసు.. ఇవన్నీ రొమ్ముల ఆకారం, బిగుతుల మీద ప్రభావం చూపిస్తాయి. కేవలం బ్రెస్ట్ ఫీడింగ్ వల్ల రొమ్ములు సాగిపోతాయని అనుకోవడం అపోహ. పాలిచ్చేటప్పుడు సరైన బ్రెస్ట్ సపోర్ట్ బ్రా వేసుకుంటే, రొమ్ములకు అదనపు ఆసరా దక్కుతుంది.
> - పాలు తాగించే ప్రతిసారీ చనుమొనలను కడుక్కోవలసిన అవసరం లేదు. స్నానం చేసే సమయంలో శుభ్రపరుచుకుంటే సరిపోతుంది.
> - పాలతో తల్లి తీసుకునే మందుల ప్రభావం బిడ్డకు చేరదు. కాబట్టి వైద్యులు సూచించినప్పుడు మినహా దగ్గు, జలుబు, జ్వరం లాంటి సాధారణ మందులు వేసుకున్నప్పటికీ నిశ్చింతగా బిడ్డకు పాలివ్వవచ్చు.

డాక్టర్ సింధూర మునుకుంట్ల
పిడియాట్రీషియన్,
బిపిఎన్ఐ సర్టిఫైడ్ లాక్టేషన్ స్పెషలిస్ట్,
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్,
హైదరాబాద్



తెలుసుకుందాం

మెగ్నీషియం మతలబు ఇదే

కండరాల పటుత్వాన్ని పెంచే పోషకంగా మెగ్నీషియంను పరిగణిస్తూ ఉంటాం. అయితే ఈ మూలకానికి మానసిక కుంగుబాటును దూరం చేసే ప్రభావం కూడా ఉంటుందని తాజా అధ్యయనాల్లో వెల్లడైంది.

సాధారణంగా మానసిక కుంగుబాటుకు గురైన వారు చికిత్స కోసం మానసిక వైద్యులను ఆశ్రయిస్తూ ఉంటారు. అయితే కొందరికి ఇలాంటి సంప్రదాయ చికిత్సలు ఫలితాన్ని ఇవ్వకపోవచ్చు. ఇలాంటి సందర్భాల్లో గ్లైసినేట్ లేదా థ్రియోనేట్ రూపాల్లోని మెగ్నీషియం ఎంతో అక్కరకొస్తుందని వైద్యపరమైన ప్రయోగాల్లో వెల్లడైంది. ఆందోళన, ఒత్తిడులను తగ్గించి, నిద్ర నాణ్యతను పెంచే శక్తి మెగ్నీషియంకు ఉంటుందనీ, సంప్రదాయ యాంటీడిప్రెసెంట్లు పని చేయని సందర్భాల్లో, మెగ్నీషియంను ఆశ్రయించవచ్చనీ పరిశోధకులు సూచిస్తున్నారు. మానసిక కుంగుబాటుకు మెదడులోని రసాయన మార్పులు కూడా ఒక కారణమే! ఇలాంటి సందర్భాల్లో మెదడులోని రిసెప్టార్లు ఎక్సైటోటాక్సిసిటీ అనే ప్రక్రియలో భాగంగా ప్రమాదకరమైన స్థాయిలో అతిగా స్పందిస్తూ ఉంటాయి. ఇలాంటి రోగులు మెగ్నీషియం తీసుకున్నప్పుడు, అది నాడీకణాలకు రక్షణ కవచంగా మారి రసాయన ప్రభావాలను అడ్డుకుని నాడీ కణాలు అతిగా స్పందించే ప్రక్రియ నెమ్మదిస్తుంది. అయితే మన శరీరాల్లో సహజసిద్ధంగా మెగ్నీషియం ఉంటున్నప్పుడు, ఇలాంటి పరిస్థితి ఎందుకు తలెత్తుతోంది? అనే అనుమానం రావచ్చు. నిజానికి మన ఆధునిక ఆహారపుటలవాట్లే మెగ్నీషియం లోపానికి ప్రధాన కారణమని వైద్యులంటున్నారు. ప్రాసెస్ చేసిన పదార్థాలు, ఫిల్టర్ చేసిన నీళ్ల మనలో మెగ్నీషియం లోపానికి దోహద పడుతున్నాయి. ఫలితంగా మెదడు ప్రభావితమవుతూ మానసిక కుంగుబాటు, నాడీకణాల క్షీణత లాంటి రుగ్మతలు పెరుగుతున్నాయి. కాబట్టి సమతులాహారం ద్వారా ఈ పోషక లోపాన్ని నివారించుకుని, మానసిక కుంగుబాటుకు అడ్డుకట్ట వేయవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.



కాలుష్యంతో క్యాన్సర్

ధూమపానానికీ ఊపిరితిత్తుల క్యాన్సర్‌కూ దగ్గరి సంబంధం ఉందని మనందరికీ తెలుసు. అయితే ఆ అలవాటు లేనివాళ్లకు కూడా ఊపిరితిత్తుల క్యాన్సర్ సోకుతున్న సంఘటనలు తాజాగా వెలుగులోకొస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే...

బెంగుళూరుకు చెందిన మారథాన్ ఔత్సాహికవేత్త, ఐటి ఉద్యోగి, 34 ఏళ్ల ప్రియకు ధూమపానం అలవాటు లేదు. క్రమం తప్పక వ్యాయాం చేస్తుంది. అలా అన్ని విధాలా ఆరోగ్యంగా ఉన్న ప్రియను దగ్గు, అలసట వేధించడం మొదలుపెట్టాయి. మొదట్లో వాతావరణ మార్పుల ప్రభావమని సరిపెట్టుకున్న ప్రియ, శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారడంతో వైద్యులను కలిసింది. ఎక్స్‌రే, సిటి స్కాన్‌లో ఆమె కుడి ఊపిరితిత్తిలో కనిపించిన కణితి, మూడో దశ నాన్ స్మాల్ సెల్ లంగ్ క్యాన్సర్‌గా నిర్ధారణ అయింది. హర్యాణా, పానిపట్‌కు చెందిన 43 ఏళ్ల పూనమ్ శర్మ, స్కూల్ టీచర్. దగ్గుతో పాటు రక్తం పడుతూ ఉండడంతో వైద్యులను కలిసిందామె. పరీక్షల్లో ఆమెకు కూడా ఊపిరితిత్తుల క్యాన్సర్ సోకినట్టు నిర్ధారణ అయింది. ధూమపానం ఎరుగని పూనమ్, ప్రియలు ఇద్దరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని గడపడంతో పాటు ఇంటి భోజనానికే పరిమితమయ్యే మహిళలు. అయినప్పటికీ వీళ్లిద్దరికీ లంగ్ క్యాన్సర్ సోకింది. నిజానికి ఇలాంటి సందర్భాలు ఇటీవలి కాలంలో పెరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో ధూమపానం ఎరుగని మహిళల్లో ఊపిరితిత్తుల క్యాన్సర్ 15 నుంచి 20 శాతం పెరిగినట్టు ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ చేపట్టిన అధ్యయనాల్లో వెల్లడైంది.



కాలుష్యమే కారణం

పట్టణ వాయు కాలుష్యంలో వాహనాలు, పరిశ్రమల నుంచి వెలువడే సూక్ష్మ అణువులు, క్యాన్సర్ కారకాలను కలిగి ఉంటాయి. అతి సూక్ష్మ శ్వాస నాళికల్లోకి చేరుకునే ఈ క్యాన్సర్ కారకాలు క్రమేపీ ఊపిరితిత్తులను దెబ్బతీస్తాయి. మరీ ముఖ్యంగా బయోమాస్ ఫ్యూయల్ స్మోక్, గృహ రసాయనాలు, రాడాన్ లేదా పొగాకు లాంటి కలుషితాలు కూడా ఈ సమస్యను తీవ్రతరం చేస్తాయని బెంగుళూరులోని గ్లెనిగేల్స్ హాస్పిటల్ మెడికల్ ఆంకాలజిస్ట్, డాక్టర్ రాజీవ్ విజయకుమార్ అంటున్నారు. ఇళ్లలో వంటకు ఉపయోగించే సంప్రదాయ ఇంధనం గత దశాబ్దకాలంలో ఎన్నో మార్పులకు లోనైందనీ, ఇది కూడా క్యాన్సర్ పెరుగుదలకు దోహదపడిందనీ, దీర్ఘకాలిక పర్యావరణ కాలుష్యం కూడా ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను ప్రేరేపిస్తోందనీ అంటున్నారాయన. అయితే కొందరు మహిళల్లో జన్యు ఉత్పరివర్తన వల్ల కణ పెరుగుదల నియంత్రణ కోల్పోతుందనీ, ఈ పరిస్థితి ధూమపానం అలవాటు లేని ఆసియా వాసుల్లో కనిపిస్తూ ఉంటుందనీ ఈ మార్పు ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు దారి తీస్తోందనీ ఇంకొందరు వైద్యులు అంటున్నారు.

ఎలాంటి చికిత్స?

ధూమపానంతో సంబంధం లేని ఊపిరితిత్తుల క్యాన్సర్, టార్గెటెడ్ థెరపీకి భిన్నంగా, మెరుగ్గా స్పందిస్తుంది. క్యాన్సర్ పెరుగుదలను ప్రేరేపించే ఉత్పరివర్తన ప్రొటీన్ ప్రభావాన్ని అడ్డుకునే నోటి మాత్రలు మెరుగైన ఫలితాన్ని అందిస్తాయని వైద్యులు వివరిస్తున్నారు. సంప్రదాయ కీమోథెరపీకి భిన్నమైన టార్గెటెడ్ చికిత్స, తక్కువ దుష్ప్రభావాలను కలిగి ఉండడమే కాకుండా, అంతకు మించిన ప్రభావాన్ని కనబరుస్తుందని కూడా వైద్యులు భరోసా ఇస్తున్నారు. అయితే ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను ఎంత త్వరగా గుర్తించి, చికిత్స మొదలుపెడితే ఫలితం అంత మెరుగ్గా ఉంటుంది కాబట్టి ఎంతకూ తగ్గని దగ్గు, ఛాతీ బిగదీయడం, వెన్ను నొప్పి, శ్వాసలో ఇబ్బంది, అకారణంగా బరువు తగ్గడం లాంటి లక్షణాలు కనిపించినప్పుడు ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రతించడం అవసరమని వైద్యులు సూచిస్తున్నారు.

ఆవిష్కరణ

అల్జీమర్స్‌కు టీకా మందు



పైబడే వయసులో వేధించే ఆరోగ్య సమస్య అల్జీమర్స్ ఇప్పటివరకూ ఈ రుగ్మతకు అడ్డుకట్ట వేసే చికిత్సలు రూపొందలేదు. అయితే తాజాగా అల్జీమర్స్‌ను అడ్డుకునే ఒక టీకాను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఆ వివరాలు...

మతిమరుపు, నాడీకణాల క్షీణతతో సంబంధమున్న 'టౌ' అనే విషపూరిత ప్రొటీన్ లక్ష్యంగా పని చేసే ఒక టీకాను న్యూ మెక్సికోలోని శాస్త్రవేత్తలు తాజాగా అభివృద్ధి చేశారు. ఇప్పటివరకూ అల్జీమర్స్‌కు కేవలం లక్షణాలను నియంత్రించే చికిత్స మాత్రమే కొనసాగుతూ ఉంది. దీనికి భిన్నంగా, తాజాగా అభివృద్ధి చేసిన టీకా, శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ, టౌ ప్రొటీన్‌ను గుర్తించి, దాన్ని హతం చేసేలా రోగనిరోధక వ్యవస్థకు శిక్షణనిస్తుంది. ఈ దిశగా ఎలుకల మీద చేపట్టిన ప్రయోగాల్లో, టీకా అందించిన ఎలుకల్లో టౌ ప్రొటీన్ ఉత్పత్తి క్షీణించినట్టు, ఫలితంగా అల్జీమర్స్ వ్యాధి ఉధృతి కూడా గణనీయంగా కుంటుపడినట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ ఫలితాల ఆధారంగా ప్రస్తుతం ఇవే ప్రయోగాలను మనుషుల మీద చేపట్టే ప్రయత్నాల్లో ఉన్న శాస్త్రవేత్తలు, ఈ ప్రయోగాలు విజయవంతమైతే, ఈ టీకా అతి త్వరలో అందరికీ అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



ఇందిరాపార్కు వద్ద చేపట్టిన నిరసన దీక్షలో నినాదాలు చేస్తున్న కవిత

ఇది రాజకీయం కాదు.. బీసీల ఆత్మగౌరవ పోరాటం!

- కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలి
- బీసీలకు 42% రిజర్వేషన్లకై ఢిల్లీలో దీక్ష చేస్తాం: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్/కవాడిగూడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి డిక్లరేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. 'నేను చేస్తున్నది రాజకీయ పోరాటం కాదు. బీసీల ఆత్మగౌరవ పోరాటం. గాంధీజీ సూచించిన అహింసా మార్గంలోనే బీసీల 42 శాతం రిజర్వేషన్లను సాధిస్తాం' అని ఆమె చెప్పారు. బీసీ రిజర్వేషన్ల సాధనకు అవసరమైతే ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దీక్షకు దిగుతామని హెచ్చరించారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద తెలంగాణ జాగృతి, యునైటెడ్ ఫూలే ఫ్రంట్ సంయుక్త ఆధ్వర్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం 72 గంటల నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల కోసం తెలంగాణ జాగృతి అనేక పోరాటాలు చేస్తోందన్నారు. తమ పోరాటాలతోనే బీసీ రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లకు ప్రత్యేక బిల్లు పెట్టడంపై కాంగ్రెస్ సర్కారు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల సాధనకై రాష్ట్రంలోని బీసీలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. బీసీలకు అన్ని హక్కులు వచ్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కవిత డిమాండ్ చేశారు. ఓ వైపు రిజర్వేషన్లు రాష్ట్రానికి సంబంధించిన వ్యవహారమని బీజేపీ చెబుతోందని.. మరోవైపు కేంద్రంపై నెపాన్ని నెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు దులుపుకోవాలని చూస్తోందని ఆమె ఆరోపించారు. ఢిల్లీలో కాంగ్రెస్ నేతలు టైంపాస్ ధర్నాలు చేస్తే బీసీ బిడ్డలు ఊరుకోరన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా ఎన్నికలకు వెళితే వాటిని ఎలా ఆపాలో తమకు తెలుసని చెప్పారు. కాళేశ్వరం నివేదికపైనా కవిత స్పందించారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదికలో కేసీఆర్ పేరును 35 సార్లు ప్రస్తావించినంత మాత్రాన ఏమీ కాదని, ప్రజల దృష్టిని మళ్లించే రాజకీయాల్లో భాగంగానే ఆ నివేదికను బయట పెట్టారని ఆరోపించారు. కేసీఆర్ అరెస్టుపై మీడియా లీకులను తాము పట్టించుకోబోమన్నారు. అనంతరం కవిత నిరాహార దీక్షకు మద్దతు తెలుపుతూ ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ నేత అర్జున్‌సింగ్ చౌతాలా మాట్లాడారు. కవిత పోరాటంలో తాము భాగస్వాములం అవుతామని, ఢిల్లీలోనూ అండగా ఉంటామని స్పష్టం చేశారు. కాగా, ఎమ్మెల్సీ కవిత సోమవారం చేపట్టిన నిరాహారదీక్షకు 72 గంటలపాటు అనుమతి ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది. ధర్నా చౌక్‌లో కవిత చేపట్టిన దీక్షకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకే పోలీసులు అనుమతి ఇచ్చారు. ఈ సమయాన్ని 72 గంటల వరకు పొడిగించాలని కోరుతూ తెలంగాణ జాగృతి తరఫున పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం.. గడువును పొడిగించేందుకు నిరాకరించింది. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులకు సూచిస్తూ.. తదుపరి విచారణను వచ్చేవారానికి వాయిదా వేసింది. ధర్నా వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయరాదన్న పోలీసుల షరతును మాత్రం హైకోర్టు కొట్టేసింది. 72 గంటల దీక్షకు కోర్టు అనుమతి నిరాకరించడంతో కవిత తన దీక్షను విరమిస్తున్నట్టు ప్రకటించారు. కోర్టులపట్ల తనకు గౌరవం ఉందని, అందుకే దీక్షను విరమించినట్లు ఆమె చెప్పారు. అంతకుముందు పెద్దఎత్తున పోలీసుల బలగాలను మోహరించడంతో ధర్నా చౌక్ వద్ద కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

బీసీ రిజర్వేషన్లపై ఢిల్లీలో ఉద్యమబాట!

నేడు దేశ రాజధానికి సీఎం రేవంత్, మంత్రులు, ప్రజాప్రతినిధులు.. రేపు ధర్నా

న్యూఢిల్లీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ బాట పట్టింది. దేశ రాజధానిలో ఉద్యమానికి సిద్ధమైంది. టీపీసీసీ ఇప్పటికే మూడు రోజుల కార్యాచరణ ప్రకటించింది. మంగళవారం పార్లమెంట్‌లో వాయిదా తీర్మానం ఇవ్వాలని, 6న జంతర్ మంతర్‌లో మహా ధర్నా నిర్వహించాలని, 7న రాష్ట్రపతిని కలిసి విన్నవించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా సోమవారం 1,400 మందితో హైదరాబాద్ నుంచి ఢిల్లీకి ప్రత్యేక రైలు బయలుదేరింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం రాత్రికి ఢిల్లీ చేరుకోనున్నారు. ఆయనతోపాటు టీపీసీసీ చీఫ్, మంత్రులందరూ రానున్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, టీపీసీసీ, డీసీసీ బాధ్యులు, వివిధ సంఘాల నేతలు అందరూ ఢిల్లీకి రావాలని పార్టీ ఆదేశించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలపడంతో తీర్మానాన్ని రాష్ట్రపతికి పంపారు. ఈ నేపథ్యంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో నేతలు వెళ్లి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి బీసీ రిజర్వేషన్ల అంశంపై చర్చించాలని టీపీసీసీ భావిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబరు నెలాఖరులోపు నిర్వహించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించగా.. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని రేవంత్ సర్కారు ప్రకటించింది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, రిజర్వేషన్లు సాధించుకోవాలని సీఎం రేవంత్ కృతనిశ్చయంతో ఉన్నారు. ఆ మేరకు రాహుల్ నేతృత్వంలో ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. ఓబీసీ ధర్నాకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ సహా వంద మంది కాంగ్రెస్ ఎంపీలతో పాటు ఇతర పార్టీల నేతలు హాజరు కానున్నారు.



చర్లపల్లి నుంచి ప్రత్యేక రైలులో ఢిల్లీ బయలుదేరుతున్న కాంగ్రెస్ శ్రేణులు

వాయిదా తీర్మానం ఇచ్చాం: మల్లు రవి

తెలంగాణలో బీసీలకు రిజర్వేషన్లు 29 నుంచి 42 శాతానికి పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధంగా అన్ని చర్యలు తీసుకుందని, ఇక రాష్ట్రపతి ఆమోదమే ఆలస్యమని కాంగ్రెస్ ఎంపీల ఫోరం రాష్ట్ర కన్వీనర్ మల్లు రవి తెలిపారు. సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీలకు న్యాయం చేయడంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని చెప్పారు. "42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం లోక్‌సభలో వాయిదా తీర్మానం ఇచ్చాం. కానీ, సభ వాయిదా పడడంతో ప్రస్తావనకు రాలేదు. మంగళవారం తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలంతా కలిసి మరోసారి వాయిదా తీర్మానం ఇస్తాం. 6న సీఎం, మంత్రులు, నేతలంతా కలిసి జంతర్‌మంతర్‌లో ధర్నా చేస్తాం. ఈ ధర్నాకు పోలీసులు అనుమతి ఇచ్చారు. ధర్నాకు ఖర్గే, రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్ సహా వంద మంది కాంగ్రెస్ ఎంపీలతో పాటు ఇతర పార్టీల నేతలు కూడా హాజరవుతారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి 42 శాతం రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలైన గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లలో ముస్లింల్లో వెనకబడిన వర్గాల వారికి రిజర్వేషన్లు మాత్రం వ్యతిరేకించడం లేదు. మేం తప్పకుండా బీసీ రిజర్వేషన్లు సాధించి తీరతాం" అని మల్లు రవి చెపాపరు. కాగా, ప్రధాని మోదీ నేతృత్వంలోనే ఓబీసీ రిజర్వేషన్లు సాధించి తీరతామని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. సోమవారం ఢిల్లీలో అఖిల భారత ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఆరు దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో వివక్షకు గురైన ఓబీసీలకు బీజేపీ న్యాయం చేస్తోందన్నారు. ప్రధానిగా, రాష్ట్రపతిగా ఓబీసీలకు సముచిత స్థానం కల్పించిన ఘనత బీజేపీదేనని చెప్పారు.

బీసీ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే వరకు పోరాడుతాం

(మొదటిపేజీ తరువాయి)

వాకిటి శ్రీహరి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, బీసీ నాయకులతో కలిసి ఆమె ఢిల్లీ బయలుదేరారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత పార్లమెంటు వర్షాకాల సమావేశాలను పురస్కరించుకుని ఈనెల 6న ఢిల్లీలో చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. బీసీల ఆత్మగౌరవం, రాజకీయ అవకాశాల్లో బీసీలకు న్యాయమైన వాటా కోసం కాంగ్రెస్ చేస్తున్న ఈ పోరాటానికి అన్ని వర్గాల ప్రజలు మద్దతివ్వాలని కోరారు. కాగా ముస్లింల పేరుతో బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై బీజేపీ మోకాలడ్డుతోందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. రైలులో వెళ్తూ ఆలేరులో ఆయన మీడియాతో మాట్లాడారు. 6న జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపడతామని, 7న రాష్ట్రపతిని కలుస్తామని తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించారని, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌లోనూ ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించగా లేనిది తెలంగాణలో ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. ముస్లింలకు బీసీ రిజర్వేషన్లు కల్పించాల్సి వస్తుందన్న నెపంతో బీజేపీ నేతలు అడ్డుకుంటున్నారని, ఈ బిల్లు అమలుకు కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించని పక్షంలో సహకరిస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వ్యాఖ్యానిస్తున్నారని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఒకలా, తెలంగాణలో మరోలా ఆలోచిస్తున్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీల హక్కులను కాలరాసేలా వ్యవహరిస్తోందని విమర్శించారు. మహేశ్‌కుమార్ వెంట మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఉన్నారు. ఈ రైల్లో జిల్లాకు పాతిక మంది చొప్పున కాంగ్రెస్ పార్టీ బీసీ నేతలు, బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ తదితర బీసీ నాయకులు.. మొత్తం వెయ్యికి మందికిపైగా నాయకులు బయలుదేరారు. మీనాక్షి నటరాజన్.. నాగ్‌పూర్ వరకు, మహేశ్ కుమార్‌గౌడ్, పొన్నం, వాకిటి శ్రీహరి.. ఆలేరు వరకు ప్రయాణం చేశారు. మంగళవారం సాయంత్రానికి ఈ రైలు ఢిల్లీకి చేరుకుంటుంది.

అడ్డుకునేందుకు కిషన్‌రెడ్డి యత్నం...

అసెంబ్లీలో బీసీ బిల్లులకు మద్దతు ఇచ్చిన బీజేపీ ప్రజా ప్రతినిధులు.. ఎందుకు యూటర్న్ తీసుకున్నారని మహేశ్ కుమార్‌గౌడ్ ప్రశ్నించారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బీసీ బిల్లులపై విషం కక్కుతుంటే ఆ పార్టీ బీసీ నేతలు ఎందుకు నోరు మెదపట్లేదని నిలదీశారు. మైనార్టీల పేరు చెప్పి బీసీ బిల్లులను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్న కిషన్‌రెడ్డి.. బీసీల ఓట్లు లేకుండా మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయగలరా అన్నారు. బీసీ ఉద్యమానికి ఎవరు మద్దతిచ్చినా స్వాగతిస్తామన్నారు. బీసీ ఉద్యమంలో కవిత పాత్ర ఏముందని నిలదీశారు. జనహిత పాదయాత్రను విడతలవారీగా నిర్వహిస్తామని చెప్పారు.

ఎప్పుడైనా.. ఎవరినైనా.. అరెస్టు చేయవచ్చు!

(మొదటిపేజీ తరువాయి)

కీలక సమావేశం నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు దాదాపు ఆరున్నర గంటల పాటు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. కాళేశ్వరం కమిషన్ రిపోర్టులో ఏముంటుందనేది ముందుగా ఊహించిందేనని, అది కాళేశ్వరం కమిషన్ కాదని, కాంగ్రెస్ కమిషన్ అని కేసీఆర్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించినట్లు తెలిసింది. "మనల్ని టార్గెట్ చేసినట్లుగా అర్థం అవుతోంది. కాళేశ్వరం కమిషన్ రిపోర్టు, ఈ-కార్ రేసింగ్, ఫోన్ ట్యాపింగ్ విషయాల్లో ఎప్పుడైనా కొందరిని అరెస్ట్ చేసే అవకాశం ఉంది" అని కేసీఆర్ అన్నట్లు సమాచారం. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టు ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని, దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని బీఆర్ఎస్ శ్రేణులకు కేసీఆర్ పిలుపునిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రయోజనాలను ప్రజలకు వివరించేలా మంగళవారం తెలంగాణ భవన్‌లో పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వాల్సిందిగా మాజీ మంత్రి హరీశ్‌రావును కేసీఆర్ ఆదేశించారు. ఈ ప్రెజెంటేషన్‌ను అన్ని నియోజకవర్గాల్లో బహిరంగంగా ప్రదర్శించాలని పార్టీ ఆదేశించింది. మరోవైపు ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో చండీయాగం చేయడం లేదని కేసీఆర్ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. కాళేశ్వరంపై కక్షగట్టి దాన్ని విఫలంగా చూపే ప్రయత్నం చేస్తున్నారని సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. కమిషన్ ఇచ్చిన నివేదిక ఫైనల్ కాదని దానిపై కోర్టుకు వెళ్లొచ్చని చెప్పారు. కాళేశ్వరం ఎత్తిపోతలలో మేడిగడ్డలో కుంగింది మూడు పిల్లర్లయితే.. మూడు బ్యారేజీలు కూలిపోయాయని ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు.

ఢిల్లీలో దీక్ష చేయడానికి కవితకు ఎందుకు భయం? : ఆది శ్రీనివాస్

హైదరాబాద్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బీసీ బిల్లులపై ఢిల్లీలో దీక్ష చేయడానికి కవిత ఎందుకు భయపడుతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. బీజేపీకి లాభం చేయడానికే కవిత.. ఢిల్లీలో కాకుండా ఇందిరా పార్కు వద్ద దీక్ష చేస్తున్నారన్నారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ధర్నా చేయడానికి తాము ఢిల్లీకి వెళ్తుంటే.. దీక్ష పేరుతో ఇక్కడ ఆమె కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. బీసీల పట్ల కవితకు చిత్తశుద్ధి ఉంటే తన తండ్రి కేసీఆర్‌తో కలిసి ఢిల్లీలో దీక్ష చేపట్టాలని హితవు పలికారు. కవిత చేపట్టిన దీక్షకు బీఆర్ఎస్ పార్టీ మద్దతుందా అని ప్రశ్నించారు. దీక్షకు ముందు కవిత కేసీఆర్ ఆశీర్వాదం ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు.

అనర్హతపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదు

ఎమ్మెల్యేల అనర్హతపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కులేదని, వారి వల్ల అసెంబ్లీలోని గాంధీ విగ్రహం అపవిత్రమైందని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, మధుసూదన్‌రెడ్డి అన్నారు. గతంలో టీడీపీ, కాంగ్రెస్ టికెట్లపై గెలిచి బీఆర్ఎస్‌లోకి ఫిరాయించిన తలసాని శ్రీనివాస్ యాదవ్, సుధీర్‌రెడ్డి వంటి వాళ్లు అసెంబ్లీలోని గాంధీ విగ్రహం వద్ద ధర్నాలో పాల్గొనడం పరాకాష్ట అన్నారు. పదేళ్ల రాజ్యాంగాన్ని అపహాస్యం చేసి ఇప్పుడు ధర్నాలు చేస్తారా అని నిలదీశారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అప్పటి స్పీకర్‌లు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. పార్టీలను విలీనం చేసుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారన్నారు.

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★



'భగవంత్ కేసరి' చిత్రానికి జాతీయ అవార్డ్ లభించిన సందర్భంగా శ్రీలీలకు కేక్ తినిపిస్తున్న బాలకృష్ణ

ఫన్ డ్రామా



వినయ్ రత్నం దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'శ్రీ చిదంబరం'. చింతా వరలక్ష్మి సమర్పణలో చింతా వినీషా రెడ్డి, చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మిస్తున్నారు. వంశీ తుమ్మల, సంధ్య వశిష్ట హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రం టైటిల్ గ్లింప్స్‌ను హీరో కార్తికేయ విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో ఫన్ డ్రామాగా సినిమా ఉంటుంది. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు పూర్తి సంతృప్తినిచ్చే సినిమా ఇది' అని చెప్పారు.

'సైమన్' హీరో లాంటివాడు

- అక్కినేని నాగార్జున



'ఈ సినిమాలో నేను చేసిన పాత్ర పేరు సైమన్. దాదాపు హీరోలాంటిదీ క్యారెక్టర్. మొదటిసారి విలన్‌గా నటించడం అద్భుతమైన అనుభవం. దర్శకుడు లోకేశ్ తెరపై హీరో, విలన్‌ని సమానంగా చూపిస్తాడు. రజనీకాంత్‌తో కలసి పనిచేయడం మరువలేని జ్ఞాపకం' అని అన్నారు హీరో అక్కినేని నాగార్జున. రజనీకాంత్ కథానాయకుడిగా లోకేశ్ కనగరాజ్ తెరకెక్కించిన చిత్రం 'కూలీ'. సన్ పిక్చర్స్ బేనర్‌పై కళానిధి మారన్ నిర్మించారు. ఈ సినిమాలో నాగార్జున కీలకపాత్రలో నటించారు. ఈనెల 14న సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్, ప్రెస్‌మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో నాగార్జున మాట్లాడుతూ 'నాకు కొత్తదనం ఇష్టం. సెట్‌కు వెళ్లాక బోర్ కొట్టకూడదంటే భిన్నమైన పాత్రలు చేయాలి. నా కెరీర్‌లో మొదటిసారి లోకేశ్ కథ చెబుతుంటే రికార్డు చేసుకున్నా.. ఇంటికి వెళ్లాక మళ్లీ మళ్లీ విన్నా. నాకు అనిపించిన కొన్ని మార్పులు సూచించా. నేను చెప్పిన విషయాలు పరిగణనలోకి తీసుకొని 'సైమన్' పాత్రను తీర్చిదిద్దిన విధానం నాకు నచ్చింది' అని అన్నారు. నిర్మాత సురేశ్ బాబు మాట్లాడుతూ 'బ్యాడ్ బాయ్ క్యారెక్టర్‌లో నాగార్జునని చూడటం చాలా ఆసక్తికరంగా అనిపిస్తోంది' అని అన్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ 'నాగార్జున', 'అన్నమయ్య'తో ఒక కొత్త ట్రెండ్ ఎలా సెట్ చేశారో.. ఇప్పుడు 'కూలీ' సినిమాలో నెగెటివ్ రోల్‌లో అలాంటి కొత్త ట్రెండ్ చేయబోతున్నారు' అని అన్నారు. కాగా, ఈ సినిమాను తెలుగు రాష్ట్రాల్లో డి.సురేశ్ బాబు, దిల్‌రాజు, సునీల్ నారంగ్, భరత్ నారంగ్ యాజమాన్యంలోని ఏషియన్ మల్టీప్లెక్స్ సంస్థ విడుదల చేస్తోంది.

నాగార్జున ఇంకా యువకుడే

- రజనీకాంత్



హైదరాబాద్‌లో నిర్వహించిన 'కూలీ' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ప్రత్యేక వీడియో ద్వారా రజనీకాంత్ తెలుగు ప్రేక్షకులను పలకరించారు. 'నేను ఇండస్ట్రీకి వచ్చి 50 ఏళ్లు అవుతోంది. 'కూలీ' నా డైమండ్ జూబ్లీ పిక్చర్. నాగార్జున ఇందులో విలన్‌గా చేస్తున్నారు. దర్శకుడు లోకేశ్ సైమన్ పాత్రకు నాగార్జున పేరు చెప్పగానే షాక్ అయ్యాను. ఆ తర్వాత ఆయన ఒప్పుకొన్నారని తెలిసి సంతోషం కలిగింది. మేమిద్దరం 33 ఏళ్ల కిందట ఒక సినిమా చేశాం. అప్పుడు ఎలా ఉన్నారో, ఇప్పుడూ అలాగే ఉన్నారు. నాకు జుట్టు కూడా ఊడిపోయింది. ఆయన ఇంకా యువకుడిగానే కనిపిస్తున్నారు. సైమన్ పాత్రలో ఆయన నటన చూస్తుంటే నాకే ఆశ్చర్యం వేసింది. సినిమా గొప్పగా ఆడాలని, మీరందరూ ఆదరించాలని కోరుకుంటున్నాను' అని రజనీకాంత్ అన్నారు.





నాకు ప్రత్యేకమైన చిత్రం

- బ్రహ్మానందం

నరేశ్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తోన్న సినిమా 'గుర్రం పాపిరెడ్డి'. తమిళ హాస్యనటుడు యోగిబాబు కీలకపాత్రలో నటించారు. మురళీ మనోహర్ దర్శకత్వంలో వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్(బాబి) నిర్మిస్తున్నారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సినిమా టీజర్‌ను మేకర్స్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా హాస్య నటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ 'ఇది నాకు ప్రత్యేకమైన చిత్రమవుతుంది. ఇందులో జడ్జి పాత్రలో నటించాను. మంచి కామెడీతో సాగే థ్రిల్లర్ మూవీ ఇది. కొత్త వాళ్లు ఇండస్ట్రీకి రావాలి. అప్పుడే మన సినిమా అభివృద్ధి చెందుతుంది' అని అన్నారు. యోగిబాబు మాట్లాడుతూ 'ఈ సినిమా ద్వారా నేరుగా తెలుగు ప్రేక్షకుల ముందుకు రావడం సంతోషంగా ఉంది' అని అన్నారు. హీరో నరేశ్ అగస్త్య మాట్లాడుతూ 'సినిమాలో నేనే హీరో అంటున్నారు. కానీ ఇందులో నటించిన ప్రతీ పాత్రకూ ప్రాధాన్యం ఉంటుంది' అని అన్నారు. మురళీ మనోహర్ మాట్లాడుతూ 'బ్రహ్మానందం క్యారెక్టర్ ద్వారానే కథ నెరేట్ అవుతుంది. ఆయన ద్వారానే పాత్రలన్నీ పరిచయం అవుతాయి' అని చెప్పారు. నిర్మాతలు జయకాంత్, అమర్ బురా మాట్లాడుతూ 'ఈ సినిమా నరేశ్ అగస్త్యకు టర్నింగ్ పాయింట్ అవుతుంది' అని అన్నారు.

యూనియన్‌తో పనిలేదు.. నైపుణ్యం ఉంటే చాలు

- ఫిల్మ్ ఛాంబర్ కీలక నిర్ణయం

తెలుగు చలనచిత్ర పరిశ్రమ

వేతనాలు పెంచాలంటూ సినీ కార్మికులు చేస్తున్న సమ్మె వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సినీ కార్మికుల సమ్మె డిమాండ్లకు ఏ మాత్రం తలొగ్గకూడదని నిర్మాతలంతా ఏకాభిప్రాయంతో ఓ గట్టి నిర్ణయం తీసుకున్నారు. ఇకపై యూనియన్ సభ్యులతో సంబంధం లేకుండా ప్రతిభ ఉన్న వారికి అవకాశం ఇవ్వాలని ఏకగ్రీవంగా నిర్ణయించుకున్నారు. రేపోమాపో తమ డిమాండ్లకు నిర్మాతలు అంగీకరించి తమ దారికి రాక తప్పదని ధీమాతో ఉన్న ఫెడరేషన్‌కు ఈ నిర్ణయం ఊహించని షాక్‌లాంటిది. తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ గిల్డ్ ఓ అడుగు ముందుకు వేసి అనుభవం, ప్రతిభ కలిగిన వారికి మంచి అవకాశాలు కల్పిస్తామంటూ.. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆహ్వానిస్తూ ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రకటనకు అధికారిక వెబ్‌సైటును, మెయిల్ ఐడీని జతచేసింది.

మోయలేని భారం... అందుకే ఈ నిర్ణయం

ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సభ్యులు సోమవారం నుంచి సమ్మె చేపట్టిన సంగతి తెలిసిందే. వర్కర్లకు 30శాతం వేతనం పెంచిన నిర్మాతల సినిమాలకు పనిచేసి, ఇవ్వని వారి సినిమాల షూటింగ్స్‌కు వెళ్లకూడదని వారు నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఫిల్మ్ ఛాంబర్ సోమవారం ఓ సంచలన నిర్ణయం తీసుకుంది. 'తెలుగు చిత్రపరిశ్రమ ఇప్పటికే చాలా ఇబ్బందికర పరిస్థితుల్లో ఉంది. ఇలాంటి సమయంలో వేతనాలు పెంచాలనడం, కార్మిక శాఖ కమిషనర్ మార్గదర్శకత్వంలో సామరస్యపూర్వక పరిష్కారం కోసం చర్చలు జరుగుతున్న సందర్భంలో ఫిల్మ్ ఫెడరేషన్ ఈ నిర్ణయం తీసుకోవడం సమంజసం కాదు. లేబర్ కమిషనర్ మాటను ధిక్కరిస్తూ, ఈ రోజు (సోమవారం) నుంచి 30శాతం వేతనం పెంపు ఇస్తామన్న ప్రొడ్యూసర్ నుంచి ఒప్పంద పత్రం తీసుకుని, సంబంధిత పత్రాన్ని ఫెడరేషన్ ద్వారా యూనియన్లకు తెలియజేశాకే విధులకు వెళ్లాలని వారు నిర్ణయించడం బాధాకరం. ఇది నిజాయితీతో కూడిన చర్చల స్ఫూర్తిని దెబ్బతీస్తుంది. వేతనాలు పెంపుదల చిన్న నిర్మాతలకు ఆమోదయోగ్యం కాదు. దానిని వారు భరించే స్థాయిలో లేరు. అందుకే ఈ వేతనాల పెంపును నిర్మాతలందరూ ఏకగ్రీవంగా వ్యతిరేకించారు. కనీస వేతనాల చట్టం ప్రకారం ఏ కార్మికుడినైనా నియమించుకునే హక్కు నిర్మాతలకు ఉందని కార్మిక శాఖ కమిషనర్ స్పష్టం చేశారు. అదనంగా, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కూడా నిర్మాతల స్వయంప్రతిపత్తిని సమర్థిస్తూ ఒక ఉత్తర్వును జారీ చేసింది. ఫెడరేషన్ల ఒత్తిడి, పోటీని నిరోధించే పద్ధతులను ఖండిస్తూ, అలాంటి నిబంధనలను అమలు చేయకుండా నిరోధించింది. అన్ని యూనియన్ల వారికి ఇతర రాష్ట్రాల్లో కంటే మనమే ఎక్కువ వేతనాలు చెల్లిస్తున్నామనేది గమనించాలి. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఫిల్మ్ ఛాంబర్ ఏకగ్రీవంగా ఒక తీర్మానం తీసుకుంది. దీని ప్రకారం ఎవరికైతే మంచి నైపుణ్యం ఉండి, తగిన వేతనానికి పనిచేస్తారో.. వారు యూనియన్లో ఉన్నా లేకున్నా వాళ్ళతో పని చేయించుకోవడానికి నిర్మాతలు సిద్ధంగా ఉన్నారు. నిర్మాత లేనిదే సినిమా పరిశ్రమ లేదు. మన చలనచిత్ర మనుగడ కోసం నిర్మాత శ్రేయస్సు అతి ముఖ్యమైన విషయం అని కార్మిక సంఘాలు మరొక్కసారి గుర్తించాలి" అని ఫిల్మ్ ఛాంబర్ పేర్కొంది.

సమ్మె నిర్ణయం.. సినిమాలపై, నిర్మాతలపై ప్రభావం

సినీ కార్మికుల సమ్మె ప్రభావం ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న సినిమాలపై పడనుంది. షూట్ ఆగిపోవడంతో ఖర్చులు మరింత పెరుగుతాయి. సంబంధిత నటుల కాల్షీట్లు వృథా అవుతాయి, సినిమా సామాగ్రితో పాటు తదితర పనులకు అద్దెలు కూడా అదనపు భారంగా మారుతాయి. సోమవారం ఉదయం పవన్‌కల్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్‌సింగ్' షూటింగ్ ప్రస్తుతం అన్నపూర్ణ స్టూడియోస్‌లో జరుగుతోంది. సోమవారం నుంచి పవన్‌కల్యాణ్ ఇందులో పాల్గొనాల్సి ఉంది. సమ్మెకారణంగా ముంబై నుంచి కార్మికులను తెప్పించి చిత్రీకరణ రిహార్సల్స్‌ను మొదలుపెట్టారు మేకర్స్ అయితే, బంద్‌కు పిలుపునిచ్చిన తరుణంలో బయటినుంచి కార్మికులను రప్పించి షూట్ చేయడమేంటంటూ మేకర్స్‌పై మండిపడి వారి ప్రయత్నాలకు సినీ కార్మికులు అడ్డుపడి నిలిపివేశారు ఇటువంటి నేపథ్యంలో యూనియన్ సభ్యులు కాని వారిని నిర్మాతలు ప్రోత్సహించాలని నిర్ణయించుకోవడంతో ఏం జరుగుతుందో, ఫెడరేషన్ ఎలా స్పందిస్తుందో ఎదురు చూద్దాం.

ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
వరంగల్ ● మంగళవారం 5 ఆగస్టు 2025

అపూర్వం.. అద్భుతం

సిరాజ్ సూపర్ షో

ఐదో టెస్టులో 6 పరుగులతో భారత్ ఉత్కంఠ విజయం





- ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ 367
- 2-2తో సిరీస్ సమం

నిస్సందేహంగా ఇది అద్భుత విజయమే.. 374 పరుగుల ఛేదనలో ఇంగ్లండ్ స్కోరు ఓ దశలో 301/3. క్రీజులో ఉన్న హ్యారీ బ్రూక్ ధనాధన్ ఆటతో బెంబేలెత్తిస్తున్నాడు.. మరో ఎండ్‌లో నిలకడకు మారు పేరు జో రూట్ ఉన్నాడు. ఈ పరిస్థితుల్లో ఎవరైనా ఊహిస్తారా.. మ్యాచ్‌లో భారత్ గెలుస్తుందని? కానీ అదే జరిగింది. నాలుగో రోజు ఆఖరి సెషన్‌లో టపటపా వికెట్లు తీసి మన పేసర్లు విజయంపై ఆశలు రేపారు. ఇక సోమవారం ఇంగ్లండ్‌కు 35 రన్స్, భారత్‌కు 4 వికెట్లు అవసరమవగా.. మ్యాచ్ ఏ వైపునకో అనే ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది. ఓ దశలో ఇంగ్లండ్ వైపే మొగ్గు కనిపించినా.. మహ్మద్ సిరాజ్ గేమ్ చేంజర్‌గా మారాడు. పాత బంతితోనే సూపర్ స్వింగ్‌ను రాబడుతూ.. బుల్లెట్‌లాంటి యార్కర్లతో వికెట్లు తీసి ఇంగ్లండ్ పతనాన్ని శాసించాడు. అంతే.. చేయి దాటిందనుకున్న మ్యాచ్ భారత్ ఖాతాలో చేరింది. సిరీస్ 2-2తో సమమైంది.

లండన్: భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌కు అదిరే ముగింపు. సిరీస్ కోసం ఆతిథ్య జట్టు.. సమం కోసం గిల్ సేన నువ్వా నేనా అనే రీతిలో తలపడిన ఐదో టెస్టులో సోమవారం అద్భుతమే జరిగింది. 374 పరుగుల ఛేదనలో మరో 35 పరుగుల కోసం చివరి రోజు బరిలోకి దిగిన ఇంగ్లండ్‌కు పేసర్ సిరాజ్ (5/104) దిమ్మతిరిగేలా చేశాడు. ప్రసిద్ధ్ (4/126) కూడా రాణించడంతో ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 85.1 ఓవర్లలో 367 పరుగులకు ఆలౌటైంది. అటు ఆరు పరుగుల తేడాతో గట్టెక్కిన భారత్.. అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీని 2-2తో సమం చేసింది. అట్కిన్సన్ (17) పోరాటం ఇంగ్లండ్‌కు ఫలితాన్నివ్వలేదు. అంతకుముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 224, ఇంగ్లండ్ 247 పరుగులు చేయగా.. భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 396 రన్స్ చేసింది. ఈ టెస్టులో 9 వికెట్లు తీసిన సిరాజ్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా.. గిల్, బ్రూక్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచారు.

53 బంతుల్లోనే..

339/6 ఓవర్‌నైట్ స్కోరుతో ఉన్న ఇంగ్లండ్ చివరి రోజు విజయం కోసం పక్కా వ్యూహంతోనే బరిలోకి దిగింది. తొలి అర్ధగంటపాటు బ్యాటింగ్‌కు అనుకూలించేలా ఆ జట్టు కోరిక మేరకు పిచ్‌పై భారీ రోలర్‌ను ఉపయోగించి సిద్ధం చేశారు. మరో 35 పరుగులు సులువుగా రాబట్టాలని ఇంగ్లండ్ ఆలోచించింది. కానీ బరిలోకి దిగాక సీన్ మారింది.

తొలి ఓవర్: ఆదివారం ఆటలో మిగిలిన నాలుగు బంతులను ప్రసిద్ధ్ కొనసాగించాడు. అయితే తొలి రెండు బంతులనే ఒవర్టన్ (9) ఫోర్లుగా మలిచి షాకిచ్చాడు. దీంతో 8 రన్స్ రావడంతో సమీకరణం ఇంగ్లండ్‌కు మరింత అనుకూలంగా మారింది.

రెండో ఓవర్: సిరాజ్ ఈ ఓవర్‌లో చక్కటి లెంగ్త్‌తో బంతులు విసిరాడు. అలాగే ఆఫ్‌సైడ్ ఆవల వేసిన బంతిని ఆడిన జేమీ స్మిత్ (2) కీపర్ జురెల్‌కు దొరికిపోవడంతో భారత్ అవకాశాలు మరింత పెరిగాయి.

మూడో ఓవర్: ప్రసిద్ధ్ వేసిన ఈ ఓవర్‌లో నాలుగు పరుగులు రాగా.. సమీకరణం 20 రన్స్‌కి మారడంతో ఉత్కంఠ నెలకొంది.

నాలుగో ఓవర్: సిరాజ్ ఐదో బంతికి ఒవర్టన్‌ను ఎల్బీ చేసి సంబరాలను రెట్టింపు చేశాడు. అయితే బ్యాటర్ రివ్యూకు వెళ్లినా అంపైర్ కాల్ కావడంతో భారత్‌కు అనుకూలంగా నిర్ణయం వచ్చింది.

ఐదో ఓవర్: కొత్త బంతి తీసుకునే అవకాశం వచ్చినా భారత్ వద్దనుకుంది. ప్రసిద్ధ్ నాలుగో బంతికి టంగ్‌ను అంపైర్ ఎల్బీగా ప్రకటించాడు. అయితే రివ్యూలో నాటౌట్‌గా తేలింది.

ఆరో ఓవర్: ఈ సమయంలో చిరు జల్లులు ఆరంభమయ్యాయి. స్టేడియంలో లైట్లను కూడా వేశారు. ఈ ఓవర్‌లో సిరాజ్ వేసిన ప్రతీ బంతి కూడా వికెట్ పడగొట్టేలా కనిపించింది.



ఏడో ఓవర్: ప్రసిద్ధ్ 141 కి.మీ వేగంతో విసిరిన అద్భుత యార్కర్‌కు టంగ్ బౌల్డయ్యాడు. ఈ దశలో ఆఖరి వికెట్‌గా భుజానికి పట్టీతోనే వోక్స్ బరిలోకి దిగాడు.

ఎనిమిదో ఓవర్: సిరాజ్ వేసిన రెండో బంతిని అట్కిన్సన్ లాంగాన్‌లో సిక్సర్‌గా మలిచి భారత్‌పై ఒత్తిడి పెంచాడు. వోక్స్‌కు బ్యాటింగ్ రాకూడదని ఆఖరి బంతికి బ్యాట్ టచ్ కాకున్నా పరుగు తీశాడు.

తొమ్మిదో ఓవర్: ప్రసిద్ధ్ వేసిన ఈ ఓవర్ తొలి బంతికి రెండు పరుగులు తీసిన అట్కిన్సన్, ఆఖరి బంతికి కూడా సింగిల్ తీశాడు.

పదో ఓవర్: విజయానికి మరో ఏడు పరుగులే కావాల్సిరావడంతో ఉత్కంఠ తారస్థాయికి చేరింది. కానీ ఇంగ్లండ్ ఆశలకు సిరాజ్ తొలి బంతికే తెర దించాడు. 143 కి.మీ వేగంతో విసిరిన సూపర్ యార్కర్‌కు అట్కిన్సన్ బౌల్డ్ కావడంతో భారత్‌కు చిరస్మరణీయ విజయం దక్కింది.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 224; ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 247; భారత్ రెండో ఇన్నింగ్స్: 396; ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలే (బి) సిరాజ్ 14, డకెట్ (సి) రాహుల్ (బి) ప్రసిద్ధ్ 54, పోప్ (ఎల్బీ) సిరాజ్ 27, రూట్ (సి) జురెల్ (బి) ప్రసిద్ధ్ 105, బ్రూక్ (సి) సిరాజ్ (బి) ఆకాశ్ 111, బెథెల్ (బి) ప్రసిద్ధ్ 5, స్మిత్ (సి) జురెల్ (బి) సిరాజ్ 2, ఒవర్టన్ (ఎల్బీ) సిరాజ్ 9, అట్కిన్సన్ (బి) సిరాజ్ 17; టంగ్ (బి) ప్రసిద్ధ్ 0; వోక్స్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 23; మొత్తం: 85.1 ఓవర్లలో 367 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-50, 2-82, 3-106, 4-301, 5-332, 6-337, 7-347, 8-354, 9-357, 10-367. **బౌలింగ్:** ఆకాశ్ దీప్ 20-4-85-1, ప్రసిద్ధ్ కృష్ణ 27-3-126-4, సిరాజ్ 30.1-6-104-5, సుందర్ 4-0-19-0, జడేజా 4-0-22-0.

2 ఇంగ్లండ్‌లో ఎక్కువ వికెట్లు తీసిన రెండో భారత బౌలర్‌గా కపిల్ దేవ్ (43)ను దాటేసిన సిరాజ్ (46). బుమ్రా, ఇషాంత్ (51) టాప్‌లో ఉన్నారు.

స్టెయిన్ చెప్పినట్టుగా..

ఐదో టెస్టులో సిరాజ్ ఐదు వికెట్లు తీస్తాడని సౌతాఫ్రికా మాజీ పేసర్ డేల్ స్టెయిన్ గత నెల 30న ఎక్స్‌లో పేర్కొన్నాడు. అతడు చెప్పినట్టుగానే రెండో ఇన్నింగ్స్‌లో సిరాజ్ 5 వికెట్లతో జట్టును గెలిపించాడు. మ్యాచ్ ముగిశాక సిరాజ్.. 'నువ్వు అడిగావు. నేను చేశాను' అంటూ స్టెయిన్‌కు సమాధానమిచ్చాడు.



సిరాజ్‌లాంటి బౌలర్ ఉంటే..

సిరాజ్, ప్రసిద్ధ్‌లాంటి బౌలర్లుంటే కెప్టెన్సీ చేయడం తేలికవుతుంది. ఆఖరి రోజు మా ప్రదర్శపై పూర్తి సంతృప్తిగా ఉన్నా. నిజానికి ఇరు జట్లు గ్రేడ్ 'ఎ' క్రికెట్ ఆడాయి. మేం గెలుస్తామన్న నమ్మకం నాలుగో రోజే కలిగింది. ఎందుకంటే ఒత్తిడి ఉన్నది వారిపైనే. - కెప్టెన్ గిల్

'సుయ్' సెలబ్రేషన్స్



ఇంగ్లండ్‌తో టెస్టులో చివరి వికెట్ తీసిన అనంతరం సిరాజ్.. రెండు చేతులూ వెనక్కినెట్టి గట్టిగా అరుస్తూ సింహనాదం చేశాడు. దీన్ని 'సుయ్' సెలబ్రేషన్స్ అంటారు. సాకర్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో ఇదే రీతిన సెలబ్రేట్ చేసుకుంటాడు. 2013లో ఓ మ్యాచ్‌లో గోల్ కొట్టినప్పుడు రొనాల్డో తొలిసారిగా ఈ విన్యాసాన్ని ప్రదర్శించాడు. సుయ్ అనేది పోర్చుగీసు పదం. దీనికి అవును అనే అర్థం. 'అవును.. నేను ప్రత్యర్థిని పడగొట్టా' అనే అర్థం వచ్చేలా ఈ విన్యాసాన్ని ఆటగాళ్లు ప్రదర్శిస్తుంటారు.

పదికి పది: సచిన్

టెస్టు క్రికెట్.. ఎప్పుడూ ఉత్కంఠ రేపుతుంది. సిరీస్ 2-2తో సమం చేసిన కుర్రాళ్ల ప్రదర్శనకు పదికి పది మార్కులు.

పోరాటం అద్భుతం: కోహ్లీ

టీమిండియాకు గొప్ప విజయం. సిరాజ్, ప్రసిద్ధ్ పోరాటం, పట్టుదల జట్టుకు చిరస్మరణీయ గెలుపును అందించింది. సిరాజ్ జట్టు కోసం సర్వ శక్తులూ ఒడ్డాడు.

సెమీస్‌కు ఆరుగురు బాక్సర్లు

బ్యాంకాక్: అండర్-22 ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత ఆటగాళ్లు సెమీస్ చేరి ఆరు పతకాలు ఖాయం చేశారు. వీరిలో ఇద్దరు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. సోమవారం జరిగిన క్వార్టర్స్ బౌట్‌లో ప్రియ (60 కిలోలు), పరంజల్ యాదవ్ (70 కి)తోపాటు హర్ష్ (60 కి), నీరజ్ (75 కి), రాకీ చౌదరి (85 కి), ఇషాన్ (90+ కి) గెలిచి సెమీస్‌కు చేరుకొన్నారు.

గ్రేటెస్ట్ విన్!

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

నవ యువ భారత జట్టు అద్భుతం చేసింది. అసాధ్యమనుకున్న విజయాన్ని సుసాధ్యం చేసింది. దిగ్గజ ఆటగాళ్లు కోహ్లీ, రోహిత్, అశ్విన్ లేని లోటును పూరించింది. ప్రపంచ క్రికెట్‌లో భారత్‌ను తిరుగులేని శక్తిగా నిలిపే సత్తా తమకుందని నిరూపించింది. చారిత్రక ఐదో టెస్టు విజయానికి..మాంచెస్టర్‌లో జరిగిన నాలుగో టెస్టును అమోఘ రీతిలో డ్రా చేసుకోవడం స్ఫూర్తిగా నిలిచింది. ఆ టెస్టు స్ఫూర్తితో 'ఓవల్‌లో గెలుపు సాధించగలమన్న ధీమా గిల్ సేనలో ఏర్పడింది. అయితే ఆఖరి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటర్లు తడబాటుకు లోనైనా..పేసర్లు సిరాజ్, ప్రసిద్ధ్ తడాఖా చూపడంతో భారీ స్కోరు చేయకుండా ఇంగ్లండ్‌ను నిలువరించింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటర్లు చెలరేగడంతో మనోళ్లు దాదాపు 400కు చేరువగా వచ్చారు. కానీ బ్యాటింగ్‌కు అనుకూలించిన వికెట్‌పై 374 పరుగుల లక్ష్యం ఆతిథ్య జట్టుకు సులువేనని అనిపించింది. పైగా రూట్, బ్రూక్ శతకాలతో కదం తొక్కడంతో భారత్ విజయంపై నీలినీడలు కమ్ముకున్నాయి. మన యువకుల పట్టు సడలుతుందేమోనని అనిపించింది. బ్రూక్ ఇచ్చిన క్యాచ్‌ను సిరాజ్ జారవిడవడంతో మ్యాచ్ చేజారినట్టేనని అభిమానులు డీలా పడ్డారు. కానీ టీమిండియా మాంచెస్టర్‌లో కంటే మిన్నగా పోరాడింది.ఈ ఊపులో బ్రూక్, రూట్‌ను పెవిలియన్ చేర్చి మ్యాచ్‌పై పట్టు సాధించారు. కానీ స్మిత్ క్రీజులో ఉండడంతోపాటు ఇంగ్లండ్ లోయరార్డర్ ఆటగాళ్ల కీలక సమయాల్లో బ్యాట్ ఝుళిపించే నైపుణ్యం ఉండడంతో విజయంపై సందేహాలు ఏర్పడ్డాయి. కానీ ఆఖరి రోజు హైదరాబాద్ పేసర్ సిరాజ్ విజృంభణకు ఇంగ్లండ్ కుదేలైంది. చారిత్రక విజయం మన సొంతమైంది.

> నాలుగో రోజు బ్రూక్ క్యాచ్‌ను వదిలేయడం బాధనిపించింది. దీంతో ఐదోరోజు ఉదయం లేవగానే నేనే గేమ్ ఛేంజర్ అవ్వాలని అనుకున్నా. అనుకున్నట్లే ఆరంభంలోనే రెండు వికెట్లు తీసి ఇంగ్లండ్‌ను ఒత్తిడిలో పడేశాం. చివరకు ఫలితాన్ని రాబట్టాం. - సిరాజ్

భుజం పట్టీతోనే బరిలోకి..



ఐదో టెస్టు తొలిరోజే బౌండరీ లైన్ దగ్గర గాయపడిన ఇంగ్లండ్ పేసర్ క్రిస్ వోక్స్ ఆఖరి రోజు భుజానికి పట్టీతోనే బరిలోకి దిగాడు. తొమ్మిదో వికెట్ పడిన వేళ ఆ జట్టు విజయానికి 17 రన్స్ అవసరమయ్యాయి. దీంతో వోక్స్‌ను ఆడించారు. గాయమైన ఎడమచేతిని స్వెట్టర్‌లో దాచుకుని మరో చేత్తో బ్యాట్ పట్టుకున్న అతడిని ప్రేక్షకులు చప్పట్లతో స్వాగతించారు. గతంలో కూడా కొందరు క్రికెటర్లు ఇలా బరిలోకి దిగారు. 2009లో సౌతాఫ్రికా కెప్టెన్ గ్రేమ్ స్మిత్ ఎడమ చేతికి పట్టీతోనే ఆడి 17 బంతులను ఎదుర్కొన్నాడు. విండీస్ గ్రేట్ మాల్కం మార్షల్ 1984లో ఎడమచేతి బొటనవేలు ఫ్రాక్చర్ అయినా.. కుడి చేత్తోనే బ్యాటింగ్ చేశాడు.

రూపాయికి సుంకాల పోటు

- క్రమంగా కరుగుతున్న విలువ
- రూ.87.66కి మారకం రేటు
- త్వరలో రూ.88.50కి చేరిక?



ముంబై: గడిచిన కొన్ని రోజుల్లో భారత కరెన్సీ విలువ తీవ్ర ఒడుదుడుకులకు లోనవుతోంది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ సోమవారం మరో 48 పైసలు పతనమై రూ.87.66 వద్ద ముగిసింది. ట్రంప్ సుంకాల పోటు, మన ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఎఫ్ఐఐ) పెట్టుబడుల ఉపసంహరణ, దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడం ఇందుకు కారణమని ఫారెక్స్ వర్గాలు తెలిపాయి. గతవారంలోనూ రూపాయి మారకం విలువ 1.2 శాతం పతనమైంది. 2022 డిసెంబరు తర్వాత మన కరెన్సీకిదే అతిపెద్ద వారం రోజుల క్షీణత. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితితోపాటు విదేశీ పెట్టుబడులు తరలిపోతుండటంతో రాబోయే కాలంలో కూడా రూపాయి బలహీనంగానే ఉండవచ్చని మిరే అసెట్ షేర్‌ఖాన్ కమోడిటీస్, కరెన్సీస్ రీసెర్చ్ అనలిస్ట్ అనూజ్ చౌదరి అభిప్రాయపడ్డారు. రాబోయే సెషన్లలో డాలర్-రూపీ మారకం రేటు రూ.88.50కి చేరుకోవచ్చని ఐసీఐసీఐ బ్యాంక్ తాజా నివేదిక అంచనా వేసింది. అయితే, బలహీనపడుతున్న డాలర్, ఆర్‌బీఐ వడ్డీరేట్ల తగ్గింపు వంటి అంశాలు కనిష్ఠ స్థాయిల్లో రూపాయికి మద్దతుగా నిలవవచ్చని ఫారెక్స్ వర్గాలు భావిస్తున్నాయి.

యూఎస్‌తో వాణిజ్య ఒప్పందం ఎప్పుడో.. ?

ట్రంప్ భారత్‌పై విధించిన 25 శాతం సుంకాలు ఈ నెల నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ దెబ్బతో ఎగుమతులపై 30% మేర ప్రభావం పడవచ్చని జీటీఆర్ఐ అంచనా వేసింది. ఈనేపథ్యంలో అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదిరితే సుంకాల పోటు నుంచి కాస్త ఊరట లభించవచ్చని ఎగుమతిదారులు ఎదురుచూస్తున్నారు. కానీ, యూఎస్‌తో ట్రేడ్ డీల్ ఎప్పటి లోగా కుదురుతుందన్న విషయంలో అనిశ్చితి పెరుగుతోంది. ఇదిలా ఉండగా.. గతనెలలో ఎఫ్ఐఐలు మొత్తం రూ.17,400 కోట్లకు పైగా పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ఈనెల 1న రూ.5,588.91 కోట్లు, 2న రూ.3,366.40 కోట్లు, సోమవారం మరో రూ.2,566.51 కోట్ల నికర అమ్మకాలు జరిపారు.

ఆసియా కరెన్సీల్లోకెల్లా అత్యంత కనిష్ఠ పనితీరు

ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే, ఈ ఏడాది ద్వితీయార్ధంలో మన రూపాయి ఆసియాలోకెల్లా అత్యంత కనిష్ఠ పనితీరు కనబరిచిన కరెన్సీగా మిగిలిపోవచ్చని డాయిష్ బ్యాంక్ భావిస్తోంది. ఈ ఏడాది చివరికల్లా డాలర్‌తో రూపాయి మారకం విలువ సరికొత్త జీవనకాల కనిష్ఠానికి జారుకోవచ్చని అంచనా వేసింది. అమెరికా సుంకాల సంబంధిత ప్రతికూలతలు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణే రూపాయిపై ప్రధానంగా ఒత్తిడి పెంచుతున్నాయని ఫారెక్స్ విశ్లేషకులు పేర్కొన్నారు.

సెన్సెక్స్ మళ్లీ 81,000 పైకి..

ముంబై: స్టాక్ మార్కెట్లో రెండ్రోజుల వరుస నష్టాలకు తెరపడింది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు మెటల్, ఆటో, కమోడిటీ రంగాల షేర్లలో కొనుగోళ్లు పెంచడంతో సూచీలు సోమవారం లాభాల్లో పయనించాయి. సెన్సెక్స్. 418.81 పాయింట్ల లాభంతో 81,018.72 వద్ద ముగిసింది. నిఫ్టీ 157.40 పాయింట్ల వృద్ధితో 24,722.75 వద్ద స్థిరపడింది.

7న ఆల్ టైం ప్లాస్టిక్స్ ఐపీఓ

కన్స్యూమర్‌వేర్ ఉత్పత్తుల తయారీదారు ఆల్ టైం ప్లాస్టిక్స్ రూ.401 కోట్ల ఐపీఓ ఈనెల 7న ప్రారంభమై 11న ముగియనుంది. ఐపీఓ ధరల శ్రేణిని కంపెనీ రూ.260-275గా నిర్ణయించింది.

- డిజిటల్ హెల్త్ టెక్ ప్లాట్‌ఫామ్ ప్రాక్టో.. త్వరలో ఐపీఓకు రావాలనుకుంటోంది. ఇప్పటికే అంతర్జాతీయం గా 5 కోట్ల మంది పేషెంట్లకు సేవలందించిన ఈ వేదికకు 5 లక్షలకు పైగా వైద్యులు అనుసంధానితమై ఉన్నారు.

హైదరాబాద్‌లో మెర్జెన్ కార్పొరేట్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లో మరో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) ఏర్పాటైంది. మెర్జెన్ కార్పొరేట్స్ తన సర్వీస్ నౌ డిజిటల్ వర్క్‌ఫ్లో కోసం 10 లక్షల డాలర్ల పెట్టుబడితో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఈ కేంద్రంలో యాభై మందికిపైగా ఏఐ, వర్క్‌ఫ్లో ఆటోమేషన్ నిపుణులు పని చేస్తున్నారు. వచ్చే ఏడాది ప్రారంభానికల్లా ఈ సంఖ్యను రెట్టింపు చేయనున్నట్టు మెర్జెన్ కార్పొరేట్స్ తెలిపింది.

అరబిందో ఫార్మా లాభం రూ.824 కోట్లు

AUROBINDO
Committed to healthier life!

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వర్తమాన ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికానికి అరబిందో ఫార్మా లాభం 10% తగ్గి రూ.824 కోట్లకు పడిపోయింది. అమెరికా మార్కెట్లోను, ఏపీఐ విభాగంలోను అమ్మకాలు తగ్గడం ఇందుకు కారణం. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే కంపెనీ లాభం రూ.918 కోట్లుంది. ఆదాయం మాత్రం రూ.7,567 కోట్ల నుంచి రూ.7,868 కోట్లకు పెరిగింది. సోమవారం జరిగిన కంపెనీ డైరెక్టర్ల బోర్డు సమావేశంలో రూపాయి ముఖవిలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.4 మధ్యంతర డివిడెండుకు (400%) ఆమోదం తెలిపారు. డివిడెండు చెల్లింపునకు రికార్డు తేదీని ఆగస్టు 8గా నిర్ణయించారు. తమ యూరోపియన్ వ్యాపారాల్లో బలమైన వృద్ధి నమోదవుతోందని, అమెరికా వ్యాపారాలు మాత్రం ఆటుపోట్లను తట్టుకుంటూ నిలదొక్కుకున్నాయని కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కే.నిత్యానంద రెడ్డి తెలిపారు.

బిజినెస్

జీఎస్‌టీ ఎగవేతలు

ఐదేళ్లలో రూ.7.08 లక్షల కోట్లు

ఐటీసీ పేరుతోనూ బురిడీ



న్యూఢిల్లీ: జీఎస్‌టీ కాలంలోనూ పన్ను ఎగవేతలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గత ఐదేళ్లలో (2020-25) 91,370 కేసుల్లో రూ.7.08 లక్షల కోట్ల జీఎస్‌టీ ఎగవేతలను కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని క్షేత్ర స్థాయి జీఎస్‌టీ అధికారులు గుర్తించారు. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో ఈ విషయం వెల్లడించారు. గత ఐదేళ్లలో వ్యాపారులు, వ్యాపార సంస్థలు, కంపెనీలు ఎగవేసిన రూ.7.08 లక్షల కోట్ల జీఎస్‌టీ కేసుల్లో ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ (ఐటీసీ) వాటానే రూ.2.79 లక్షల కోట్ల వరకు ఉందని మంత్రి చెప్పారు. ఐతే గత ఐదేళ్లలో స్వచ్ఛంద డిపాజిట్ పథకం ద్వారా రూ.1.29 లక్షల కోట్ల జీఎస్‌టీ ఎగవేతల సొమ్మును అధికారులు రాబట్టగలిగారు.

ఎగవేతల తీరు

2024-25 ఆర్థిక సంవత్సరంలో 33,056 కేసుల్లో రూ.2.23 లక్షల కోట్ల జీఎస్‌టీ ఎగవేతలను అధికారులు గుర్తించారు. ఇందులో 15,283 కేసులు ఐటీసీ ఎగవేతలకు సంబంధించినవి ఉన్నాయి. ఈ ఎగవేతల ద్వారా కేంద్ర ప్రభుత్వ ఖజానాకు రూ.58,772 కోట్ల వరకు గండి పడింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలోనూ రూ.2.30 లక్షల జీఎస్‌టీ ఎగవేతలకు సంబంధించిన కేసులను సీజీఎస్‌టీ అధికారులు గుర్తించారు. ఇందులో ఐటీసీ స్వాహా రూ.36,374 కోట్ల వరకు ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.1.32 లక్షల కోట్లు, 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.73,238 కోట్లు, 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ.49,384 కోట్ల జీఎస్‌టీ ఎగవేత కేసులను అధికారులు గుర్తించారు.

కట్టడి చర్యలు

జీఎస్‌టీ ఎగవేతలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇ-ఇన్వాయిసింగ్, జీఎస్‌టీ అనలిటిక్స్ వంటి డిజిటైజేషన్ చర్యలతో పాటు నిఘాను పటిష్ఠం చేయడం, రిటర్న్‌ల స్ర్కూటినీ చేపట్టినట్టు పంకజ్ చౌదరి చెప్పారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సీజీఎస్‌టీ రూపంలో కేంద్ర ప్రభుత్వ ఖజానాకు నికరంగా రూ.10.26 లక్షల కోట్లు చేరింది. సవరించిన బడ్జెట్ అంచనాల ప్రకారం ఇది (రూ.10.62 లక్షల కోట్లు) 96.7 శాతానికి సమానమని మంత్రి తెలిపారు.

రూ.47.12 కోట్ల ఎగవేతల గుట్టు రట్టు

ఐరన్, స్టీలు వ్యాపారంలో ఉన్న ఒక ఢిల్లీ వ్యాపారి బోగస్ ఇన్వాయిస్‌లతో రూ.47.12 కోట్ల ఐటీసీ స్వాహా చేసినట్టు అధికారులు గుర్తించారు. ఈ ఘరానా పెద్ద మనిషి అసలు వస్తువులే సరఫరా చేయకుండా బోగస్ ఇన్వాయిస్‌లతో ఈ మొత్తాన్ని స్వాహా చేసినట్టు అధికారులు చెప్పారు. పక్కా సమాచారంతో దర్యాప్తు చేసి అధికారులు ఇతడిని అరెస్టు చేశారు.

స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ రూ.21 కోట్ల లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్థానిక స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ (ఎస్‌జీఎల్‌టీఎల్) జూన్ త్రైమాసికంలో రూ.178 కోట్ల ఆదాయంపై రూ.35 కోట్ల స్థూల లాభం, రూ.21 నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 23.6%, స్థూల లాభం 31.9%, నికర లాభం 37.6% పెరిగాయి. వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు కంపెనీ మరిన్ని చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అమెరికాలో స్టాండర్డ్ ఇంజినీరింగ్ ఇంక్ పేరుతో పూర్తి అనుబంధ సంస్థను ఏర్పాటు చేసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ			
హైదరాబాద్	435	విజయవాడ	475
వరంగల్	437	గోదావరి	470
చిత్తూరు	513	విశాఖపట్నం	470
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90	విజయవాడ	99
వరంగల్	90	గుంటూరు	104
కరీంనగర్	90	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	82
కర్నూలు	90	నెల్లూరు	87
విశాఖపట్నం	94	అనంతపురం	87
గోదావరి	99		

ఐదో అతిపెద్ద విమానయాన మార్కెట్‌గా భారత్

న్యూఢిల్లీ: భారత్ ప్రపంచంలో ఐదో అతి పెద్ద విమానయాన సేవల మార్కెట్‌గా అవతరించిందని ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) వెల్లడించింది. గత ఏడాది భారత్‌లో 21.1 కోట్ల మంది (జాతీయ, అంతర్జాతీయ) విమాన ప్రయాణం చేశారని, 2023తో పోలిస్తే విమాన ప్రయాణికుల సంఖ్య 11.1 శాతం పెరిగిందని తాజా నివేదికలో వెల్లడించింది. అలాగే, ముంబై-ఢిల్లీ అత్యంత రద్దీ విమానాశ్రయాల జంటల్లో ఒకటని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా 350 ఎయిర్‌లైన్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఐఏటీఏ రిపోర్టులోని మరిన్ని విషయాలు..

- గత ఏడాదికి గాను 87.6 కోట్ల మంది ప్రయాణికులతో అతిపెద్ద విమానయాన మార్కెట్‌గా అమెరికా తన అగ్రస్థానాన్ని కొనసాగించింది. 74.1 కోట్ల ప్రయాణికులతో చైనా రెండో స్థానంలో ఉంది.
- ప్రపంచంలోని అత్యంత రద్దీ విమానాశ్రయాల జంటలో ముంబై-ఢిల్లీ 7వ స్థానంలో ఉన్నాయి. గత ఏడాది ఈ ఎయిర్‌పోర్టుల మధ్య 59 లక్షల మంది ప్రయాణించారు. ఈ విషయంలో ఆసియా పసిఫిక్ విమానాశ్రయాల జంటలే అధికం. జెజు-సియోల్ ప్రపంచంలోనే అత్యంత రద్దీ విమానాశ్రయ జంటగా నిలిచింది. గత ఏడాది ఈ రెండు ఎయిర్‌పోర్ట్‌ల మధ్య 1.32 కోట్ల మంది ప్రయాణించారు.
- గత ఏడాది అంతర్జాతీయ విమాన సర్వీసుల్లో బిజినెస్, ఫస్ట్ క్లాస్‌లో ప్రయాణించిన వారి సంఖ్య 11.8 శాతం పెరగగా.. ఎకానమీ క్లాస్ ప్రయాణికుల వృద్ధి 11.5 శాతంగా నమోదైంది. 2024లో అంతర్జాతీయ బిజినెస్, ఫస్ట్ క్లాస్ ప్రయాణికుల మొత్తం సంఖ్య 11.69 కోట్లకు పెరిగింది. ఇది మొత్తం అంతర్జాతీయ ప్రయాణికుల్లో 6 శాతానికి సమానం.

ధ్రువ స్పేస్ 'లీప్-1' ప్రయోగం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే స్టార్టప్ కంపెనీ ధ్రువ స్పేస్ ఈ సంవత్సరం మూడో త్రైమాసికంలో లీప్-1 ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధమవుతోంది. స్పేస్ ఎక్స్ కంపెనీకి చెందిన ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా ఈ ప్రయోగం జరపనున్నట్టు ధ్రువ స్పేస్ తెలిపింది. కంపెనీకి ఇదే తొలి వాణిజ్య ఉపగ్రహ ప్రయోగం. రక్షణ, విపత్తుల నిర్వహణ, పర్యావరణ నిర్వహణకు అవసరమైన ఏఐ ఆధారిత సేవలను ఈ లీప్-1 ఉపగ్రహం అందించనుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,400 ▲	92,950 ▲	1,23,000 ▼
విజయవాడ	1,03,550 ▲	97,000 ▲	1,14,300 ▲
విశాఖపట్నం	1,03,170 ▲	92,950 ▲	1,23,000 ▲
రాజమండ్రి	1,01,400 ▲	92,950 ▲	1,14,800 ▲
ప్రొద్దుటూరు	1,00,200 ▼	92,180 ▼	1,14,800 ▲
ముంబై	1,00,170 ▲	91,750 ▲	1,11,900 ▲

స్పోర్ట్స్ హబ్ ఛైర్మన్‌గా సంజీవ్ గోయెంకా

» వైస్ ఛైర్మన్‌గా కొణిదెల ఉపాసన.. కొత్తగా పాలకమండలి

» సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఉపాసన.. చిరంజీవి హర్షం


సంజీవ్ గోయెంకా


ఉపాసన

హైదరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్పోర్ట్స్ హబ్‌కు ఛైర్మన్‌గా ఆర్పీ సంజీవ్ గోయెంకా గ్రూప్ ఛైర్మన్ సంజీవ్ గోయెంకా నియమితులయ్యారు. వైస్ ఛైర్మన్‌గా ప్రముఖ నటుడు చిరంజీవి కోడలు కొణిదెల ఉపాసనను నియమించారు. ఈమేరకు స్పోర్ట్స్ హబ్ పాలకమండలిని నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మరో 14 మంది సభ్యులనూ నియమించింది. వీరిలో సన్‌టీవీ నెట్‌వర్క్‌కు చెందిన కావ్య మారన్, పుల్లెల గోపిచంద్ (బ్యాడ్మింటన్), రవికాంత్‌రెడ్డి (వాలీబాల్), బైచుంగ్ భుటియా (ఫుట్‌బాల్), అభినవ్ బింద్రా (షూటింగ్), కపిల్‌దేవ్ (క్రికెట్) తదితర ప్రముఖులు ఉన్నారు. క్రీడాభివృద్ధి నిధిని సమర్థంగా ఉపయోగించుకునేందుకే ఈ పాలకమండలిని ఏర్పాటు చేసినట్టు ప్రభుత్వం పేర్కొంది. కాగా, తనను టీ స్పోర్ట్స్ హబ్‌కు వైస్‌ఛైర్మన్‌గా నియమించడంపట్ల సీఎం రేవంత్ రెడ్డికి ఉపాసన కృతజ్ఞతలు తెలిపారు. సంజీవ్ గోయెంకాతో కలిసి పనిచేసే అవకాశంరావడం మరింత గౌరవంగా భావిస్తున్నట్లు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఉపాసనకు స్పోర్ట్స్ హబ్ వైస్‌ఛైర్మన్ బాధ్యతలు అప్పగించడంపై చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. 'మా కోడలు ఉపాసన ఇప్పుడు తెలంగాణ స్పోర్ట్స్ హబ్‌కు వైస్‌ఛైర్మన్. ఆమెను ఈ హోదాలో చూడడం సంతోషంగా ఉంది. డియర్ ఉపాసన.. నీకున్న నిబద్ధత, ప్యాషన్‌తో క్రీడల్లో దాగిన అపార ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తారని, ప్రతిభావంతులను అగ్రస్థానంలో నిలబెట్టడానికి తగిన విధివిధానాలను రూపొందించడంలో నీ వంతు కృషి చేస్తావని ఆశిస్తున్నా' అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు.

కాళేశ్వరం అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి

» సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్

న్యూఢిల్లీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ, బీజేపీకి బీఆర్ఎస్ పట్ల ప్రేమ లేకపోతే, నిష్పాక్షికంగా విచారణ జరిపించి దోషులను శిక్షించాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరగడం వాస్తవమని, ఇంజనీర్ల వద్దే కోట్లాది రూపాయలు దొరికినప్పుడు, దానిని రూపకల్పన చేసిన వారు ఇంకెంత దోచుకున్నారో అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ ప్రాజెక్టులో జరిగిన అవకతవకలకు కేసీఆర్ అహంభావమే కారణమని ఆరోపించారు.

అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ధర్నా

» గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పణ

హైదరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో సోమవారం స్పీకర్‌ను కలిసేందుకు వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. ఆయన అందుబాటులో లేకపోవడంతో అసెంబ్లీ ప్రాంగణంలో ధర్నా చేపట్టారు. గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి నిరసన వ్యక్తం చేశారు. వారిలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, గంగుల కమలాకర్, ఎమ్మెల్యేలు కె.పి.వివేకానంద, చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, సుధీర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, కౌశిక్‌రెడ్డి, తదితరులున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముందుగా అనుమతి తీసుకున్నప్పటికీ స్పీకర్ అందుబాటులో లేరన్నారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు.

కాళేశ్వరం పూర్తి చేస్తేనే రుణాలపై వడ్డీ తగ్గిస్తాం

» రాష్ట్రాల గ్రేడ్‌లను చూసే వడ్డీ రేట్లు: కేంద్రం

న్యూఢిల్లీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిచేస్తేనే అప్పులపై వడ్డీ తగ్గింపు అంశాన్ని పరిశీలిస్తామని కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. ఈ విషయాన్ని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశామన్నారు. సోమవారం లోక్‌సభలో ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కోసం స్పెషల్ పర్పస్ వెహికల్స్ (ఎస్పీవీలు) ద్వారా సేకరించిన అప్పుల రీస్ట్రక్చర్‌కు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు అందాయని తెలిపారు. కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్ (కేఐపీసీఎల్)కు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ), గ్రామీణ విద్యుదీకరణ కార్పొరేషన్ (ఆర్ఈసీ) నిధులు సమకూర్చాయని వివరించారు. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు అయిన పీఎఫ్‌సీ, ఆర్ఈసీలు దేశీయ, ఆఫ్‌షోర్ మార్కెట్లలోని వివిధ వనరుల నుంచి నిధులు సేకరిస్తాయన్నారు. వాటికి అయ్యే ఖర్చులను బట్టి వడ్డీరేట్లను నిర్ణయిస్తాయని తెలిపారు. అప్పు తీసుకునే వారి గ్రేడింగ్‌పై కూడా వడ్డీరేట్లు ఆధారపడి ఉంటాయన్నారు. అప్పుల చెల్లింపుల్లో మార్పులు చేస్తే కాళేశ్వరం ప్రాజెక్టు ఖాతా స్టాండర్డ్ నుంచి సబ్-స్టాండర్డ్‌కు దిగజారుతుందని తెలిపారు.

బీసీ రిజర్వేషన్లపై నాటకమాడుతున్న కాంగ్రెస్

» బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మండిపాటు

హైదరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం నాటకమాడుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాంచందర్‌రావు మండిపడ్డారు. ప్రభుత్వానికి బీసీ రిజర్వేషన్లు అమలు చేయడం ఇష్టం లేదు గనుకే ఢిల్లీ వెళ్లి డ్రామా చేస్తోందని ఆరోపించారు. సోమవారం రాంచందర్‌రావు విలేకరులతో మాట్లాడుతూ, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తే తాము మద్దతిస్తామని ప్రకటించారు. ముస్లింలకు ప్రతిపాదించిన 10శాతం రిజర్వేషన్లు తొలగించాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లకు సంబంధించిన ఆర్డినెన్సు కాపీని రాష్ట్రపతికి కాంగ్రెస్‌నేతలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఆ కాపీ పంపించాల్సింది గవర్నర్ కాదా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. 10శాతం ముస్లిం రిజర్వేషన్లను ఎందుకు తొలగించరని ప్రశ్నిస్తే సమాధానం చెప్పని కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రాన్ని బద్నాం చేస్తోందని ఆయన ఆరోపించారు.

కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద బీఆర్ఎస్ నిరసన

» ముట్టడికి యత్నించిన నేతలు.. అడ్డుకున్న పోలీసులు

మహదేవపూర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల బీఆర్ఎస్ శ్రేణులు ముట్టడించాయి. పంప్‌హౌస్ నుంచి వెంటనే నీటిని విడుదల చేసి సాగు నీరు అందించాలని నేతలు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధు ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం జరగ్గా ఎమ్మెల్సీ రమణ, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు చందర్, విద్యాసాగర్‌రావు, దివాకర్‌రావు తదితరులు కాళేశ్వరం చేరుకున్నారు. అనంతరం కన్నెపల్లి పంప్‌హౌస్ ముట్టడికి భారీ శ్రేణులతో కలిసి బయల్దేరారు. డీఎస్పీ సూర్యనారాయణ నేతృత్వంలో అప్పటికే బందోబస్తులో ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. పంప్‌హౌస్‌లోకి బీఆర్ఎస్‌నేతలు చొచ్చుకురాగా పోలీసులు నిలువరించారు. పోలీసులు అడ్డుకోవడంతో బీఆర్ఎస్ నేతలు పంప్‌హౌస్ ఎదుట బైఠాయించారు.

శిబూ సోరెన్ మృతి పట్ల సీఎం రేవంత్ సంతాపం

హైదరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఝార్ఖండ్ మాజీ సీఎం శిబూ సోరెన్ మృతి పట్ల సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. శిబూసోరెన్ కుమారుడు, ప్రస్తుత ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఝార్ఖండ్ ప్రత్యేక రాష్ట్ర సాధనలో, గిరిజనుల సమస్యల పరిష్కారంలో మడమ తిప్పని పోరాటం చేసిన యోధుడు గురూజీ శిబూసోరెన్ అని కొనియాడారు. చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు గురూజీ ఎప్పుడూ మద్దతు తెలిపేవారని, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికీ ఆయన మద్దతుదారుగా నిలిచారని గుర్తుచేశారు. ఆదివాసీ సమాజానికి ఆయన చేసిన సేవలు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతాయన్నారు. శిబూసోరెన్ మృతిపట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సంతాపం ప్రకటించారు.

ఊరు మార్చి.. పేరు మార్చి..

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం తప్పకుండా పాటిస్తుందని తేల్చి చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం సచివాలయంలో క్యాబినెట్ సమావేశం జరిగింది. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన సమావేశం రెండు గంటలకుపైగా కొనసాగింది. సమావేశంలో ప్రధానంగా జస్టిస్ పీసీ ఘోష్ నివేదిక, ఐఏఎస్ అధికారుల కమిటీ ఇచ్చిన సంక్షిప్త నివేదికపై చర్చించారు. ఘోష్ నివేదికలోని అంశాలను మంత్రులందరికీ వివరించారు. అనంతరం, జస్టిస్ పీసీ ఘోష్ నివేదికను క్యాబినెట్ ఆమోదించింది. అనంతరం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క తదితరులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి వివరాలను విలేకరులకు వెల్లడించారు.

కేసీఆర్ హయాంలోనే ఎన్డీఎస్ఏ నివేదిక

ఉమ్మడి రాష్ట్ర సీఎంగా వైఎస్ ఉన్నప్పుడు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును రూపొందించారని, తెలంగాణ ఏర్పాటైన తర్వాత ప్రాజెక్టుల రీ డిజైనింగ్ పేరిట అప్పటి సీఎం కేసీఆర్ తుమ్మిడిహెట్టి నుంచి మార్చి మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం వద్ద బ్యారేజీలను నిర్మించాలని నిర్ణయించారని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. 2015-16లో మొదలు పెట్టిన పనులను 2018-19లో పూర్తి చేశారని, కానీ, మూడేళ్లలోపే అంటే 2023 అక్టోబర్‌లో మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందని, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు పగుళ్లు వచ్చాయని వివరించారు. ప్రాజెక్టులు ప్రమాదంలో పడ్డాయని అప్పట్లో సాంకేతిక నిపుణులు, ఎన్డీఎస్ఏ సహా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు గుర్తించి, విచారణ జరిపాయని గుర్తు చేశారు. ప్రణాళిక, నిర్మాణం, నిర్వహణలో లోపాలున్నాయని తేల్చారని, దీనిపై పూర్తి స్థాయి విచారణ జరపాలంటూ కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే ఎన్డీఎస్ఏ వంటి సంస్థలు నివేదికలు ఇచ్చాయని వెల్లడించారు. అప్పట్లోనే తాము ప్రాజెక్టులో అవినీతి,


విలేకరులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఆశ్రిత పక్షపాతం, నిర్లక్ష్యం ఉన్నాయని, తాము అధికారంలోకి రాగానే విచారణ జరిపిస్తామని చెప్పామని, అన్నట్లే అధికారంలోకి వచ్చిన తర్వాత జస్టిస్ పీసీ ఘోష్‌తో న్యాయ కమిషన్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. జస్టిస్ పీసీ ఘోష్ దేశంలోనే గొప్ప న్యాయ నిపుణులని, అలాంటి వ్యక్తినే కమిషన్‌కు ఛైర్‌పర్సన్‌గా నియమించామని తెలిపారు. దాదాపు 16 నెలలపాటు విచారణ జరిపి.. ఆనాటి ముఖ్యమంత్రి, మంత్రులు, ఐఏఎస్, ఇంజనీరింగ్ అధికారులు, నిర్మాణ సంస్థలు, ప్రజా సంఘాలు, పాత్రికేయులను విచారించిందని గుర్తు చేశారు. కేసీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లకు నోటీసులు ఇచ్చి, ప్రశ్నించిందని, వారి వివరణలకు సమయం కూడా ఇచ్చిందని వివరించారు. వారిచ్చిన వివరణలన్నింటినీ కమిషన్ విశ్లేషించి 665 పేజీలతో సుదీర్ఘ నివేదికను ప్రభుత్వానికి అందజేసిందని తెలిపారు.

నివేదికను బీఆర్ఎస్ తప్పుపట్టడం సహజమే

కాళేశ్వరం నివేదికను బీఆర్ఎస్ పార్టీ తప్పుపట్టడం సహజమేనని ఒక ప్రశ్నకు సమాధానంగా సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. నివేదిక వారికి అనుకూలంగా ఉంటే ఒకలా.. లేకపోతే మరోలా మాట్లాడటం వారికి అలవాటేనని అన్నారు. కమిషన్ నివేదికలో ఎలాంటి రాజకీయ జోక్యం లేదని, ఇది ఇండిపెండెంట్, జ్యుడీషియల్ కమిషన్ ఇచ్చిన నివేదిక అని తెలిపారు. రాజకీయ కక్షలు, వ్యక్తిగత ద్వేషంతో నిర్ణయాలు తీసుకోవడం వంటివాటికి ఏమాత్రం తావివ్వకుండా ప్రభుత్వం పారదర్శకంగా పని చేయాలనుకుంటోందని తెలిపారు.

అసెంబ్లీని తప్పుదోవ పట్టించిన కేసీఆర్: భట్టి

కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయంగా ఆరోపణలు చేయడం లేదని, ఇది ప్రభుత్వ నివేదిక కాదని, ఒక ఇండిపెండెంట్, జ్యుడీషియల్ కమిషన్ ఇచ్చిన నివేదిక అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మూడు బ్యారేజీల నిర్మాణంలో లోపాలు, నిర్వహణలో జరిగిన అక్రమాలు, అవకతవకలకు అప్పటి సీఎం కేసీఆర్ ప్రత్యక్షంగా, పరోక్షంగా బాధ్యుడంటూ నివేదిక తేల్చిందన్నారు. 31.3.2016న అప్పటి సీఎం శాసన సభలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారని, తుమ్మిడిహెట్టి వద్ద నుంచి ఎందుకు మార్చామో చెప్పారని, కానీ, నిపుణుల కమిటీ నివేదికను కాదని, కేసీఆర్ సొంతంగా నిర్ణయం తీసుకున్నారని నివేదిక స్పష్టం చేసిందని, తద్వారా కేసీఆర్ శాసన సభను తప్పుదోవ పట్టించారని, రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించారని ఆరోపించారు. అప్పటి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కాపాడడంలో చిత్తశుద్ధి, సమగ్రతతో వ్యవహరించలేదని నివేదిక తప్పుపట్టిందని వివరించారు.

కాళేశ్వరం వైఫల్యానికి కేసీఆరే బాధ్యుడు: మంత్రి ఉత్తమ్

కాళేశ్వరం బ్యారేజీల వైఫల్యానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆరే ప్రధాన కారణమంటూ జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ నివేదిక ఇచ్చిందని నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. క్యాబినెట్ సమావేశం అనంతరం నివేదికలోని ముఖ్యాంశాలను ఆయన విలేకరులకు వివరించారు. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు బ్యారేజీని మార్చడం అతి పెద్ద తప్పిదమన్నారు. కాళేశ్వరంతో తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని నివేదిక చెప్పిందని గుర్తు చేశారు. కమిషన్ విచారణలో కేసీఆర్ ప్రత్యక్షంగా బాధ్యుడని, డిజైన్, నిర్మాణం, నాణ్యత లోపం వల్లే బ్యారేజీ కుంగిందని తేలిందన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద 205 టీఎంసీల నీటి లభ్యత ఉందని, ఈ మేరకు అప్పట్లో కేంద్ర జలశక్తి శాఖ మంత్రిగా ఉన్న ఉమాభారతి ప్రాజెక్టుకు హైడ్రాలజీ క్లియరెన్స్ ఇస్తున్నట్లు లేఖ రాశారని తెలిపారు. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదనడం అబద్ధమని, ఒక సాకు మాత్రమేనని నివేదిక తేల్చిందన్నారు. మేడిగడ్డలో బ్యారేజీ నిర్మాణం ఏ మాత్రం సహేతుకం కాదని, తుమ్మిడిహెట్టి దిగువన ప్రాణహితపై వేమనపల్లి వద్ద బ్యారేజీ కట్టాలని కేసీఆర్ హయాంలోనే వేసిన నిపుణుల కమిటీ సిఫారసు చేసిందని, దానిని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, నీటిపారుదల శాఖ మాజీ ముఖ్యకార్యదర్శి ఎస్కే జోషి, మాజీ ఈఎన్‌సీలు మురళీధర్, హరిరామ్ ఉద్దేశపూర్వకంగానే తొక్కి పెట్టారని కమిషన్ తప్పు పట్టిందని వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని శాశ్వతంగా ప్రమాదంలోకి నెట్టే విధంగా అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని నివేదికలో స్పష్టం చేశారని తెలిపారు. కాళేశ్వరం జీవోలకు మంత్రివర్గ ఆమోదం లేదని, ఆ తర్వాత ర్యాటిఫికేషన్ కూడా చేయించలేదని కమిషన్ తేల్చిందన్నారు. నిర్మాణ సంస్థలకు అనుచిత లబ్ధి చేకూర్చడానికి నిబంధనలకు విరుద్ధంగా రూ.369 కోట్ల పనులను నామినేషన్ పద్ధతిలో అప్పగించారని నివేదికలో తప్పుబట్టారని చెప్పారు. నీటిని మళ్లించడానికి బ్యారేజీలను, నిల్వకు డ్యామ్‌లను కడతారని, కేవలం ప్రచారం కోసం బ్యారేజీల్లో నీటిని ఎక్కువ కాలం నిల్వ చేశారని, గోదావరికి జలకళ అని ప్రచారం చేసుకున్నారని, బ్యారేజీల వైఫల్యానికి ఇదే ప్రధాన కారణమని నివేదిక చెప్పిందని మంత్రి ఉత్తమ్ వివరించారు. రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా కేసీఆర్ వ్యవహరించారని, వేలాది కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అయిందని నివేదిక తేల్చిందన్నారు. బ్యారేజీలు కుంగిన రోజు కూడా మేడిగడ్డలో 10.05 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు. బ్యారేజీ కట్టిన నాటినుంచి అసలు నిర్వహణ పనులు చేయలేదని కమిషన్ గుర్తించిందన్నారు.

కాళేశ్వరం నిర్మాణం కేసీఆర్ సొంత నిర్ణయమే

తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును కాదని, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడం కేసీఆర్ సొంత నిర్ణయమని, నిపుణుల కమిటీ నివేదికను మాజీ సీఎం, మాజీ మంత్రి పట్టించుకోలేదని కమిషన్ తన నివేదికలో స్పష్టం చేసిందని మంత్రి ఉత్తమ్ వివరించారు. బ్యారేజీల నిర్మాణ నిర్ణయం కేసీఆర్ ఒక్కడిదేనని నివేదిక తేల్చిందని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్ సిద్ధం కాక ముందే ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయం రూ.71,436 కోట్లు అని 2016 ఫిబ్రవరి 11వ తేదీన ప్రధానమంత్రికి కేసీఆర్ లేఖ రాశారని, ఆ తర్వాత అంచనా వ్యయం రూ.1.10 లక్షల కోట్లకు, తాజాగా రూ.1.47 లక్షల కోట్లకు చేరిందని నివేదికలో ఉందని మంత్రి తెలిపారు. అంచనాలను పదే పదే పెంచారని నివేదిక తప్పుబట్టినట్లు వివరించారు. బ్యారేజీలు పూర్తి కాకపోయినా అయినట్లు సర్టిఫికెట్లు ఇచ్చారని, బ్యాంకు గ్యారంటీలు కూడా రిలీజ్ చేశారని నివేదికలో ఆక్షేపించారని చెప్పారు.

అధిక వడ్డీ... తక్కువ వ్యవధి

తెలంగాణ ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చేలా ప్రాజెక్టు నిర్మాణం జరిగిందని, అధిక వడ్డీకి తక్కువ వ్యవధిలో బకాయిలు కట్టేలా రూ.84 వేల కోట్లను రుణంగా తెచ్చుకున్నారని కమిషన్ గుర్తించిందని, తెలంగాణ సమాజాన్ని తాకట్టు పెట్టి, నాన్ బ్యాంకింగ్ సంస్థల నుంచి అప్పులు తెచ్చుకున్నారని నివేదికలో పేర్కొన్నట్లు వివరించారు. తుమ్మిడి హెట్టి వద్ద బ్యారేజీ కట్టి ఉంటే రూ.38 వేల కోట్లతో పూర్తై.. 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందిందని, హేతుబద్ధత లేకుండా, సహేతుక కారణాలు లేకుండా ప్రాణహిత-చేవెళ్లను పక్కనపెట్టి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారని నివేదికలో పేర్కొన్నారని తెలిపారు.

డిజైనింగ్.. నిర్మాణం.. కూలింది.. వాళ్ల హయాంలోనే

మేడిగడ్డ డిజైన్, నిర్మాణం చేసింది వారేనని, కూలింది కూడా వారు అధికారంలో ఉండగానేనని మంత్రి ఉత్తమ్ గుర్తు చేశారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడే.. అంటే 2023 అక్టోబరు 25న దీనిపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్డీఎస్ఏ) నివేదిక ఇచ్చి.. మేడిగడ్డ బ్లాకు ఎందుకు కుంగిందో చెప్పిందని వివరించారు. ప్లానింగ్, డిజైన్, నిర్మాణం, క్వాలిటీ కంట్రోల్, ఓ అండ్‌ఎంలో లోపాలున్నాయని అప్పట్లోనే స్పష్టం చేసిందని తెలిపారు.


గచ్చిబౌలిలోని 'ఎలీ లిల్లీ' కార్యాలయంలో రేవంత్, శ్రీధర్‌బాబు

లైఫ్ సైన్సెస్‌లో మైలురాయిగా హైదరాబాద్

» అమెరికా ఫార్మా దిగ్గజం 'ఎలీ లిల్లీ' కార్యాలయాన్ని ప్రారంభించిన రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగంలో ఈరోజు చారిత్రక మైలురాయిగా నిలిచిపోతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అమెరికా దిగ్గజ ఫార్మా కంపెనీ 'ఎలీ లిల్లీ' కంపెనీ కార్యాలయాన్ని సోమవారం గచ్చిబౌలిలో ప్రారంభించిన అనంతరం సీఎం మాట్లాడారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల్లోనే తాము చేసిన ప్రయత్నాల ఫలితంగా ఈ రోజు హైదరాబాద్ ప్రపంచ స్థాయి జీసీసీ(గ్లోబల్ కేపబుల్ సెంటర్) రాజధానిగా ఎదిగిందని చెప్పారు. 'తెలంగాణ రైసింగ్ 2047' దిశగా.. ఇది తాము వేసిన మరో ముందడుగుగా అభివర్ణించారు. ఈ సందర్భంగా ఎలీ లిల్లీ సంస్థ ఉద్యోగులను హైదరాబాద్‌కు సాదరంగా ఆహ్వానిస్తున్నానని చెప్పారు. ఈ సంస్థను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడమంటే నగర ఘనతను ప్రపంచానికి చాటి చెప్పినట్లేనని, ఇందుకోసం శ్రమించిన మంత్రి శ్రీధర్ బాబు, జయేశ్ రంజన్ సహా ఇతర అధికారులను ఆయన అభినందించారు. 2 వేలకు పైగా ఫార్మా కంపెనీలతో.. దేశ లైఫ్ సైన్సెస్ రాజధానిగా హైదరాబాద్ ఇప్పటికే గుర్తింపు పొందిందని వెల్లడించారు. రాష్ట్రం నుంచే సుమారు 40 శాతం ఉత్పత్తులు వస్తున్నాయని సీఎం పేర్కొన్నారు. ప్రపంచంలో ఉత్పత్తి అవుతున్న ప్రతి 3 టీకాలలో ఒకటి హైదరాబాద్‌లో తయారవుతుండటం తెలంగాణకు గర్వకారణమన్నారు.

గల్వాన్ ఘటనలో చైనాకు క్లీన్‌చిట్ ఎందుకిచ్చారు: జైరాం రమేశ్

న్యూఢిల్లీ, ఆగస్టు 4: జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడానికి మోదీ ప్రభుత్వం ఏమైనా చేయగలదని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. ఐదేళ్ల క్రితం భారత్-చైనా సరిహద్దులో జరిగిన గల్వాన్ ఘటనలో ప్రధాని మోదీ.. చైనాకు క్లీన్‌చిట్ ఎందుకిచ్చారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ నేత జైరాం రమేశ్ సోమవారం ప్రశ్నించారు. గల్వాన్ ఘటన జరిగినప్పటి నుంచి దేశభక్తి కలిగిన ప్రతి భారతీయుడూ దీనిపై వివరణ కోరుతున్నాడని.. కానీ, మోదీ సర్కారు సమాధానం ఇవ్వడానికి బదులుగా 'తిరస్కరించు, దృష్టి మరల్చు, అబద్ధం చెప్పు, సమర్థించు..' (డీడీఎల్‌జే) విధానాన్ని అనుసరిస్తూ వస్తోందని జైరాం రమేశ్ విమర్శలు గుప్పించారు.మన సైనికులు వీరోచితంగా పోరాడి ప్రాణత్యాగం చేసిన నాలుగు రోజుల తర్వాత ప్రధాని మోదీ మాట్లాడుతూ.. మన భూభాగంలోకి ఎవరూ చొరబడలేదంటూ చైనాకు ఎందుకు క్లీన్‌చిట్ ఇచ్చారని జైరాం రమేశ్ 'ఎక్స్'లో ప్రశ్నించారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిందే

» ఈ విషయంలో అస్సలు వెనక్కి వెళ్లొద్దు

» క్యాబినెట్ భేటీలో మంత్రుల స్పష్టీకరణ

» నిబంధనల ప్రకారమే వెళ్లాలని నిర్ణయం

హైదరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలకు సంబంధించి ఘోష్ కమిషన్ సిఫారసుల మేరకు బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిందేనని క్యాబినెట్ సమావేశంలో మంత్రులు పట్టుబట్టారు. దీనిపై ఏమాత్రం వెనక్కి వెళ్లొద్దని సీఎం రేవంత్ రెడ్డికి స్పష్టం చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై చర్చించేందుకు సోమవారం రాష్ట్ర మంత్రివర్గం సచివాలయంలో సమావేశమైంది. కమిషన్ నివేదిక, సిఫారసులపై ఎలా ముందుకెళ్దామనే అంశంపై సుదీర్ఘంగా చర్చించింది. ఈ సందర్భంగా మంత్రుల అభిప్రాయాలను సీఎం రేవంత్ అడిగారు. దాంతో, కాళేశ్వరం వ్యవహారంపై కచ్చితంగా చర్యలు తీసుకోవాల్సిందేనని మంత్రులు చెప్పినట్టు సమాచారం. అయితే, ఈ విషయంలో రాజకీయంగా ఎటువంటి కక్షసాధింపు చర్యలకు వెళ్లకూడదని క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. నిబంధనల ప్రకారమే ముందుకెళ్లాలని మంత్రిమండలిలో అభిప్రాయపడ్డారు. ఇందుకోసం ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాలను ఏర్పాటు చేయాలని, అక్కడే మరింత చర్చ పెట్టాలని నిర్ణయించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలందరికీ 665 పేజీల నివేదికను అందించి, అనంతరం చర్చ పెట్టాలని, వారి నుంచి అభిప్రాయాలను తీసుకోవాలని నిర్ణయించారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత మరోసారి క్యాబినెట్ సమావేశం నిర్వహించి బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు.

ప్రజలకు వాస్తవాలు తెలియాలనే..

కాళేశ్వరం విషయంపై అసెంబ్లీలో చర్చ పెట్టడం ద్వారా ప్రజలకు కూడా అన్ని వివరాలూ తెలుస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. అసెంబ్లీలో చర్చ ద్వారా బీఆర్ఎస్‌తోపాటు బీజేపీ, ఎంఐఎం, సీపీఐ పార్టీల అభిప్రాయం ఏమిటన్నది తెలుస్తుందనే భావన క్యాబినెట్‌లో వ్యక్తమైనట్టు సమాచారం. నివేదికను సభలో పెట్టడం ద్వారా ప్రజలకు అన్ని విషయాలూ తెలుస్తాయని, ప్రజాస్వామ్యంలో వారే న్యాయ నిర్ణేతలు కాబట్టి.. సభ తర్వాత తీసుకోబోయే నిర్ణయం అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందనే అభిప్రాయం క్యాబినెట్‌లో వ్యక్తమైనట్టు సమాచారం.

క్యాబినెట్‌లో 'ఏఐ' వీడియో

కాళేశ్వరంపై జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కూడా పాలుపంచుకుంది. ఈ మేరకు ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలో ఉన్న వివరాలను ఇద్దరు మనుషులు మాట్లాడుకుంటున్నట్టుగా ఏఐ ఆధారంగా వీడియో రూపొందించారు. దానిని క్యాబినెట్‌లో ప్రదర్శించారు. ఒక మహిళ, ఒక పురుషుడు ఎదురెదురుగా ఉండి మాట్లాడుకున్న విధంగానే దీనిని రూపొందించారు. కాగా, నివేదికను మంత్రి ఉత్తమ్ ఇంగ్లిష్‌లో, సీఎస్ రామకృష్ణారావు తెలుగులో వివరించినట్టు తెలిసింది.

15 తర్వాత 3-4 రోజులు సభాపర్వం

జస్టిస్ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక, దాని ఆధారంగా బాధ్యులపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు ఆగస్టు 15 తర్వాత అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలిసింది. మూడు, నాలుగు రోజులు సభను నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. నివేదికను సభలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో సభ్యులకు వివరించే అవకాశం ఉందని తెలిసింది.

కాంగ్రెస్ అమ్ములపొదిలో కాళేశ్వరాస్త్రం!

» కేసీఆరే లక్ష్యంగా సంధించేందుకు సిద్ధం

» పంద్రాగస్టు తర్వాత జరిగే అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో దాడికి సన్నద్ధం


హైదరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అధికార కాంగ్రెస్ పార్టీ అమ్ములపొదిలో 'కాళేశ్వర' అస్త్రం చేరింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణ జరిపి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక అధికారపక్షానికి సరికొత్త ఆయుధంగా మారింది. మాజీ సీఎం కేసీఆరే లక్ష్యంగా ఈ అస్త్రాన్ని సంధించేందుకు కాంగ్రెస్ సర్కారు సన్నద్ధమవుతోంది. ఇప్పటికే అంతర్గత సమస్యలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న బీఆర్ఎస్ పార్టీని అసెంబ్లీ వేదికగా తూర్పారపట్టేందుకు సిద్ధమవుతోంది. పంద్రాగస్టు తర్వాత జరగనున్న అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో ప్రతిపక్ష పార్టీని గుక్కతిప్పుకోనివ్వకుండా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చించి ముందుకెళ్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో కొద్ది రోజుల్లో జరగనున్న వర్షాకాల సమావేశాలు రాష్ట్రంలో సరికొత్త రాజకీయ సమీకరణాలకు దారితీస్తాయా? అన్న చర్చ రాజకీయవర్గాల్లో జోరుగా నడుస్తోంది. అసెంబ్లీ నిబంధనల ప్రకారం సెప్టెంబరు 26లోపు వర్షాకాల సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. దీంతో పంద్రాగస్టు తర్వాత సమావేశాలు జరిగే అవకాశం ఉందని ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి. కాళేశ్వరం వైఫల్యానికి అప్పటి సీఎం కేసీఆరే ప్రధాన కారకుడని కమిషన్ తేల్చడంతో కాంగ్రెస్ సహజంగా ఆయనే టార్గెట్ కానున్నారు. అయితే, అసెంబ్లీలో జరుగుతున్న చర్చల్లో పాల్గొనాలంటూ కేసీఆర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి గతంలో పలుమార్లు కోరినా ఆయన సభకు రాలేదు. తాజాగా కమిషన్ నివేదికపై జరిగే చర్చలో పాల్గొని సమాధానం చెప్పక తప్పని పరిస్థితి కేసీఆర్‌కు ఏర్పడింది. ఆయన సమాధానం చెప్పకుంటే ప్రజల్లోకి కచ్చితంగా తప్పుడు సంకేతాలు వెళ్తాయని రాజకీయవిశ్లేషకులు అంటున్నారు.

అసలే సమస్యలు.. ఆపై నివేదిక..

ఎమ్మెల్సీ కవిత వ్యవహారం సహా పలు అంతర్గత సమస్యలతో సతమతమవుతున్న బీఆర్ఎస్‌కు కాళేశ్వరం నివేదిక రూపంలో కొత్త తలనొప్పి వచ్చినట్లయింది. ఈ నివేదిక ఏ పరిణామాలకు దారి తీస్తుందోనని ఆ పార్టీ నేతలు గుబులు పడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన కొద్ది నెలల్లోనే పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గూటికి చేరారు. లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటూ రాలేదు. సిటింగ్ స్థానమైన కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఖాతాలో చేరింది. ఎమ్మెల్సీ కవిత తరచూ చేస్తున్న వివాదాస్పద వ్యాఖ్యలు ఆ పార్టీలో అంతర్గత సమస్యలను ఎత్తిచూపుతున్నాయి. ఈ తరుణంలో జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ఆ పార్టీపై తీవ్ర ప్రభావమే చూపుతుందన్న చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తోంది. అసెంబ్లీ సమావేశాల్లో కమిషన్ నివేదికపై చర్చ అనంతరం.. చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్న ఆలోచనలోనూ ప్రభుత్వం ఉందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అదే జరిగితే పార్టీ ముఖ్యనాయకుల అరెస్టులూ జరిగే అవకాశం ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ పరిణామాలు గులాబీ పార్టీపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందంటున్నారు. మరోవైపు బీజేపీ ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంటుందన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. బీఆర్ఎస్‌లో ప్రస్తుత అనిశ్చిత పరిస్థితుల వల్లే మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, కొండబాల కోటేశ్వర్‌రావు వంటి వారు 'కారు' దిగేశారని.. కాళేశ్వరం వైఫల్యంపై చట్టపరమైన చర్యలు ప్రారంభమైతే మరికొందరు నాయకులు ఇదే బాటలో నడుస్తారంటున్నారు. పార్టీ ఎమ్మెల్యేల్లో రాజకీయ భవిష్యత్తు పట్ల అభద్రతాభావం ఏర్పడితే మరిన్ని ఫిరాయింపులు ఉండొచ్చని పేర్కొంటున్నారు.

స్థానిక ఎన్నికలపైనా..!

ఎన్నికల్లో వైఫల్యాలతో సతమతమవుతున్న బీఆర్ఎస్.. స్థానిక ఎన్నికలపైనే ఆశలు పెట్టుకుని ఉంది. వాటిలోనూ విఫలమైతే ఆ పార్టీ మనుగడపైనే తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. సహజంగా స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకే మొగ్గు ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో కాళేశ్వరం అవకతవకలపై ప్రభుత్వం చట్టపరంగా చర్యలు తీసుకోవడం ప్రారంభిస్తే బీఆర్ఎస్‌లో ఏర్పడే గందరగోళం.. స్థానిక ఎన్నికలపై మరింత ప్రభావం చూపొచ్చని విశ్లేషకులు అంటున్నారు.




మెదడు కరిగించి, రక్తాన్ని రంగరించి కాళేశ్వరం ప్రాజెక్టు కట్టానన్న మాజీ సీఎం కేసీఆర్ మాటలు మరోవిధంగా నిజమేనని తేలిపోయింది. ప్రాజెక్టు కట్టుడు నుంచి కూలుడు దాకా బాధ్యత అంతా కేసీఆర్‌దేనని.. తన బుర్రలో పుట్టిన ఆలోచనతో ఇష్టానికి నిర్ణయం తీసుకుని, తన ఇష్టం వచ్చినట్టు కాళేశ్వరం బ్యారేజీలు కట్టించారని అధికారికంగా స్పష్టమైంది. తుమ్మిడి హెట్టి వద్ద నీళ్లు లేవంటూ ప్రాజెక్టును మేడిగడ్డకు మార్చడం మొదలు.. కాళేశ్వరం బ్యారేజీలు విఫలమవడం దాకా బాధ్యత అంతా కేసీఆర్‌దేనని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తేల్చిచెప్పింది.

ప్రాజెక్టు నిర్మాణంలో ప్రతి చిన్న అంశం కూడా కేసీఆర్ కనుసన్నల్లోనే జరిగిందని నివేదిక స్పష్టం చేసింది. ఇది ఎంత అరాచకంగా ఉందంటే.. ప్రతిపాదించిన బ్యారేజీ పొడవు కన్నా నది వెడల్పు ఎక్కువగా ఉన్నట్టు నిర్మాణ సమయంలో గుర్తించి, అదనంగా ఒక బ్లాక్ నిర్మించారని బయటపెట్టింది. కట్టకూడని చోట మేడిగడ్డ బ్యారేజీ కట్టారని, రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ నివేదికను తొక్కిపెట్టి మరీ పనులు చేయించారని స్పష్టంగా వివరించింది. నిర్మాణ సంస్థకు లబ్ధి చేకూర్చేందుకు డిజైన్లలో, పనుల్లో ఇష్టానుసారం మార్పులు చేసి, అంచనాలను పెంచేశారనీ తేల్చిచెప్పింది.

కేసీఆర్ కళ్లలో ఆనందం కోసం హరీశ్‌రావు, అధికారులు తానా అంటే తందానా అన్నట్టు వ్యవహరించారని.. నాటి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ అన్నీ చూస్తూ నిశ్శబ్ద నేరస్తుడిగా ఉండిపోయారని వ్యాఖ్యానించింది. బ్యారేజీల వైఫల్యానికి కారకులైన ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇంజనీర్లు, నిర్మాణ సంస్థలపై చర్యలు తీసుకోవాలని సూచించింది. అధికారుల కమిటీ జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికలోని ప్రధాన అంశాలను క్రోడీకరించి మంత్రివర్గానికి సమర్పించిన ప్రజెంటేషన్‌లో వెల్లడించింది. అందులోని పది కీలక అంశాలను పరిశీలిస్తే...

కట్టుడు నుంచి కూలుడు దాకా



సర్వం కేసీఆరే!

సీఎంలా కాకుండా ఇంజనీర్‌లా వ్యవహారం.. తందానా అన్న నాటి మంత్రి హరీశ్, అధికారులు

నిశ్శబ్ద నేరస్తుడు నాటి ఆర్థిక మంత్రి ఈటల.. ప్రతి విషయం కేసీఆరే పర్యవేక్షణలోనే..


నిపుణుల కమిటీ నివేదికను తొక్కిపెట్టారు.. కేబినెట్ ఆమోదం లేకుండానే ప్రాజెక్టు


ఇష్టానుసారం అంచనాల పెంపు.. నామినేషన్‌పై ఇవ్వడంతో కాంట్రాక్టు సంస్థలకు లబ్ధి

జస్టిస్ పీసీ ఘోష్ నివేదిక సారాంశాన్ని క్యాబినెట్‌కు అందజేసిన అధికారుల కమిటీ

1 అంతా ఆయనే!

మేడిగడ్డ దగ్గర బ్యారేజీ నిర్మాణం కేవలం కేసీఆర్ మదిలో పుట్టిన ఆలోచన. దాన్ని ఇష్టానుసారం అమలుచేయడం, తానే ఇంజనీర్‌లా వ్యవహరించడం, ప్లానింగ్‌లో, నిర్మాణంలో లోపాలు, అవకతవకలు, నిబంధనల ఉల్లంఘన వల్లే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు విఫలమయ్యాయి. దీనికి ప్రత్యక్ష, పరోక్ష కారకుడు కేసీఆరే. మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మాణం ఏ మాత్రం శ్రేయస్కరం కాదన్న నిపుణుల కమిటీ సిఫారసును కేసీఆర్ కావాలనే పక్కనపెట్టేశారు. కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) డీపీఆర్‌ను పరిశీలించక ముందే పనులు ప్రారంభించారు. నీటి లభ్యత ఉందనే సాకుతో కేసీఆర్ తీసుకున్న నిర్ణయం మొత్తం బ్యారేజీలను ప్రమాదంలోకి నెట్టేసింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో భాగంగా బ్యారేజీల నిర్మాణం జరగలేదు. ప్రాజెక్టు నిర్మాణ నిర్ణయం, బ్యారేజీలకు పరిపాలన అనుమతి నిర్ణయం కేసీఆర్ ఒక్కరిదే. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదంటూ మేడిగడ్డకు తరలింపులో సదుద్దేశంతో తీసుకున్న నిర్ణయం కాదు. ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకంలోని తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత ఉన్నా లేనట్టు కేసీఆర్ తప్పుడు ప్రచారం చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత ఉందని కేంద్ర జల వనరుల సంఘం క్లియరెన్స్ ఇచ్చింది.బ్యారేజీలు విఫలమవడానికి బ్యారేజీల్లో నీటి నిల్వ కూడా ఒక కారణం. కేసీఆర్ ఆదేశాలతోనే బ్యారేజీల్లో నిండుగా నీటిని నిల్వ చేశారు. కేసీఆర్ ప్రభుత్వాధినేతగా కాకుండా ఓ అధికారిలా వ్యవహరించారు.





2 మామ కళ్లలో ఆనందం కోసం!

ముఖ్యమంత్రి కేసీఆర్ కోరికను నెరవేర్చేందుకు, ఆయన ఆలోచనలను అమలు చేసేందుకే నాటి సాగునీటి శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రయత్నించారు. మేడిగడ్డ వద్దే బ్యారేజీ కట్టాలని ఒక ఇంజనీర్‌లా కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్నియథాతథంగా అమలు చేశారు. రిటైర్డ్ ఇంజనీర్లతో కూడిన నిపుణుల కమిటీ నివేదికను తొక్కిపెట్టి, మేడిగడ్డకు మార్గం సుగమం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఆదేశాలు జారీ చేశారు. సొంత నిర్ణయాలూ తీసుకున్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో షీట్‌పైల్స్ బదులుగా సీకెంట్ పైల్స్‌ను వినియోగించాలని 2017 జనవరి 9వ తేదీన హరీశ్‌రావు ఇచ్చిన ఆదేశాలే దీనికి సాక్ష్యం. 2015 ఏప్రిల్ 7న ప్రభుత్వానికి నిపుణుల కమిటీ నివేదిక అంశంపై హరీశ్‌రావు కమిషన్ ముందు వాస్తవాలు చెప్పలేదు. ఇక తుమ్మిడిహెట్టి బ్యారేజీకి హైడ్రాలజీ క్లియరెన్స్ ఇచ్చినట్టు 2015 మార్చి 13న నాటి కేంద్ర జలశక్తి శాఖ మంత్రి ఉమాభారతి లేఖ రాస్తే.. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత అంచనాల మేరకు లేదని, దీనిపై మళ్లీ సమీక్షించాలంటూ హరీశ్‌రావు 2015 మార్చి 20న కేంద్రానికిలేఖ రాశారు. ఈ కారణంలో నిజాయితీ, చిత్తశుద్ధి లేవు.

ఈటల రాజేందర్.. నిశ్శబ్ద నేరస్తుడు 3



నాటి ముఖ్యమంత్రి, నీటి పారుదల శాఖ మంత్రులు సొంత నిర్ణయాలు తీసుకుని వాటినే అధికారిక నిర్ణయాలుగా అమలు చేస్తుంటే.. ఆర్థిక శాఖ మంత్రిగా అడ్డుకునే బాధ్యతను ఈటల రాజేందర్ నిర్వర్తించలేదు. రాష్ట్ర ఖజానాకు భారీగా నష్టం వాటిల్లుతుందని తెలిసినా ఉదాసీనంగా వ్యవహరించారు. ఆయన నిశ్శబ్ద నేరస్తుడు. ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థిక నిర్ణయాలపై తనకు సమాచారం లేదని బాధ్యతారహితంగా కమిషన్ ముందు చెప్పారు. ఇక కేబినెట్ సబ్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగానే మూడు బ్యారేజీల నిర్మాణం చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందంటూ ఈటల తప్పుడు వాంగ్మూలం ఇచ్చారు.

4 నమ్మకాన్ని వమ్ము చేశారు




ఎస్కే జోషి, స్మితా సబర్వాల్

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్ణయాల్లో నాటి సీఎం కేసీఆర్ తీసుకున్న సొంత నిర్ణయాలన్నింటికీ అధికారులు తందానా అన్నారు. ఈ అవకతవకల్లో సీనియర్ ఐఏఎస్ అధికారుల పాత్రతోపాటు మొత్తం 18 మంది అధికారుల బాధ్యత ఉంది. వీరిలో సీఎస్‌గా పనిచేసిన ఎస్కే జోషి కూడా ఉన్నారు. ఆయన అప్పట్లో నీటిపారుదల శాఖకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్ (కేఐపీసీఎల్) చైర్మన్‌గా వ్యవహరించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించడంతోపాటు కాంట్రాక్టర్లతో కుమ్మక్కయ్యారు. అధికారుల స్థాయిలో తీవ్రమైన లోటుపాట్లకు ఈయనే బాధ్యుడు. ముఖ్యమంత్రి కార్యదర్శిగా ఉన్న స్మితా సబర్వాల్.. క్యాబినెట్ అనుమతులకు విరుద్ధంగా వ్యవహరించారు. ఈఎన్‌సీ మురళీధర్ తన అధికార పరిధిని మించి ప్రవర్తించారు. సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీవో) సభ్యులు చీఫ్ ఇంజనీర్లు టి.శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, ఎస్ఈ చంద్రశేఖర్, ఈఈ బసవరాజు తప్పుడు డిజైన్లు, డ్రాయింగ్‌లు సమర్పించారు. రాష్ట్ర నమ్మకాన్ని కుట్రపూరితంగా వమ్ము చేశారు. విధుల్లో నిర్లక్ష్యం చూపిన చీఫ్ ఇంజనీర్లు జె.శ్రీదేవి, జి.రమేష్, ఆశీర్వాదం కూడా బాధ్యులే. ప్రాజెక్టు పూర్తయినట్టు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు జారీచేసిన ఈఈ, ఎస్ఈలు చర్యలకు అర్హులు. క్షేత్రస్థాయి నిర్మాణాలపై తప్పుడు సమాచారం ఇచ్చిన ఈఎన్‌సీ జి.అనిల్‌కుమార్, బి.నాగేందర్ రావు, ఎస్‌డీఎస్‌ఏ చీఫ్ ఇంజనీర్ టి.ప్రమీల, హైడ్రాలజీ చీఫ్ ఇంజనీర్ శంకర్ నాయక్, సీడీవో చీఫ్ ఇంజనీర్లు టి.శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, రామగుండం ఈఈ సర్దార్ ఓంకార్‌సింగ్, పీసీఎస్ఎస్ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ బి.హరిరామ్ బాధ్యులే.

వివాదం విచారణ

2016 ఆగస్టు 26
మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ ఒప్పందం

2019 జూన్ 21
కాళేశ్వరం ప్రాజెక్టు ఆవిష్కరణ

2023 అక్టోబరు 21
మేడిగడ్డ పిల్లర్ నంబరు 20 కుంగినట్లు వెల్లడి

2023 అక్టోబరు 25
పరిశీలించిన ఎన్‌డీఎస్ఏ బృందం, ప్రాజెక్టు నిర్వహణ ఈఎన్‌సీ, ఎల్అండ్‌టీ సంస్థతో సమావేశం

2023 నవంబరు 1
పిల్లర్ కుంగుబాటుకు గల కారణాలు తెలుపుతూ నివేదిక

2023 నవంబరు 30
తెలంగాణ శాసన సభ ఎన్నికలు

2024 ఫిబ్రవరి 13
మూడు బ్యారేజీల నిర్మాణ లోపాల గురించి అధ్యయనం చేసి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఎన్‌డీఎస్ఏ ఛైర్మన్‌కు నూతన ప్రభుత్వ విజ్ఞప్తి

2024 మార్చి 2
నిపుణుల కమిటీని నియమిస్తూ ఎన్‌డీఎస్ఏ ఛైర్మన్ నిర్ణయం

మార్చి 7, 8
3 బ్యారేజీలను పరిశీలించిన నిపుణుల కమిటీ

మార్చి 14
సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలో కాళేశ్వరం అక్రమాలపై విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ నిర్ణయం.

2025 జూలై 31
ప్రభుత్వానికి నివేదిక అందజేసిన కమిషన్

విచారణ జరిగిన తీరు..

కాళేశ్వరం ప్రాజెక్టుపై పలు సంస్థలు ఇచ్చిన నివేదికలను విచారణ కమిషన్ సేకరించింది. అందులో ఎన్‌డీఎస్ఏ నివేదిక, కాగ్ రిపోర్టు, విజిలెన్స్ నివేదిక, నీటి పారుదల శాఖ నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక, క్యాబినెట్ తీర్మానాలు, ప్రభుత్వం ఇచ్చిన ఇతర పత్రాలు ఉన్నాయి. క్షేత్ర స్థాయి పరిశీలన జరపడంతోపాటు నిపుణుల కమిటీ, ఇంజనీర్లు, గుత్తేదారు సంస్థల ప్రతినిధులతో సమావేశాలు జరిపింది. మాజీ ముఖ్యమంత్రి, ఆనాటి ఆర్థిక, సాగునీటి మంత్రులు, కీలక విభాగాల అధిపతులను విచారించి వివరాలు సేకరించింది.



5 అంచనాలు పెంచి.. అనుచిత లబ్ధి..

ప్రాజెక్టు నిర్మాణంలో అత్యంత కీలకంగా భావించే గైడ్‌బండ్, ఫ్లడ్ బ్యాంక్ వంటి కీలక పనులను కూడా ప్రాజెక్టులో కాకుండా అదనపు పనులుగా విభజించారు. వీటిని నామినేషన్ పద్ధతిలో నిర్మాణ సంస్థలకు అప్పగించారు. 2017 డిసెంబరు 9వ తేదీన కేసీఆర్ సమీక్షా సమావేశం నిర్వహించి, ఒప్పందంలో లేని అదనపు పనులను నేరుగా అప్పగించారు. కాంట్రాక్టర్‌కు అనుచిత లబ్ధి చేకూర్చేవిధంగా వ్యవహరించారు. సీఎం మౌఖిక ఆదేశాలతో కాఫర్ డ్యామ్, గైడ్ బండ్ నిర్మాణ పనులను అప్పగించడం వల్ల ప్రభుత్వంపై రూ.369 కోట్ల అదనపు భారం పడింది. అవకతవకలకు పక్కా ఆధారమిది. ఇక కొన్ని పనులకు సంబంధించి సవరణ అంచనాలకు ముందే పరిపాలన అనుమతులు ఇచ్చేసి.. తర్వాత మంత్రివర్గం ఆమోదం తీసుకున్నారు. ప్రాజెక్టు డిజైన్‌లలో మార్పు, సిబ్బంది నివాస గృహాల నిర్మాణం, గెస్ట్‌హౌస్‌ల నిర్మాణం, కరకట్టల నిర్మాణం అదనపు పనుల్లో చేరడంతో నిర్మాణ అంచనాలు విపరీతంగా పెరిగాయి. నిర్మాణ సంస్థలకు అనుచిత లబ్ధిని చేకూర్చడానికే అంచనాలను సవరించారు.

6 నిబంధనలను పట్టించుకున్నవారే లేరు

- కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఇష్టారాజ్యంగా నిబంధనలను ఉల్లంఘించారు. పనులను టర్న్‌కీ పద్ధతిలో కేటాయించాలని సీడబ్ల్యూసీ చెప్పినా.. గంపగుత్తగా కాంట్రాక్టు సంస్థలకు అప్పగించారు.
- కాళేశ్వరం కార్పొరేషన్ ఏ లక్ష్యాల కోసం ఏర్పడిందో ఆ లక్ష్యాల కోసం పనిచేయలేదు. కేవలం అప్పులు తేవడానికి, చెక్కులు ఇవ్వడానికే పరిమితమైంది.
- అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణ స్థలాల మార్పు, బ్యారేజీల పొడవు, ఫ్లడ్ బ్యాంకుల నిర్మాణం, డిజైన్‌ల మార్పులలో ఎలాంటి సహేతుకత కనిపించలేదు.



- 2016 జూలై/ఆగస్టులో ఒప్పందాలు ముగిశాక.. వ్యాప్కోస్‌తో సంప్రదించకుండానే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణ స్థలాలు మార్చాలని హైపవర్ కమిటీ 2016 అక్టోబరు 22వ తేదీన నిర్ణయం తీసుకుంది. వ్యాప్కోస్ ప్రతిపాదించిన చోట కాకుండా మరో చోటికి నిర్మాణ స్థలాలను మార్చారు.
- ప్రభుత్వం ఇచ్చిన డిజైన్లతోనే బ్యారేజీ నిర్మించామన్న కాంట్రాక్టు సంస్థ ఎల్ అండ్ టీ వాదన సరికాదు. ప్రతి దశలో డిజైన్లను ఎల్ అండ్ టీ నిర్మాణ సంస్థ పరిశీలించింది. ఎల్ అండ్ టీ సొంత టెక్నాలజీతో కూడిన విభాగాలు పర్యవేక్షించాయి కూడా.
- బ్యారేజీల నిర్వహణ (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) పనులు చేయనేలేదు. అసలు దీనికి సంబంధించి మ్యానువల్ కూడా రూపొందించలేదు. బ్యారేజీల్లో నీటిని ఖాళీ చేసి నిర్వహణ పనులు చేయాలని నిర్మాణ సంస్థలు కోరినా అధికారులు పట్టించుకోలేదు. రాష్ట్ర జలాశయాల భద్రత సంస్థ తన బాధ్యతను నిర్వర్తించడంలో విఫలమైంది.
- బ్యారేజీల నిర్మాణం పనులు పూర్తికాకుండానే పూర్తయినట్టు.. అది కూడా అవి దెబ్బతిన్నాక మేడిగడ్డ (ఎల్ అండ్ టీకి), అన్నారం (అఫ్కాన్స్), సుందిళ్ల (నవయుగ) నిర్మాణ సంస్థలకు కంప్లీషన్ సర్టిఫికెట్లు ఇచ్చారు. బ్యాంకు గ్యారంటీలు కూడా విడుదల చేశారు.

7 కాంట్రాక్టు సంస్థల ద్రోహం



కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లోటుపాట్ల బాధ్యత కాంట్రాక్టు సంస్థలదే. కానీ సంస్థలు కుదుర్చుకున్న ఒప్పందానికి విరుద్ధంగా వ్యవహరించాయి. భారీగా ఆర్థిక ప్రయోజనాలు పొందేందుకు ద్రోహానికి పాల్పడ్డాయి. ప్రాజెక్టు నిర్మాణం పూర్తికాక ముందే పూర్తయినట్టు.. పనులు పూర్తయినట్టు చెప్పి, సర్టిఫికెట్లు పొందాయి. అసంపూర్తిగా వదిలేసిన పనులు, లోపభూయిష్టంగా చేసిన పనులను ప్రభుత్వ నిబంధనలు, ఒప్పందం ప్రకారం నిర్మాణ సంస్థలే పూర్తిచేయాలి. లేనిపక్షంలో ప్రభుత్వమే పూర్తి చేసి ఆ వ్యయాన్ని సంస్థల నుంచి వసూలు చేయాలి. లోపభూయిష్టంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ బాధ్యత సంబంధిత కంపెనీలదే. డిజైన్ ప్రకారమే ప్రాజెక్టు నిర్మాణం చేపట్టామన్న ఎల్‌అండ్‌టీ వాంగ్మూలం ఆమోదయోగ్యం కాదు. సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) రూపొందించిన డిజైన్లలో ఎల్‌అండ్‌టీ పాత్ర ఉందన్న విషయం ఈ-మెయిళ్లను పరిశీలిస్తే స్పష్టమవుతుంది. పలు అంశాల్లో కాంట్రాక్టు సంస్థలు, అధికారులు కుమ్మక్కయ్యారన్నది స్పష్టంగా తెలుస్తోంది. రెండోసారి అడ్డగోలుగా అంచనాల పెంపునకు కారకులైన ఇంజనీర్లు, అనుమతించిన రాష్ట్రస్థాయి స్టాండింగ్ కమిటీ సభ్యుల నుంచి అదనపు మొత్తాన్ని వసూలుచేయాలి.



సుందిళ్ల బ్యారేజీ

37,228 నమూనాలకు.. 7,498 మాత్రమే పరీక్ష 8

బ్యారేజీల డిజైన్‌లతోపాటు నిర్మాణ నాణ్యతలో లోపాలున్నాయి. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణ ప్రదేశాలు మార్చినప్పుడు కీలకమైన బ్లాక్ వాటర్ అధ్యయనాలు, టెయిల్ వాటర్ రేటింగ్ కర్వ్‌లు, జీ-డీ కర్వ్‌లు, జియో ఫిజికల్ పరీక్షలు చేయలేదు. తగిన క్షేత్రస్థాయి అధ్యయనాలు లేకుండానే డిజైన్లను సిద్ధం చేశారు. మేడిగడ్డ బ్యారేజీ ఎగువ, దిగువ భాగంలో మోనోలిథిక్ డిజైన్‌కు విరుద్ధంగా ఆర్‌సీసీ కటాఫ్‌లు డిజైన్ చేశారు. రాఫ్ట్ స్లాబులో ప్రమాణాలు పాటించలేదు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో లోపాలున్నాయి. ప్లింత్ స్లాబ్, జాయింట్ నిర్మాణంలో ప్రమాణాలు పాటించలేదు. వరద ప్రవాహ వేగాన్ని సరిగా అంచనా వేయలేదు. దీంతో పనులన్నీ దెబ్బతిన్నాయి. సీకెంట్ పైల్స్ అమరికలో, కాంక్రీట్ నాణ్యతలోనూ లోపాలున్నాయి. మొత్తం 37,228 నమూనాలు పరీక్షించాల్సి ఉండగా.. కేవలం 7,498 నమూనాలే పరిశీలించారు. ఇసుక, సిమెంట్ ఏ నిష్పత్తిలో వినియోగించారనే దానిపై స్పష్టత లేదు. అన్నారంలో ప్లింత్‌స్లాబును మోనోలిథికల్ విధానంలో కట్టలేదు. 2019లోనే బ్యారేజీల్లో లోపాలు బయటపడ్డాయి. వాటిని సకాలంలో సరిచేయలేదు.

మంత్రివర్గం ఊసేదీ? 9

2016 మార్చి 1న మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం కోసం రూ.2,591 కోట్ల అంచనాతో జీవో నం.231ను జారీ చేశారు. దానికి మంత్రివర్గ ఆమోదం లేదు. ఈ నిర్ణయం మాజీ సీఎం కేసీఆర్, అప్పటి మంత్రి టి.హరీశ్‌రావు మాత్రమే తీసుకున్నారు. మంత్రివర్గంలో చర్చించి, నిర్ణయం తీసుకోకుండా జీవో జారీ చేయాల్సినంత అత్యవసర నిర్ణయం కూడా కాదు. బ్యారేజీలకు పరిపాలన అనుమతి నిచ్చే నోట్‌ఫైల్స్‌పై నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి 2016 ఫిబ్రవరి 26న సంతకం పెడితే... అదే రోజు అప్పటి మంత్రి, సీఎం సంతకం చేశారు. ఇది నిబంధనలకు విరుద్ధం.



జస్టిస్ పీసీ ఘోష్

అంతిమ లబ్ధిదారు తేలాలి 10

కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయం ప్రారంభంలో రూ. 38,500 కోట్లుగా ఉంది. నాటి సీఎం కేసీఆర్ లేఖ ఆధారంగా 2016లో 71,436 కోట్లకు పెంచారు. తర్వాత 2022 మార్చిలో రెండోసారి అంచనా వ్యయాన్ని 1,10,248 కోట్లకు పెంచారు. ప్రాజెక్టు కోసం ప్రభుత్వ గ్యారంటీపై కాళేశ్వరం కార్పొరేషన్ 87,449 కోట్లు రుణంగా తీసుకుంది. ఈ ప్రాజెక్టు అంతా ఆర్థిక అవకతవకలు, భారీగా నిబంధనల ఉల్లంఘన ఉన్నాయి. భారీగా ప్రజాధనం వృథా అయింది.కాంట్రాక్టు సంస్థలు సమర్పించిన బిల్లులు, ధరల సర్దుబాటుపై లోతైన విచారణ చేయాలి. బడ్జెటేతర అప్పులపై లోతుగా, నిశితంగా, నిష్పక్షపాతంగా అధ్యయనం చేయాలి. మొత్తంగా కాళేశ్వరం ప్రాజెక్టు కోసం తెచ్చిన అప్పులపై ఆర్థికపరమైన విచారణ జరగాలి. ఈ వ్యవహారంలో అంతిమ లబ్ధిదారు ఎవరో తేలాలి.

ఆదివాసీ ఉపాధ్యాయుడికి అరుదైన గౌరవం

- 15న రాష్ట్రపతి భవన్‌లో విందుకు ఆహ్వానం



ఆదిలాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం గౌరవపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు తొడసం కైలాస్‌కు అరుదైన గౌరవందక్కింది. ఈ నెల 15న స్వాతంత్ర్య వేడుకల వేళ ఢిల్లీలో రాష్ట్రపతి ఇవ్వనున్న విందులో పాల్గొనాలని ఆయనకు ఆహ్వానమందింది. ఈ అవకాశాన్ని ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని కైలాస్ సంతోషం వ్యక్తం చేశారు. సాంఘిక శాస్త్రం బోధించే ఆదివాసీ ఉపాధ్యాయుడు కైలాస్ స్వగ్రామం మావల మండలం వాఘాపూర్. ఆయన మహాభారతాన్ని 'పండోన్న మహాభారతం' కథ పేరుతో గోండుభాషలోకి అనువదించారు. 119వ మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ.. కైలాస్ సేవలను ప్రశంసించారు.

రేపు ఎల్టీ పోస్టుల మెరిట్ జాబితా విడుదల

- స్టాఫ్‌నర్సుల తుది జాబితా అక్టోబరులో: వైద్య ఆరోగ్యశాఖ
- వైద్యశాఖలో 6,269 పోస్టుల ఫలితాలపై స్పష్టత

హైదరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ల్యాబ్ టెక్నీషియన్ (ఎల్టీ) పోస్టుల ప్రొవిజనల్ మెరిట్ జాబితాను మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు బుధవారం విడుదల చేయనుందని వైద్య ఆరోగ్యశాఖ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. మెరిట్ జాబితా విడుదల కాగానే అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని పేర్కొంది. గతేడాది 1,284 ఎల్టీ పోస్టుల భర్తీకి రాత పరీక్ష నిర్వహించారు. అయితే ధ్రువపత్రాల ఆధారంగా అభ్యర్థులకిచ్చిన వెయిటేజీపై కొన్ని అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. కొన్నిచోట్ల నకిలీ ధ్రువపత్రాలు పెట్టినట్లు మెడికల్ బోర్డు దృష్టికొచ్చింది. దాంతో వెయిటేజీ సర్టిఫికేట్స్ అన్నింటిని జిల్లాలకు పంపి డీఎంహెచ్‌వోలతో అవి సరైనవేనని ధ్రువీకరించుకోవడంతో తీవ్ర జాప్యమైంది. దీనిపై అభ్యర్థులు ఆందోళనకు దిగారు. మెడికల్ బోర్డు ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆ పోస్టుల తుది జాబితా విడుదలపై వైద్యశాఖ ప్రకటన చేసింది. అలాగే ఈ వారాంతంలో 2,322 స్టాఫ్‌నర్స్ పోస్టులకు సంబంధించిన మెరిట్ జాబితాను కూడా మెడికల్ బోర్డు విడుదల చేయనుందని వైద్యశాఖ వెల్లడించింది. ఆ జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపింది. సెలక్షన్ జాబితాను అక్టోబరులో విడుదల చేస్తామని ప్రకటించింది. అలాగే 1931 మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫీమేల్) పోస్టుల మెరిట్ జాబితాను ఈ నెల 20న విడుదల చేస్తామని, వాటిపై ఆ రోజు నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తామని వెల్లడించింది. సెలక్షన్ తుది జాబితాను నవంబరులో విడుదల చేస్తామని ప్రకటించింది. అలాగే 732 ఫార్మసిస్టు పోస్టుల విషయంలో హైకోర్టులో కేసు ఉన్న నేపథ్యంలో అది ఒక కొలిక్కి రాగానే తుది జాబితాను విడుదల చేస్తామని ప్రకటించింది. వైద్యశాఖ తాజా ప్రకటనతో ఆ శాఖలో 6,269 పోస్టుల ఫలితాలపై స్పష్టత ఇచ్చినట్లయింది.

ఒక్క నేరానికి బహుళ కేసులు చెల్లవ్

- కౌశిక్ రెడ్డిపై కేసుల విచారణ మీద హైకోర్టు స్టే

హైదరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డిని అగౌరవపర్చడంతోపాటు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై నమోదైన బహుళ కేసుల విచారణపై హైకోర్టు స్టే విధించింది. ఒక ఎమ్మెల్యేగా.. సీఎంను అవమానించేలా వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ పార్టీ నేతలు చేసిన ఫిర్యాదులపై వివిధ పోలీసు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఒక నేరానికి బహుళ కేసులు నమోదు చేయడం చెల్లదని కౌశిక్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ కె.లక్ష్మణ్ సారథ్యంలోని బెంచ్.. ఒకే నేరానికి బహుళ కేసులు నమోదు చేయడం చెల్లదని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఆయా కేసుల్లో తదుపరి చర్యలు చేపట్టకుండా స్టే విధించింది.. ఈ మేరకు వివరణ ఇవ్వాలని పోలీసులకు నోటీసులు జారీ చేసింది. కేసు తదుపరి విచారణను 19కి వాయిదా వేసింది.

రాజీవ్ స్వగృహ ప్లాట్లకు భారీ స్పందన

- కుర్మల్‌గూడలో 15 ప్లాట్లకు రూ. 9.6 కోట్లు
- నేడు, రేపు కొనసాగనున్న వేలం

హైదరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఓపెన్ ప్లాట్ల వేలానికి కొనుగోలుదారుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ ప్లాట్ల అమ్మకాలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు రంగారెడ్డి జిల్లా కుర్మల్‌గూడలో (శ్రీశైలం హైవే, తుక్కుగుడ సమీపంలో) 15 ప్లాట్లు అమ్ముడయ్యాయి. మధ్యతరగతి వారికి అనువైన 260-300 చదరపు గజాల విస్తీర్ణంలోని ఈ ప్లాట్లను సొంతం చేసుకోవడానికి చాలామంది ఆసక్తి చూపారు. ప్రభుత్వం చదరపు గజానికి కనీస ధర రూ.20 వేలు నిర్ణయించగా, వేలంలో అత్యధికంగా చదరపు గజానికి రూ. 28,500 పలికింది. ఈ వేలం పాటలో 34 మంది పాల్గొనగా, రూ. 9.6 కోట్ల ఆదాయం వచ్చినట్లు రాజీవ్ స్వగృహ ఎండీ వీపీ గౌతమ్ తెలిపారు. మంగళవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బహదూర్‌పల్లిలోని 68 ఓపెన్ ప్లాట్లు, బుధవారం రంగారెడ్డి జిల్లా తొర్రూర్‌లోని 200-500 చదరపు గజాల విస్తీర్ణంలోని ఓపెన్ ప్లాట్లకు బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు.

కుండపోత వర్షం.. హైదరాబాద్ ఆగమాగం

(మొదటిపేజీ తరువాయి)

మేఘాల ప్రభావంతో హైదరాబాద్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల పరిధిలో సోమవారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ.. కొన్ని ప్రాంతాల్లో రాత్రి 8 గంటల వరకూ వర్షం దంచి కొట్టింది. దీంతో వరద నీటితో రహదారులన్నీ చెరువులను తలపించాయి. పాఠశాలలు, కళాశాలలు, వివిధ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు ఇళ్లకు వెళ్లే సమయంలో కురిసిన వర్షంతో వాహనాలన్నీ వరద నీటిలో చిక్కుకుని ప్రజలు ఇళ్లకు చేరడానికి నానా ఇబ్బందులు పడ్డారు. ఐటీ కారిడార్ పరిధిలోని సంస్థల ఉద్యోగులు రాత్రి ఏడు గంటల వరకూ ఆఫీసుల్లోనే ఉండిపోయారు. ఖాజాగూడలోని ల్యాంకో హిల్స్ సమీపాన తాటిచెట్టుపై పిడుగు పడటంతో చుట్టు పక్కల ప్రజలు భయంతో పరుగులు తీశారు. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కుత్బుల్లాపూర్ మండలం మహదేవ్‌పూర్ జీహెచ్ఎంసీ డివిజన్ ఆఫీసు పరిధిలో అత్యధికంగా 15.1సెం.మీ, బంజారాహిల్స్‌లో 12.4 సెం.మీ వర్షం కురిసింది. ఇక హైదరాబాద్ మెట్రో రైళ్లు, స్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి.

రంగంలోకి హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి, ఐటీ కారిడార్, ఖైరతాబాద్ తదితర ప్రాంతాల్లో ఆ సంస్థ బృందాలు ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులతో సమన్వయం చేసుకుని ట్రాఫిక్ నియంత్రించారు. పలుచోట్ల వాహనాలు నీటిలో మునిగిపోయాయి. వరద వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ సిబ్బంది, అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంపై నెటిజన్లు తీవ్ర నిరసన తెలిపారు. ఇక జిల్లాల్లో మొక్కలు వాడిపోయే పరిస్థితిలో కురిసిన వర్షంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని కూకట్‌పల్లిలో 102.0 మి.మీ, రాజేంద్రనగర్ మండలం అత్తాపూర్‌లో 79.8 మి.మీ వర్షపాతం నమోదైంది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవేపై కల్వర్టు నిర్మించక 30 ఎకరాల్లో వరిపొలాలు నీటమునిగాయి. నల్లగొండ జిల్లాలో అత్యధికంగా కట్టంగూరులో 60.8 మి.మీ వర్షపాతం రికార్డయింది. యాదాద్రి జిల్లా వలిగొండ మండలం ప్రొద్దుటూరు గ్రామ సమీపాన మూసీలో కొట్టుకుపోతున్న నలుగురు పశువుల కాపర్లను పోలీసులు, రెస్క్యూ టీం రక్షించారు.



గచ్చిబౌలిలో వరద నీటి మధ్య భారీగా నిలిచిపోయిన వాహనాలు



ఖైరతాబాద్ వద్ద రోడ్డు మధ్యలో డివైడర్ మీదుగా వెళుతున్న ప్రజలు

పలు జిల్లాలకు యెల్లో అలర్ట్

నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో 2 రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ విభాగం తెలిపింది. మంగళవారం 13 జిల్లాలు, బుధవారం 12 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముండటంతో ఆయా జిల్లాలకు యెల్లో అలర్ట్ ప్రకటించింది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ సహా రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో జిల్లాల కలెక్టర్లు, అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. వర్షాలతో ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హితవు చెప్పారు. అన్ని విభాగాలు సమన్వయంతో పని చేస్తూ లోతట్టు ప్రాంతాల్లో సహాయ చర్యలు చేపట్టాలన్నారు. ఈ విషయమై సోమవారం సచివాలయంలో అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడిన సీఎం రేవంత్.. జీహెచ్ఎంసీతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా వరద ఉధృతి ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు. వచ్చే 2,3 రోజుల్లో వర్షాలు కురుస్తాయన్న సమాచారం నేపథ్యంలో కలెక్టర్లు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. ఎటువంటి సాయమైనా అందించేందుకు అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. కలెక్టర్లతో ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించడంతోపాటు విపత్తు సహాయ బృందాలు అందుబాటులో ఉండటంతోపాటు తక్షణ సాయమందించాలని ఆయన చెప్పారు.



మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలో ఉప్పొంగిన పాకాల వాగు

శ్రీశైలానికి 1.01 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ఎగువన తగ్గిన వర్షాలతో కృష్ణా బేసిన్ పరిధిలోని ప్రాజెక్టులకు వరద తగ్గడంతో ఆయా ప్రాజెక్టుల గేట్లను మూసేశారు. శ్రీశైలానికి 1.01 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో సాగుతోంది. దిగువన నాగార్జున సాగర్ నీటి మట్టం 586.50 (302.912 టీఎంసీల) అడుగులకు చేరుకుంది. ఎగువ నుంచి 66.407 క్యూసెక్కుల నీరు వస్తుండగా, రెండు కాల్వలతోపాటు ఎస్ఎల్‌బీసీ, వరద కాల్వ, జల విద్యుత్ కేంద్రంతో కలిపి మొత్తం దిగువకు 44,132 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ఎగువన ఆల్మట్టి ప్రాజెక్టుకు 20 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, విద్యుత్ ఉత్పత్తికి 15 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. నారాయణ పేట రిజర్వాయర్‌కు 15 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 2500 క్యూసెక్కులు, జూరాలకు 49 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 37,200 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేశారు. సుంకేశులకు 25 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 12,726 క్యూసెక్కుల ఔట్ ఫ్లో నమోదవుతోంది.

పొరపాటున ఉద్యోగం ఇచ్చాం

- 9 నెలలు పనిచేశాక టీచర్ తొలగింపు
- విద్యాశాఖ మరో తప్పిదం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యం.. ఒకరికి శాపమైంది. డీఎస్సీ 2024లో హిందీ పండిట్ విభాగంలో 35 పోస్టులను భర్తీ చేశారు. బీసీ-డీ కేటగిరీలో ఒక పోస్టుకు 58.30 మార్కుల(53 ర్యాంకు)తో ఒక మహిళ, 52 మార్కులు (72వ ర్యాంకు)తో ఒక పురుషుడిని 1:3 కింద ఎంపిక చేశారు. 58.30 మార్కులు సాధించిన మహిళను స్థానికత (లోకల్ కేటగిరీ) రంగారెడ్డి జిల్లాలో ఉందని పక్కకు పెట్టి, తర్వాత 52 మార్కులొచ్చిన హైదరాబాద్ జిల్లా జియాగూడ వాసి (పురుషుడు)కి ఉద్యోగం ఇచ్చారు. దీంతో ఆయన 2024 అక్టోబర్ 10న ఆసిఫ్‌నగర్ మండలం గోషాకట్ స్కూల్‌లో 9 నెలలుగా ఉద్యోగం చేస్తున్నారు. కాగా, గత జూలై 29న ఆ హిందీ పండిట్‌కు ఫోన్ చేసిన హైదరాబాద్ డీఈఓ కార్యాలయ అధికారులు ఎక్కువ మార్కులు సాధించిన మహిళ హైదరాబాద్ లోకల్ కిందకే వస్తున్నట్లు తమకు ఆధారాలు చూపారని చెప్పారు. హైకోర్టు తీర్పు మేరకు విధుల నుంచి తొలగిస్తున్నామని, ఆఫీస్‌కొచ్చి ఆర్డర్ కాపీపై సంతకం చేసి తీసుకెళ్లాలని చెప్పారు. దీంతో ఆయన అప్పటి నుంచి షాక్‌లో ఉన్నారు. డీఈఓ కార్యాలయం నుంచి ఆర్డర్ కాపీ తీసుకోకుండా ఇంటివద్దే ఉంటున్నారు. అధికారుల తప్పిదంతో తనను బలిచేసి, అన్యాయంగా ఉద్యోగం నుంచి తొలగించి కుటుంబాన్ని రోడ్డుపాలు చేయొద్దని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

తగవుల దారిలో తమ్ముడు.. రేవంత్‌కు అండగా అన్న!

మంత్రిపదవి దక్కలేదన్న అసంతృప్తితో సీఎం రేవంత్‌రెడ్డిపై తరచూ రాజగోపాల్‌రెడ్డి విమర్శలు

- మళ్లీ రేవంతే సీఎం కావాలంటున్న ఆయన సోదరుడు వెంకట్‌రెడ్డి
- గణపతి పూజ కూడా చేశానని వెల్లడి



మునుగోడు/హైదరాబాద్/నల్లగొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తనకు మంత్రి పదవి దక్కకపోవడంపై అసంతృప్తితో ఉన్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సీఎం రేవంత్ రెడ్డిపై అవకాశం దొరికినప్పుడల్లా విమరనాస్త్రాలు సంధిస్తున్నారు. మరోవైపు ఆయన సోదరుడు, మంత్రి కోమటి రెడ్డి సీఎంకు అండగా నిలుస్తున్నారు. మళ్లీ రేవంతే సీఎం కావాలని ఆకాంక్షించారు. అందుకోసం గణపతి పూజ కూడా చేశానని సోమవారం చెప్పారు. "ఓనమాలు రానోడూ యూట్యూబ్‌లో, సోషల్ మీడియాలో వీడియోలు చేస్తూ జర్నలిస్టులమని ప్రచారం చేసుకుంటున్నారు" అని రేవంత్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను రాజగోపాల్‌రెడ్డి పరోక్షంగా తప్పుపట్టారు. ప్రజల కోసం సామాజిక బాధ్యతతో పనిచేసే సోషల్ మీడియాను పాలకులు గౌరవించాలని, అవమానించడం సరికాదంటూ రాజ్‌గోపాల్ రెడ్డి సోమవారం ఎక్స్ వేదికగా విమర్శలు చేశారు. తెలంగాణ సమాజం ఆకాంక్ష మేరకు సోషల్ మీడియా తొలి నుంచీ తన శక్తి కొద్దీ పనిచేస్తూనే ఉందని ప్రశంసించారు. సోషల్ మీడియా జర్నలిస్టులను దూరం పెట్టాలని ప్రధాన మీడియాను ఎగదోయడం ముమ్మాటికి 'విభజించి పాలించు' పద్ధతేనని రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు. నిబద్ధతతో పనిచేసే సోషల్ మీడియా జర్నలిస్టులకు తన మద్దతుంటుందని భరోసా ఇచ్చారు. ఇదే కాక ఇటీవల రేవంత్.. 'మరో పదేళ్లు నేనే సీఎంగా ఉంటాను' అన్న వ్యాఖ్యలను రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్‌లో వ్యక్తి స్వామ్యం ఉండదని, సీఎం అభ్యరిని పార్టీ నిర్ణయిస్తుందన్నారు. సీఎం పదవిపై ఏకపక్షంగా ప్రకటనలు చేయడం పార్టీ విధానాలకు విరుద్ధమన్నారు.

రేవంత్‌కు వెంకట్‌రెడ్డి ఫోన్

సీఎం రేవంత్‌పై రాజ్‌గోపాల్‌రెడ్డి విమర్శలు గుప్పిస్తుంటే ఆయన సోదరుడు వెంకట్‌రెడ్డి సీఎంకు మద్దతుగా నిలిచారు. సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో రూ.13 కోట్ల వ్యయంతో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని వెంకట్‌రెడ్డి ప్రారంభించాక సీఎం రేవంత్‌రెడ్డికి ఫోన్ చేశారు. 'తెలంగాణకు మళ్లీ మీరే సీఎం కావాలి. మరోసారి మీరు సీఎం అయ్యేందుకు గణపతి పూజతోపాటు హోమం కూడా చేశాను' అని అన్నారు. భవనాన్ని మంజూరు చేసినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. రేవంత్ కూడా మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతూ.. "క్యాంపు కార్యాలయం ప్రారంభం నేపథ్యంలో కార్యకర్తలకు, ప్రజలకు భోజనాలు ఏర్పాటు చేశారా.." అని మంత్రిని అడిగారు. దీనికి వెంకట్‌రెడ్డి సమాధానమిస్తూ 5వేల మందికి భోజనాలను ఏర్పాటు చేశామన్నారు. ఎమ్మెల్యే క్యాంపు ప్రారంభోత్సవం తర్వాత వెంకట్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో తను, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సీనియర్లైనా జూనియర్ అయిన రేవంత్‌రెడ్డి పట్ల తమకు గౌరవం ఉందని చెప్పారు.

అసలు సినిమా ముందుంది..

కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతితోపాటు, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ నేతలంతా జైలుకెళ్లడం ఖాయమని వెంకట్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం ఇంజనీర్ల వద్దనే రూ.కోట్లు దొరికాయని, ఇక కేసీఆర్, హరీశ్‌రావు వద్ద ఎన్ని కోట్ల రూపాయలు ఉంటాయో అర్థం చేసుకోవచ్చన్నారు. తాము అధికారంలోకి వచ్చి 20 నెలలే అయిందని, అసలు సినిమా ముందుందన్నారు. ఏపీలో బనకచర్ల ప్రాజెక్టు కట్టనిచ్చేది లేదని, శ్రీశైలం నుంచి ఏపీ నీటి దోపిడీని అడ్డుకొని, నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేసుకుంటామని వెంకట్‌రెడ్డి చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా 119 నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నామన్నారు. నల్లగొండలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు 9నెలల్లో పూర్తయ్యేలా చూస్తామన్నారు. విద్యారంగంలో తెలంగాణ రాష్ట్రం కేరళను తలదన్నేలా కృషి చేస్తామన్నారు.



సంగారెడ్డిలోని సంజీవనగర్ ప్రాథమిక పాఠశాలలో బాత్రూమ్ వద్ద క్యూలైన్‌లో నిల్చున్న విద్యార్థినులు

113 మంది విద్యార్థులకు ఒక్కటే బాత్రూమ్!

- సంగారెడ్డిలోని సంజీవనగర్ సర్కారు బడి దుస్థితి

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని సంజీవనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద నిర్మించిన ఒక్క మూత్రశాలనే విద్యార్థినులతో పాటు ఉపాధ్యాయురాళ్లు వాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పాఠశాలలో 113 మంది విద్యార్థులుండగా అందులో బాలురు 70 మంది, బాలికలు 43 మంది ఉన్నారు. ఆరుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. బాలురు పాఠశాల ఆవరణలోని మైదానంలో బహిరంగ మూత్ర విసర్జన చేయవలసి వస్తోంది. జిల్లా కలెక్టర్ స్పందించి ఈ పాఠశాలలో మరుగుదొడ్లు, అదనపు మూత్రశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

వేర్వేరు ఘటనల్లో కిచిడీ తిని.. 64 మంది విద్యార్థినులకు అస్వస్థత

- ఖమ్మం జిల్లా కల్లూరులో 37 మందికి ఫుడ్‌పాయిజన్
- భూపాలపల్లి కేజీబీవీలో మరో 27 మందికి అస్వస్థత

కల్లూరు, భూపాలపల్లిటౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ఘటనల్లో కిచిడీ తిన్న 64 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఖమ్మం జిల్లా కల్లూరు గిరిజన ఆశ్రమ వసతి గృహం, భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం కొర్కిశాలలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. కల్లూరు గిరిజన ఆశ్రమ వసతి గృహంలో మొత్తం 86 మంది విద్యార్థినుల్లో సోమవారం ఉదయం అల్పాహారంగా కిచిడీ తిన్న 37 మంది బాలికలు అస్వస్థతకు గురయ్యారు. కడుపునొప్పి, వికారం, వాంతులు, శ్వాస ఇబ్బందులనెదుర్కొన్నారు. ఉపాధ్యాయులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు వారిని ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల చికిత్సతో వారంతా కోలుకున్నారు. ఈ సమాచారం అందుకున్న కల్లూరు డివిజన్ సబ్-కలెక్టర్ అజయ్‌యాదవ్ ఆస్పత్రిలో బాధితులను పరామర్శించారు. పాఠశాలలో రెండ్రోజులు వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామని వైద్యాధికారి నవ్యకాంత్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. కాగా.. సమాచారం అందుకుని, ఆస్పత్రికి చేరుకున్న సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి.. స్వయంగా స్టెతస్కోప్‌తో విద్యార్థినులను పరీక్షించారు. వసతి గృహంలో ఆహారాన్ని పరిశీలించి, సంక్షేమ అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా.. భూపాలపల్లి జిల్లా కొర్కిశాల కేజీబీవీలోనూ కిచిడీ తిన్న 27 మంది బాలికలు సోమవారం ఉదయం వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. హాస్టల్ సిబ్బంది వారిని అంబులెన్స్‌ల సాయంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా, పలువురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో చిట్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న అదనపు కలెక్టర్ విజయలక్ష్మి హాస్టల్‌కు చేరుకుని వివరాలను సేకరించారు. హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన చోటుచేసుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిట్యాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరామర్శించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.